www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 28 No | విజయవాడ, మంగళవారం 29 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.



సీనియర్ జర్నలిస్టు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం

8



భారత్ షమిష్టి విజయం

- మూడో వన్డేలోనూ కివీస్ చిత్తు
- వన్డే సిరీస్ 3-0తో కైవసం

12

ప్రతి నిరుపేదకీ కనీస ఆదాయం

- ఖాతాలోకి నేరుగా డబ్బు
- రాహుల్ ఎన్నికల హామీ

న్యూఢిల్లీ : తాము అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేదకి కనీస ఆదాయం లభించేలా, ఎవరూ ఆకలితో నిద్రపోకుండా వుండేలా చూస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ తాము చెబుతున్న పథకం లేదని, పేదలు ఆకలితో ఉంటే ఆధునిక భారత్‌ను నిర్మించలేమన్నారు. నిరుపేదలకు కనీస ఆదాయాన్ని హామీనిస్తూ వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామని చెప్పారు. తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ హామీని అమలు చేస్తామన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించిన 'కిసాన్ అబార్ సమ్మేళన్' (రైతు కృతజ్ఞత సదస్సు)లో రాహుల్ ప్రసంగించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, ఆర్‌టిఐ వంటి ఎన్నికల వాగ్దానాలను అమలు చేసి తాము మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. ప్రధాని మోడీ, పాలక బిజెపి రెండు భారతదేశాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని రాహుల్ విమర్శించారు. ఒకటి అనీల్ అంబానీ, నీరవ్ మోడీ, విజయ్ మాల్యా, మెహుల్ చోక్సీ వంటి వాళ్ళకు కాగా, రెండోది నిరుపేద రైతుల కోసమని విమర్శించారు. ఛత్తీస్‌ఘడ్‌లో అధికారంలోకి వచ్చాక 6వేల కోట్లకు పైగా రుణాలను కాంగ్రెస్ రద్దు చేసింది. సమావేశంలో కొంతమంది లబ్దిదారులకు రుణరద్దు సర్టిఫికెట్లను రాహుల్ అందచేశారు.



నాకే చుక్కలు చూపిస్తారా!

కేబినెట్ ఆదేశాలు అమలు చేయండి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చుక్కల భూముల సమస్యలను పరిష్కరించే విషయంలో నిబంధనలు, సాంకేతిక అంశాలంటూ సాకులు చెబుతూ ఇబ్బందులు సృష్టించకుండా మంత్రిమండలి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. సరళమైన విధానాలతో ఈ సమస్యను పరిష్కరించాలని అన్నారు. మంత్రిమండలి ఆదేశాల తరువాత కూడా ఈ సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల సిఎం అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో 'చుక్కల భూముల సమస్యలను పరిష్కరించమంటే కొందరు అధికారులు నాకే చుక్కలు చూపిస్తున్నారు' అని సిఎం వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లాలో చుక్కల భూముల సమస్య లేదని, జిల్లాలో అనుసరించిన డిజిటలైజేషన్ విధానాన్ని అస్సాం సచివాలయంలో అమలు చేస్తున్నారని సిఎం తెలిపారు. గుంటూరు మిగతా 9లో

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే

తాయిలాలు

- ద్విముఖ రాజకీయాల స్థానంలో బహుముఖ రాజకీయ పరిస్థితి
- జనసేన, సిపిఎం, సిపిఐ మధ్య ఫిబ్రవరిలో సీట్ల ఒప్పందం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి/అమరావతి బ్యూరో

నాలుగున్నరేళ్ల కాలంలో టిడిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిందని, వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే ఎన్నికలకు ముందు మళ్లీ పింఛన్లు, బిసి జయహో పేరుతో తాయిలాలు ప్రకటిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రెండురోజుల పాటు జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ చేసిన తీర్మానాలను



వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో, చుక్కల భూముల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, కరువు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. మద్యాన్ని నియంత్రించకుండా బెల్ట్‌షాపులను విస్తరించిందని మిగతా 9లో

ఫిబ్రవరి 1న రాష్ట్ర వ్యాప్త నిరసనలు

బైక్ ర్యాలీలు, దిష్టిబొమ్మల దగ్ధం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయడంలో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహానికి నిరసనగా ఫిబ్రవరి 1న నిరసన కార్యక్రమాలకు సిపిఎం పిలుపునిచ్చింది. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వ దిష్టబొమ్మలు దగ్ధం చేయాలని, సిపిఐతో సహా కలిసొచ్చే ఇతర పార్టీలను కలుపుకుని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరింది.

మోసాన్ని కప్పిపెట్టడమే

ప్రత్యేక హోదా, విభజన హామీల అమల్లో రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో కలిసి వాటి అమలు కోసం పోరాటం చేయడమంటే ఇప్పటి వరకూ బిజెపి చేసిన మోసాన్ని కప్పిపెట్టడమే అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 29న విజయవాడలో ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కార్యక్ర మానికి సిపిఎం హాజరు కావడం లేదని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై నాలుగున్నర సంవత్సరాలుగా సిపిఎం స్వతంత్రంగానూ, వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధన సమితితోనూ కలిసి ఐక్యంగానూ ఆందోళన చేస్తోందని, ఇక ముందూ దాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

పోలీసు వలయంలో కిర్లంపూడి

ముద్రగడ ఇంటి వద్ద బలగాల మోహరింపు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, పెద్దాపురం

కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం స్వగ్రామమైన కిర్లంపూడి మళ్లీ పోలీసు వలయంలోకి వెళ్లిపోయింది. ఈనెల 31న కత్తిపూడిలో బహిరంగ సభను నిర్వహించేందుకు ముద్రగడ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మూడు రోజులు ముందుగానే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన నివాసం చుట్టూ పోలీసుల బలగాలను మోహరించారు. ఆయన ఇంటి ఎదుట మూడు సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలు చేరుకున్నప్పటికీ ముద్రగడ నివాసానికి ప్రజలు, అభిమానుల రాకపోకలు కొనసాగాయి. వందలాదిమంది పోలీసులు భారీగా చేరుకున్నప్పటికీ ముద్రగడ మాత్రం నిశ్శబ్దంగా ఉండడంతో ఇటు ప్రభుత్వంలోనూ, అటు పోలీసుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. రాబోయే రెండురోజుల్లో గ్రామంలో 144 సెక్షన్ విధించే అవకాశం కనిపిస్తోంది. కాపు జెఎసి నేత వాసిరెడ్డి ఏసుదాసు, రౌతుస్వామి సోమవారం ముద్రగడ నివాసంలో చర్చలు జరిపారు. కాపు జెఎసి నేతలు మాత్రం కత్తిపూడి సభ జయప్రదానికి ప్రచారం మిగతా 9లో



సిఎంతో కోట్ల కుటుంబం భేటీ

- కర్నూలులో మారనున్న రాజకీయం
- మాతో ఎవరూ చర్చించలేదు : కెఇ

9

ఇలా ఐతే రాజీనామా చేస్తా

- ఎమ్మెల్యేలను అదుపులో పెట్టుకోండి
- కాంగ్రెస్‌కు సిఎం కుమార స్వామి హెచ్చరిక

9



ధరిత్రి రక్షణకై..

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై పర్యావరణ ప్రేమికులు గళమెత్తారు. భూతాపాన్ని తగ్గించేందుకు వివిధ దేశాల్లో నేతలు చేసిన వాగ్దానాలను అమలు చేయాలంటూ ఆదివారం బ్రస్సెల్స్‌లో 70,000 మంది ప్రదర్శన నిర్వహించారు. అటు పారిస్‌లోనూ వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. గత నెల రోజుల కాలంలో ఫ్రాన్స్, బెల్జియంలో వరుసగా పర్యావరణ పరిరక్షణ కోసం వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు.



బయల్దేరిన జనసేన రధాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీ ప్రచార రధాలను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ గుర్తయిన గాజు గ్లాస్‌లో టీ పోసి భవన నిర్మాణ కార్మికులకు అందజేశారు. ప్రచార రధాల వివరాలు వెల్లడస్తూ... రోజుకు 10 గ్రామాల చొప్పున మొత్తం 17 ప్రచార రధాలు 170 గ్రామాలు పర్యటించి పార్టీ సిద్ధాంతాలు, మ్యానిఫెస్టోపై ప్రచారం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. పార్టీ గుర్తు గాజు గ్లాస్‌తో ప్రజలకు టీ ఇవ్వడంతోపాటు మెంబర్ షిప్ డ్రైవ్ నిర్వహించనున్నారు. రధాలకు అమర్చిన ఎల్ఇడి స్కీన్‌తో పవన్ ప్రసంగాలను ముఖ్య కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు.



రాజధానిలో 2,400 ప్లాట్లు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పిఎంఎవై-ఎన్‌టిఆర్ నగర్ గృహ నిర్మాణ పథకం ద్వారా రాజధాని పేదలకు 2,400 ప్లాట్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు సోమవారం పంపిణీ చేశారు. రాజధాని ప్రాంతం, మండల కేంద్రమైన తుళ్లూరు జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా ప్లాట్లను లాటరీ ద్వారా తీశారు. క్లస్టర్ల వారీగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, జెడ్‌పిటిసి బెజవాడ నరేంద్రబాబు, ఎంపిపి వడ్లమూడి పద్మలత, వైఎస్ ఎంపిపి శ్రీనివాసరావు ఇళ్ల పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి పుల్లారావు మాట్లాడుతూ పేదల సంక్షేమం, సంతోషం చంద్రబాబు ఆశయమని, నిధుల కొరత ఉన్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ప్లాట్లను అమ్ముకోవద్దని, భవిష్యత్‌లో వాటి విలువ ఎంతో పెరుగుతుందని సూచించారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని పరిధిలో ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌డిఎ గ్రూప్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసబాబా, ల్యాండ్ డైరెక్టర్ బిఎల్ చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ఆదరణ కోసం నిరీక్షణ

పెండింగ్‌లో 38వేల దరఖాస్తులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆదరణ పరికరాల కోసం చేసుకున్న దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి, దాదాపు 38 వేల దరఖాస్తులు అపరి ష్కృతంగా ఉన్నట్లు సమాచారం. దరఖాస్తుల పరిశీలన మూడు దశల్లో జరగాల్సిఉండగా, ప్రాథమిక స్థాయిలోనే అంటే మండల అభివృద్ధి అధికారి (ఎంపిడివో) కార్యాలయాల్లోనే అధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కార్యాలయాల్లోనే 27, 337 దరఖాస్తులు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇడి స్థాయిలో 3, 475 దరఖా స్తులు పెండింగ్‌లో ఉండగా, కలెక్టర్ల దగ్గర సుమారు 8, 111 దరఖాస్తులు పరిశీలన కోసం నిరీక్షిస్తున్నటు ప్రభుత్వ గణాంకాల్లోనే తేలుస్తోంది. వీటి ప్రకారం తూర్పు గోదావరి జిల్లా ఎంపిడిఓ కార్యాలయంలో 3, 113, గుంటూరు ఎంపిడిఓ కార్యాలయంలో 3, 302 దరఖాస్తులు పెండిం గ్‌లో ఉన్నాయి. ఇక కలెక్టర్ల కార్యాలయాల్లో ఉన్న వాటిల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో 2338, విశాఖపట్నంలో 2021, గుంటూరులో 1528 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇడి కార్యాలయా ల్లో అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 1132 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఆదరణ కింద ఆయా వృత్తిదారులకు పనిముట్లు అందించాలని చూస్తోన్న ప్రభుత్వం వాటి నాణ్య తపై మాత్రం దృష్టి సారించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. అంతర్జాతీయ సృజనాత్మక వ్యవసాయ సదస్సు 2018 ఎక్కడ జరిగింది?
2. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎక్కడ జరిగింది?
3. వారణాసిలో జరిగిన ప్రవాసీ భారతీయ దివాస్ ఎన్నోవది?
4. పద్మశ్రీ అవార్డును తిరస్కరించిన ప్రముఖ రచయిత్రి ఎవరు?
5. అతి పిన్న వయస్సులో అర్ధ సెంచరీ చేసిన నేపాల్ క్రిడాకారడు ఎవరు?

అన్నదాతల అష్టకష్టాలు

పంటలు కాపాడుకునేందుకు తంటాలు • నేడూ జల్లులు



కృష్ణా జిల్లా వత్సవాయిలో మిర్చి పంటలపై కప్పిన టార్పాలిన్

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడిపోయింది. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. మరో 24 గంటలు ఇదే పరిస్థితి కొనసాగుతుందన్న భారత వాతావరణ కేంద్ర ప్రకటనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లావ్యాప్తంగా జల్లులతో కూడిన ఒక మోస్తరుగా వర్షం కురుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. రెంటచింతలలో 34.2 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గోలి గ్రామంలోని గోలి వాగు చప్టాపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. చివరితీతకు సిద్ధంగా ఉన్న పత్తి తడిసి పాడవుతోంది. మిర్చికాయలు తడిసి రంగు మారుతున్నాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. డెల్టాలోని కొల్లూరు, భట్టిప్రోలు ప్రాంతంలో ఇసుకు బట్టీల్లో ఇటుకలు దెబ్బతింటున్నాయి. డెల్టాలోని వరిసాగు చేసిన రైతులు కొన్నిచోట్ల నూర్పిడికి సిద్ధం కాగా వర్షాలతో ఇబ్బంది పడుతున్నారు. వరి అనంతరం అపరాలు, జొన్న, మొక్కజొన్న పైరు ఇప్పుడిప్పుడే లేత దశలో తేమ నుండి మొక్క పెథాయ్ తుపాను కారణంగా సాగు ఆలస్యం కావడంతో మొక్క ఇప్పుడిప్పుడే లేత దశ నుండి కోలుకుంటోంది. కొన్నిగ్రామాల్లో ఇప్పటికీ భూమి తేమగానే ఉండి మొక్కలు జిగటబారి ఉన్నాయి. చివరి భూములకు చెందిన రైతులు మాత్రం ఈ వర్షాలతో కొంత సంతోషంగా ఉన్నారు. ఇప్పటివరకూ వర్షం లేక, నీరు రాక ఇబ్బంది పడుతున్న రైతుల తాము సాగు చేసిన మొక్కజొన్నకు ఈ వర్షం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కృష్ణా జిల్లాలోని నూజివీడు, జగ్గయ్యపేట, నందిగామ, ఎ.కొండూరు, విసన్నపేట, రెడ్డిగూడెం, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో ఒక మోస్తరు నుంచి అధిక భారీ వర్షాలు కురిశాయి. పొగాకు, మిర్చి, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు వాపోయారు. విజయవాడలో మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో, రోడ్లు చిత్తడిగా మారి జనజీవనానికి కొంత ఇబ్బందికరంగా తయారైంది. చలితీవ్రత పెరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రాజమహేంద్రవరం రూరల్, కడియం, రావులపాలెం, అమలాపురం, మన్యంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ భారీగా వర్షం కురిసింది. మన్యంలో వర్షానికి మిరప పంటకు నష్టం వాటిల్లింది. సుమారు 40 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. ఎండబెట్టిన మిరపకాయలు తడిచిపోయాయి. కోనసీమలో వరిపొలాల్లోకి వర్షపు నీరు చేరింది. ప్రస్తుతం వరిపంటకు ఈ వర్షం వల్ల ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. రెండు మూడు రోజులు ఇలాగే వర్షాలు ఉంటే మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ముంపునీరు దిగేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. నెల్లూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కోవూరు, కావలి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలోని ఆదోని, నంద్యాల, కర్నూలు డివిజన్లలో తుంపరతో కూడిన వర్షం పడింది. ఈ వర్షానికి పంట పొలాల్లో కోత కోసి పెట్టిన జొన్న, శనగ, కంది పంటలు తడిసిపోయాయి.

కొనసాగుతున్న ద్రోణి

ఉత్తరప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు కర్నాటక నుంచి కేరళ వరకు మరో ద్రోణి కొనసాగుతోందని తెలిపింది. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమతో పాటు తెలంగాణాలోనూ మంగళవారం అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం ఉదయానికి కొయ్యలగూడెంలో 5.0, నందిగామ 4.6, అచ్చింపేట 3.7, కావలి 3.4, మాచెర్ల 3.2, నూజివీడు 2.8, గుడివాడ 2.7, భీమడోలు 2.6, రాచెర్ల 2.4, ఏలూరు 2.2, జంగమహేశ్వరం, పిడుగురాళ్ల 2.0, రాయలసీమలోని సాంబపల్లెలో 6.4, కర్నూలు 3.7, వల్లూరు 3.2, కళ్యాణదుర్గం 3.0, కంబదూరు, రాయచోటి 2.5, తంబళ్లపల్లె 2.0 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

30న చంద్రబాబు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన హామీల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈనెల 30న అఖిల పక్ష భేటీ నిర్వహించనున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే విభజన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాజమండ్రి మాజీ ఎ ంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ రాసిన లేఖపై చంద్రబాబు స్పందించారు. మంగళవారం విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో అఖిలపక్షం, మేధావుల సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి హాజరుకావాలని ఉండవల్లి అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాశారు. ఈ సమావేశానికి టిడిపి నుంచి రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్, మంత్రి నక్కా ఆనందబాబును పంపాలని టిడిపి నిర్ణయంచింది. టిడిపితో కలిసి వేదికను పంచుకోలేమని, ఈ భేటీకి తాము హాజరుకావడం లేదని వైసిపి నాయకత్వం ఉండవల్లికి తెలిపినట్లు సమాచారం.

హాజీలపై జిఎస్‌టిని ప్రభుత్వమే భరిస్తుంది : మంత్రి ఫరూక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం హజ్ యాత్రికులపై జిఎస్‌టి విధించడం దురదృష్టకరమని, రాష్ట్ర ప్రభుత్వమే జిఎస్‌టీ భరించే విధంగా సిఎంతో చర్చించి చర్యలు తీసుకుంటామని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. విజయవాడ ఏపి స్టేట్ హజ్ కమిటీ కార్యాలయంలో సోమవారం మంత్రి ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల వాలంటీర్‌ల ఎంపిక కోసం డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజీలపై తొలుత 12 శాతం జిఎస్‌టి విధించిన కేంద్రం తర్వాత 5 శాతానికి తగ్గించారన్నారు. హజ్ యాత్రికులకు సేవ చేయడానికి వాలంటీర్లుగా ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. గతంలో ముంబాయి నుంచే యాత్రకు వెళ్ళే అవకాశముండేదని, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నుంచి వెళ్ళే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో విజయవాడ నుంచే నేరుగా యాత్రకు వెళ్ళేట్టు కృషి చేస్తామన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రం నుంచి 2,138 మంది హజ్ యాత్రకు వెళ్ళనున్నట్టు చెప్పారు. ముస్లింల హజ్ యాత్ర కోసం తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం కోటి రూపాయలు కేటాయిస్తే, ఇక్కడ రూ. 3 కోట్లు కేటాయించినట్టు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ఎంఎ షరీఫ్ తెలిపారు. మొత్తం 103 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, వారిలో 88 మంది మాత్రమే తమ డాక్యుమెంట్లు కమిటీకి పంపారు. వీటిల్లో నిబంధనల ప్రకారం ఉన్న 59 దరఖాస్తుల్లో నుంచి డ్రా ద్వారా 10 మందిని వాలంటీర్లుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ మొమిన్ అహమ్మద్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ అధికారి మహ్మద్ లియాఖత్ ఆలీలు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

జయహో బిసి అనే అర్హత బాబుకు లేదు

వైసిపి ప్రధాన కార్యదర్శి ధర్మాన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాయమాటలతో చంద్రబాబు నాయుడు బిసిలను మభ్యపెడుతున్నారని, జయహో బిసి అనే అర్హత ఆయనకు లేదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాటలు నమ్మి మోస పోవడానికి బిసిలు సిద్ధంగా లేరన్నారు. ఐదేళ్ల కాలంలో బిసిలకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలన్నారు. బిసిలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ పథకమైనా పెట్టారా అని ప్రశ్నించారు. ప్రశ్నిస్తారనే భయంతో జయహో బిసి లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని, నిజంగా మేలు చేస్తే ఇలాంటి సభలు పెట్టాల్సిన అవసరం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పుడు ఏ వర్గాలకు చెందిన వారిని కేంద్ర మంత్రులుగా పంపారో అందరికి తెలుసన్నారు. బిసిలకు జరిగిన అన్యాయాలపై జస్టిస్ ఈశ్వరయ్య చేసిన ఆరోపణలకు చంద్రబాబు ఎందుకు సమాధానం చెప్పలేకపోయారని ప్రశ్నించారు. మత్యకారులను ఎస్టీల్లో కలుపుతామని ఓట్లు వేయించుకొన్నారని, నిరసన తెలిపితే అంతు చూస్తానన్న మాటలను ప్రజలు మర్చిపోలేదని అన్నారు.

పెరిగిన రవాణా ఆదాయం

వాహన రిజిస్ట్రేషన్లలోనూ పెరుగుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతేడాదితో పోలిస్తే రవాణా శాఖ ఆదాయం పెరిగింది. వాహన రిజిస్ట్రేషన్లలోనూ పెరుగుదల నమోదైంది. రవాణా శాఖ నివేదికలు ఈ వివరాలను స్పష్టం చేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలోని మూడు త్రైమాసికాలకు కలిపి రూ.2291.15 కోట్లు ఆదాయం రవాణా శాఖకు రాగా ఈ ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాలకు రూ.2505.09 కోట్ల ఆదాయం సమకూరింది. 9.34 శాతం వృద్ధిని సాధించింది. గత ఆర్థిక సంవత్సంలో లైఫ్ ట్యాక్సుల రూపంలో రూ.1020.63 రాగా ఈ ఏడాది రూ.1155.92 కోట్లు, త్రైమాసిక ట్యాక్సుల రూపంలో గతేడాది రూ.575.55 కోట్లు రాగా ఈ ఏడాది రూ.606.88 కోట్లు, ఫీజుల రూపంలో గతేడాది 404.30 కోట్లు రాగా ఈ ఏడాది రూ.407.44 కోట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ రూపంలో గతేడాది రూ.213.56 కోట్లు రాగా ఈ ఏడాది రూ.255.08 కోట్లు, యూజర్ ఛార్జీల రూపంలో గతేడాది రూ.77.12 కోట్లు రాగా ఈ ఏడాది రూ.79.77 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయార్జనలో కృష్ణా జిల్లా రూ.342.30 శాతంతో ప్రథమ స్థానంలో, రూ.306.89 కోట్లతో విశాఖపట్నం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచాయి. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 7,31,648 వాహనాలు రిజిస్ట్రేషన్ అవ్వగా ఈ ఏడాది 7,78,424 వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ద్విచక్రవాహనాలు గతేడాది 6,30,678 రిజిస్ట్రేషన్ కాగా ఈ ఏడాది 6,60,725, నాలుగు చక్రాల వాహనాలు గతేడాది 47,504 రిజిస్ట్రేషన్ కాగా ఈ ఏడాది 49,721, సరుకు రవాణా వాహనాలు గతేడాది 28,231 రిజిస్ట్రేషన్ కాగా ఈ ఏడాది 32,564, ప్యాసింజర్ వాహనాలు గతేడాది 4,590 రిజిస్ట్రేషన్ కాగా ఈ ఏడాది 6,617, ఆటోలు గతేడాది 20,645 రిజిస్ట్రేషన్ కాగా ఈ ఏడాది 28,797 రిజిస్ట్రేషన్ అయ్యాయి.

19న వైసిపి 'బిసి గర్జన'

బిసి నేతలతో సమావేశంలో జగన్ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఫిబ్రవరి 19వ తేదిన బిసి గర్జన నిర్వహించాలని వైసిపి నిర్ణయించింది. హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో బిసి నేతలతో ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిసిల స్థితిగతులు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బిసిలకు ఏం చేస్తామనే విషయాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు పాటు టిడిపి ప్రభుత్వం నాలుగేళ్లలో బిసిలను ఏ విధంగా నిర్లక్ష్యం చేసిందనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా 19వ తేది బిసి గర్జన నిర్వహించాలన్న సూచనను జగన్ ఆమోదించారు. బిసిల్లో ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు, ఆర్థికంగా చేయూతనందించడమే వైసిపి ముఖ్య ఉద్దేశ్యమని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ బిసి అధ్యయన కమిటీ ఛైర్మన్, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి, సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, కె.పార్ధసారధి, మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, జోగి రమేష్, చిల్లపల్లి మోహన్‌రావు, వేణు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

టిడిపి పాలనలో బిసిలకు అన్యాయం : జంగా కృష్ణమూర్తి

టిడిపి పాలనలో బిసిలు తీవ్రంగా నష్టపోయారని వైఎస్ఆర్‌సిపి బిసి సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి అన్నారు. గత ఎన్నికల్లో బిసిలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేయలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో బిసి కులాల స్థితిగతులను, జీవన ప్రమాణాలపై వైఎస్ జగన్‌కు నివేదిక అందజేశామని తెలిపారు.నివేదికలో పొందు పరిచ్చిన అన్ని విషయాలపై వైఎస్ జగన్‌తో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు.

మొసలి కన్నీరు కారుస్తున్నారు : పార్ధసారధి


చంద్రబాబు బిసిల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని పార్ధసారధి అన్నారు. నాలుగున్నరేళ్లుగా గుర్తుకురాని బిసిలు ఎన్నికల ముంగిట గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. చంద్రబాబు వాగ్దానాలు, హామీలు అధికార పీఠం కోసం తప్పితే, వారి అభివృద్ధి కోసం కాదని అన్నారు. వైఎస్ఆర్ హయాంలో ఫీజురియంబర్స్‌మెంట్ వందశాతం అమలైతే... చంద్రబాబు పాలనలో కనీసం 30 శాతం కూడా అందని పరిస్థితి నెలకొందన్నారు.

ప్రత్యేకం

బిసిల ఐక్యతను దెబ్బతీసే కుట్ర

కుట్రలు, కుతంత్రాలలే వైసిపి అజెండా • టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



బిసి కులాల ఐక్యతను కాపాడుకోవాలని, బిసిల ఐక్యతను దెబ్బతీయాలనే కుట్ర జరుగుతోందని,. బిసిలపై వైసిపి, టిఆర్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు ఎన్నికల మిషన్ 2019 పై సిఎం పార్టీ ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు..ఈ సందర్భంగా కుట్రలు, కుతంత్రాలే వైసిపి అజెండా అని, అధికారం కోసమే దగ్గుబాటి కుటుంబంలో వైసిపిలో చేరికన్నారు. దగ్గుబాటి మారని పార్టీలు లేవని, ఆర్‌ఎస్‌ఎస్ మొదలు అన్ని పార్టీల చుట్టూ ప్రదక్షణలు చేశారని ఆయన పేర్కొన్నారు.. బిజెపి, కాంగ్రెస్, బిజెపి ఇప్పుడు వైసిపి అన్నారు. అధికారం కోసమే వారి ఫిరాయింపులని, అధికారం కోసమే లక్ష్మీపార్వతి వైసిపితో కుమ్మక్కయ్యారన్నారు. వీళ్ల అవకాశ వాదంతో ఎన్టీఆర్‌కు అప్రదిష్ట అన్నారు. అవకాశ వాదులంతా వైసిపి గూటికి చేరారన్నారు. కాపుల రిజర్వేషన్లను వైఎస్ వ్యతిరేకించారని, బిసిలపై వైఎస్ కక్ష సాధించారన్నారు 'జయహోబిసి' సభ చారిత్రాత్మకమని విజయవంతం చేసిన వారందరికీ చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. జయహో బిసి స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బిసిలకు ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బిసి ఫెడరేషన్లను కార్పొరేషన్లగా మార్చడంతో పాటు యాదవ, శెట్టి బలిజ, చేనేత కార్పొరేషన్లగా మార్చడంతో పాటు బిసి సబ్‌ప్లాన్‌కు చట్టబద్దత ఇస్తామన్నారు. రాజమండ్రి సభ 'మూడ్ ఆఫ్ ది స్టేట్'కు నిదర్శనమన్నారు. 14 ఏళ్ల బాలిక వైష్ణవి స్ఫూర్తి అందరిలో రావాలని చంద్రబాబు అన్నారు. కాపుల రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశంలో బిజెపి ఓటమే లక్ష్యంగా పనిచేయాలని, అమరావతిలో చివరి ధర్మపోరాట దీక్ష అని జాతీయ పార్టీల నేతలంతా వస్తారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మధురై పర్యటనలో నల్లజెండాలు, నల్లబెలూన్లతో తమిళులు నిరసనలు తెలిపడమమే బిజెపి పై 'మూడ్ ఆఫ్‌ది నేషన్'కు నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గజ తుఫాన్‌పై మోడీ నిర్లక్ష్యానికి మదురైలో నిరసనలు వ్యక్తం చేశారని, తమిళనాడుతో పోలిస్తే ఏపీకి తీరని ద్రోహం చేశారని, మోడీ, అమిత్‌షాలు రాష్ట్రానికి వస్తే అంతకన్నా తీవ్ర వ్యతిరేకత, నిరసనలు ఉంటాయన్నారు.

రేషన్ కార్డుల దరకాస్తులను తక్షణమే పరిష్కరించాలి : చంద్రబాబు

పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సోమవారం జిల్లాకలెక్టర్లతో సిఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 8,476 దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తుదారులకు కార్డుల్ని తక్షణమే అందజేయాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తరేషన్‌కార్డుల కోసం 55,540 దరకాస్తులు వచ్చాయనీ, వాటిలో 40,040 దరఖాస్తులకు ఆమోదించినట్లు తెలిపారు. వివిధ కారణాలచేత 7024 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. ఆమోదించిన కార్డుల్లో ఇప్పటికే 15,229 కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన 24,811 కార్డులను సత్వరమే ప్రజలకు అందేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు.

సంక్షిప్తం

ఆరోగ్యశాఖ ముఖ్య అధికారికి స్వైన్‌ఫ్లూ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

చలి తీవ్రత పెరగడంతో గత కొన్ని నెలలుగా అధికారులను, ప్రజలను ముప్పు తిప్పలు పెట్టిన స్వైన్‌ఫ్లూ మళ్లీ విజృంభించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఓ ముఖ్య అధికారికి ఈ వ్యాధి సోకడం తీవ్ర కలకలం రేపుతోంది. గత మూడు రోజులుగా తీవ్ర జ్వరం, దగ్గు, జలుబులతో బాధపడుతున్న ఆయనకు జరిపిన నిర్ధారణ పరీక్షలలో సోమవారం స్వైన్‌ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సమాచారం. కల్లూరుకు చెందిన ఓ మహిళకు కూడా స్వైన్‌ఫ్లూ పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతేడాది 2018లో మొత్తం 70 కేసులు నమోదు కాగా 18 మంది మృత్యువాత పడ్డారు. ఈ సంవత్సరం జనవరి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం 7 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం 77 కేసులు నమోదయ్యాయి.

పని చేసేవారికి జనసేన వేదిక : మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పని చేసే వారికి జనసేన పార్టీ వేదికని మాజీ స్పకర్ నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన పులువురు పార్టీలో చేరారు. వావిలాల గోపాలకృష్ణయ్య మనువడు మన్నవ సొడెకర్, విజయవాడకు చెందిన సిరిపురపు ప్రాన్సిన్స్, కృష్ణ జిల్లా ఆగిరిపల్లికి చెందిన పిసిసి కార్యదర్శి పాతూరి రవి, బండి పవన్‌కుమార్, దేవిశెట్టి సత్యనారాయణ తదితరులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన పార్టీ భలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు.

'ఎంసిసి' అటెండర్ల వేతనం రూ.12 వేలకు పెంచాలి

ఉపాధి పథకంలో భాగంగా మండల కంప్యూటర్ సెంటర్ (ఎంసిసి)లో పని చేస్తున్న అటెండర్లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.12 వేలకు పెంచాల్సిందిగా ఎంసిసి అటెండర్ల యూనియన్ ఎపి రాష్ట్ర శాఖ కోరింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2010 నుంచి ఎంసిసిల్లో అటెండర్లుగా పని చేస్తున్నా కేవలం రూ.6 వేలు మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

4లోపు కానిస్టేబుల్ అభ్యర్థులు స్టేజ్-2 దరఖాస్తును సమర్పించాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ శాఖలోని కానిస్టేబుల్, జైళ్ల శాఖలోని వార్డర్, అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్ పోస్టుల ప్రాథమిక రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులు ఫిబ్రవరి 4లోపు స్టేజ్-2 దరఖాస్తును సమర్పించాలని ఎపి పోలీస్ నియామక మండలి చైర్మన్ కుమార్ విశ్వజిత్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. యూనిట్ ప్రిఫరెన్స్, విద్యార్హత, నివాసం వంటి వివరాలు ప్రాథమిక రాత పరీక్ష దరఖాస్తులో సమర్పించలేదని, ఆ వివరాలను స్టేజ్-2 దరఖాస్తులో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ దరఖాస్తును సోమవారం నుంచే అందుబాటులో ఉంచామని, ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తు పత్రాన్ని దేహదారుఢ్య పరీక్షకు హాజరయ్యే సమయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ఎఆర్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ పోస్టుల ఉన్నతీకరణ

పోలీస్ శాఖలోని ఆర్మ్‌డ్ రిజర్వ్(ఎఆర్) కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ పోస్టులను ఉన్నతీకరిస్తూ(అప్‌గ్రేడ్ చేస్తూ) హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 546 ఎఆర్ కానిస్టేబుల్ పోస్టులను హెడ్ కానిస్టేబుల్ పోస్టులుగా, 91 ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ పోస్టులను ఎఆర్ ఎఎస్సై పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ యువజనోత్సవాల్లో 13 జిల్లాల నుంచి సుమారు 800 మంది కళాకారులు పాల్గొనున్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఇండోర్ స్టేడియంలో ప్రారంభోత్సవ సభ జరగనుంది. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరవుతారని సెట్‌వెల్ సిఇఒ సుబ్బిరెడ్డి తెలిపారు. ఏకాంకిక నాటక పోటీలు 30, 31 తేదీల్లో వైఎంహెచ్ఎ హాలులో, జానపద నృత్యం గ్రూపు, ఆధునిక నృత్యం గ్రూపు పోటీలు ఈ నెల 29, 30, 31 తేదీల్లో సిఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో, జానపద గేయం గ్రూపు, సోలో, ఆధునిక గీతాలు ఈ నెల 29, 30, 31 తేదీల్లో సిఆర్ రెడ్డి కళాశాల ఆడియో విజువల్ హాలులో, శాస్త్రీయ నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, మిమిక్రీ, సంగీత వాయిద్యాలు తదితర పోటీలు ఈ నెల 29, 30, 31 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ఉన్న గిరిజన భవనంలో జరుగుతాయని తెలిపారు.

కళాజాతాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి



మడ అడవులతోనే పర్యావరణ పరిరక్షణ

ఎపిఎన్‌జిసి కళాజాతాలో ఎమ్మెల్యే వనమాడి

ప్రజాశక్తి- కాకినాడ(తూర్పుగోదావరి)

మడ అడవుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, అటవీశాఖ, అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా కళాజాతాను నిర్వహించారు. కాకినాడ చర్చి స్క్వేర్ పార్కు వద్ద ఈ జాతాను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పెథాయ్ తుపాను తీవ్రతను మడ అడవులే అడ్డుకున్నాయన్నారు. మడ అడవులు లేకుంటే తీరప్రాంతాలు తుడిచిపెట్టుకుపోతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందరూ మడఅడవుల రక్షణకు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎపిఎన్‌జిసి, అగ్రి ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ రవి శంకర్ మాట్లాడుతూ చిత్తడినేలలు సారవంతమైనవన్నారు. వాటిని పరిరక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కోర్ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడారు.

'డ్రై రిసోర్స్'పై ప్రజాగ్రహం

- నెలరోజులుగా శీకువానిపాలెం వాసుల ఆందోళన
- పట్టించుకోని ప్రభుత్వం
- చర్చలకు పిలిచి సిపిఎం నేతపై దాడి

ప్రజాశక్తి- గాజువాక

విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గంలో డ్రై రిసోర్స్ (చెత్త శుద్ధి కేంద్రం) సెంటర్‌పై ప్రజాగ్రహం రోజురోజుకు తీవ్రమవుతోంది. నెలరోజులుగా శీకువానిపాలెం గ్రామస్తులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో చర్చలకని పిలిచి సిపిఎం నేత రాంబాబుపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే స్థానికులు ఆయనకు మద్దతుగా నిలిచారు.

గాజువాక నియోజకవర్గపరిధి శీకువానిపాలెం బాలచెరువు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఉన్న ఎకరా విస్తీర్ణ స్థలంలో 10 టన్నుల చెత్తను డంప్ చేసి తడి, పొడి చెత్తగా వేరు చేయడానికి డ్రై రిసోర్సు సెంటర్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు పనులు కూడా ప్రారంభించారు. దీనిని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. జనాల మధ్య ఈ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల జీవించలేమని, వ్యాధుల బారిన పడతామని, తక్షణం తొలగించాలని ఎమ్మెల్యే, అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. దీనికి అధికారులు ససేమేరా అనడంతో అక్కడే టెంట్ వేసి నెల రోజులుగా గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఈ సెంటర్ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్న 14 గ్రామాల ప్రజలు నివసించలేరని వాపోయారు. దుర్వాసనతో పాటు కార్బన్‌డైయాక్సైడ్ విపరీతంగా విడుదలవుతుందని, భూగర్భజలాలన్నీ కలుషితమవుతాయని తెలిపారు. వీటి వల్ల గ్రామస్తులకు క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులు వచ్చే అవకాశముందని, దోమలు, ఈగలు వృద్ధి చెంది.. ఇప్పటికే ఈ గ్రామస్తులు గంగవరంపోర్టు కాలుష్యం వల్ల నానాఅవస్థలు పడుతున్నారు. మరోవైపు రామచంద్రనగర్ డంపింగ్ యార్డు నిర్మాణం వల్ల రామ్‌చంద్రనగర్, స్వతంత్రనగర్, రిక్షాకాలనీ, నడుపూరు వంటి గ్రామాల ప్రజలు దాని ద్వారా వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నారు. దీనికి తోడు డ్రై రిసోర్స్ సెంటర్ ఏర్పడితే వారి జీవనం కష్టంగా మారనుంది. ప్రజల నుంచి వ్యతిరేకత రోజురోజుకు పెరగడంతో అధికారులు.. గ్రామ పెద్దలతో పాటు పలు పార్టీల నాయకులు చర్చలకు పిలిచారు. ఈ చర్చల్లో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిని జీర్ణించుకోలేని సిఐ ఆయనపై దాడికి పాల్పడ్డారు. సిఐ చర్యలను నిరసిస్తూ గ్రామస్తులు రాంబాబుకు మద్దతుగా నిలిచి ఆందోళన మరింత ఉధృతం చేశారు.



డ్రై రిసోర్స్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

స్టీల్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన శ్రీకువానిపాలెం వాసులకు ఎకర విస్తీర్ణంలో కళ్యాణమండపం నిర్మించుకోవడానికి ఖాళీ ప్రదేశాన్ని విడిచిపెట్టారు. అప్పట్లో గాజువాక మున్సిపాల్టీగా ఉన్న సమయంలో 2002లో జివిఎంసిలో గాజువాక మున్సిపాల్టీ విలీనం కాకముందు దీనిని కళ్యాణ మండపంగా నిర్మాణం చేపట్టాలని అప్పటి కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆ తీర్మానంలో మొత్తం నాలుగు మండపాలకుగాను, మూడు కళ్యాణమండపాలు నిర్మాణం జరిగాయి. దీనిని ఒక్కటే నిర్మాణం చేయకుండా వదిలేశారు. 2014లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎన్నికల హామీలో ఈ స్థలంలో కళ్యాణమండపం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ హామీని తుంగలో తొక్కి ప్రజలకు హాని కలిగించి డ్రై రిసోర్సు సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు.

ఎమ్మెల్యే బాధ్యత వహించాలి



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూర్తి బాధ్యత వహించాలి. ఆయన సహకారంతోనే ఇది ఏర్పాటైందని తెలుస్తుంది. ఎమ్మెల్యే చెబితే ఐదు నిమిషాల్లో అధికారులు ఎత్తివేస్తారు. కాని, ఆ ప్రయత్నం చేయడం లేదు. ఈ సెంటర్ ఎత్తివేసేవరకూ పోరాటం చేస్తాం.

-ఎం.రాంబాబు, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి

కంపు భరించలేకపోతున్నాం



నాలుగేళ్ల క్రితం రామ్‌చంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కంపును భరించలేకపోతున్నాం. అది చాలదన్నట్లు ఓ వైపు గంగవరం పోర్టు దుర్వాసన. మరోవైపు ఈ డ్రై రిసోర్సు సెంటర్ ఏర్పాటు చేస్తే అసలు నివసించలేం. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా మాట్లాడడం లేదు.

-పెంటమ్మ, శ్రీకువానిపాలెం గ్రామం

డ్రై రిసోర్సు సెంటర్‌ను ఎత్తివేయాలి



స్టీల్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయాం. ఆ సమయంలో తమ గ్రామానికి ఎకరా స్థలం కేటాయించారు. అక్కడ కల్యాణ మండపం నిర్మాణం చేపడతామని చెప్పారు. తరువాత గ్యాస్ గోడౌన్ నిర్మాణం చేపడతామంటే వ్యతిరేకించాం. ఇప్పుడు డ్రై రిసోర్సు సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనినీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

-అప్పలనరసమ్మ, శ్రీకువానిపాలెం గ్రామం

పాఠశాల బస్సు బోల్తా

- 14 మంది విద్యార్థులకు గాయాలు
- ఐదుగురికి తీవ్రం
- ఒకరి పరిస్థితి విషమం
- వాగులో నీరు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - వెల్దుర్తి/మాచర్ల (గుంటూరు జిల్లా)

ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి వాగులో పడటంతో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన బస్సు ఉదయం వెల్దుర్తి మండలం ఉప్పలపాడు, మండాది గ్రామాల్లో 60 మంది విద్యార్థులతో మాచర్లలోని పాఠశాలకు వెళ్తోంది. మండాది దాటిన తర్వాత కానుగవాగు వద్ద బ్రిడ్జిపైకి రాగానే బస్సు స్టీరింగ్ రాడ్డు విరిగిపోవడంతో అదుపు తప్పింది. బ్రిడ్జికి రెయిలింగ్ సైతం లేకపోవడంతో 10 అడుగుల లోతులో పడిపోయింది. ఈ ఘటనలో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వాగులో నీరు లేకపోవడంతో పెనుప్రమాదమే తప్పింది. ప్రమాద సమాచారం తెలిసిన సమీప గ్రామస్తులు విద్యార్థులను గుంటూరు, నరసరావుపేట ఆసుపత్రులకు తరలించారు.


వాగులో పడిన బస్సు

ప్రమాద వార్త తెలిసిన వెంటనే యాజమాన్యం పాఠశాలకు తాళం వేసి, సెలవు ప్రకటించింది. విద్యార్థులను కనీసం పరామర్శించకపోవడం గమనార్హం. విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకొని..సరైన వైద్యం అందడం లేదని సిబ్బందిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి కె.చలమారెడ్డి క్షతగాత్రులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎల్ గోపి , రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.భగవాన్ దాస్ క్షతగాత్రులను పరామర్శించారు.

ప్రమాదంపై డిఎస్‌పి హరిబాబు మీడియాతో మాట్లాడారు. స్టీరింగ్ రాడ్ ఊడిపోవడమే ప్రమాదానికి కారణమని స్పష్టం చేశారు. బస్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉందని, డ్రైవర్‌కు లైసెన్స్ ఉందన్నారు. డ్రైవర్ మద్యం తాగలేదని పేర్కొన్నారు. బ్రిడ్జికి రైలింగ్ అంశమై ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడతామని, ఇలాంటి సందర్భాల్లో పాఠశాల యాజమాన్యం స్పందించాల్సిన తీరుపైనా నిబంధనలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బీహార్ అధికారులు చేపల చెరువుల పరిశీలన

ప్రజాశక్తి- మండవల్లి(కృష్ణా)

కృష్ణా జిల్లా కైకలూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లోని చేపల చెరువులను బీహార్ మత్స్యశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఆంధ్రా చేపల్లో ఫార్మలిన్ రసాయనం ఉంటుందని వచ్చిన ఫిర్యాదుపై తనిఖీ చేసినట్లు పాట్నా జిల్లా మత్స్యశాఖాధికారి పిబిన్‌కుమార్, ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ అజయ్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయనగర్‌లో చేపల చెరువులను పరిశీలించి పెంపకంలో వారికున్న అనుమానాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొర్లపాడు మలుపు వద్ద ఉన్న చేపల ప్యాకింగ్‌లో థర్మాకోల్ తయారయ్యే విధానాన్ని వారు పరిశీలించారు. అనంతరం ఏలూరు ఎంపి మాగంటి బాబుతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపి మాగంటి బాబు ఆంధ్రాలో చేపల రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా చేపల పెంపకాన్ని చేపడుతున్నారని, రెండు జీవ నదులు అందుబాటులో ఉండి నీరు అందటంతో స్వచ్ఛమైన చేపలు పెంచుతున్నారని వారికి వివరించారు. బీహార్‌తో పాటే దేశంలో ఎన్నో ప్రాంతాలకు ఆంధ్రా చేపలు ఎగుమతి అవుతున్నాయని ఎక్కడా ఇటువంటి అపవాదు రాలేదని వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముదునూరి శీతారామరాజు, ఫిషరీస్ ఎడిఉ సుధాకర్, పెద్దిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు యాసిడ్ గాయాలు

ప్రజాశక్తి-తిరుపతిసిటి

ప్రమాదవశాత్తు యాసిడ్‌బాటిల్ పగలడంతో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. 8వ తరగతి విద్యార్థులను క్లాసుల కోసం డిజిటల్ క్లాస్ రూమ్‌కు తీసుకెళ్లారు. అదే రూమ్‌లో ఉన్న యాసిడ్ బాటిల్ ప్రమాదవశాత్తు కిందపడడంతో గదిలో పొగలు అలముకున్నాయి. పిల్లలు భయాందోళనతో అటు ఇటు వెళ్లారు. దీంతో ఎం.వంశీ(13), కె.దినేష్(13), ఎం.విక్రమ్‌కృష్ణ (13), జె.తరుణ్ (13), కె.శివ (13) గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, స్థానికులు పిల్లలను తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

జర్నలిస్టులకు త్వరలోనే సొంతిళ్లు

- ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్రమహాసభల ప్రారంభోత్సవంలో మంత్రి అమరనాథరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ ప్రతినిధి

జర్నలిస్టుల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాధ్యమైనంత త్వరలో వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి ఎన్ అమరనాథరెడ్డి ఉద్ఘాటించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ కోరిక మేరకు చంద్రన్న బీమా, ప్రమాద బీమానూ రెండింటినీ వర్తింపచేయాలని, జర్నలిస్టుల సమస్యలన్నింటినీ తప్పకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని సభాముఖంగా మంత్రి అమరనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర 4వ మహాసభలు తిరుపతిలో సోమవారం ఉదయం ప్రారంభ మయ్యాయి. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వరరావు, ఆంజనేయులు నేతృత్వంలో తొలుతగా ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం నుంచి మహా సభల వేదికైన రామతులసి కళ్యాణమండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడారు. వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేస్తున్నది మీడియా, జర్నలిస్టులేనని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు పోటీగా సోషల్ మీడియా వచ్చిందని దీనివల్ల లాభాలే కాదు..అనుకోని నష్టాలూ వస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో చంద్రబాబునాయుడు హయాంలో గ్రామీణ జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ ద్వారా నిర్వహించే శిక్షణా తరగతులు ప్రస్తుతం లేవన్నారు. మీడియా అకాడమీని ఏర్పాటు చేయాలని, గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పాలసీని అమలు చేయాలని మంత్రిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నామని వెల్లడించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకోసం ఐక్యంగా ఉద్యమించాలని చెప్పారు.తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ .. రేణిగుంట విమానాశ్రయం వద్ద నిర్మించిన ఎన్‌టిఆర్ హౌసింగ్ గృహాలను అర్హులైన జర్నలిస్టులకు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తిరుపతి మాజీ ఎంపి వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడగలిగిన ఏకైక శక్తి ఒక్క జర్నలిస్టులకు మాత్రమే ఉందన్నారు. తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, ప్రముఖ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి మాట్లాడారు. అనంతరం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరమేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని వివరించారు. ఈ మహాసభల ప్రారంభ సమావేశంలో నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (నాజ్) అధ్యక్షులు ఎస్‌కె పాండే, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యదర్శి చంద్రకాంత్, తెలంగాణా జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బసవ పున్నయ్య, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, జిల్లా టిడిపి నాయ కులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి అమరనాథరెడ్డి.

యువ కెరటాలతో సృజనాత్మకత వెలికితీత

ప్రారంభోత్సవ కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - మచిలీపట్నం

యువతలో సృజనాత్మకత వెలికితీతకు యువకెరటాలు కార్యక్రమం తోడ్పడుతుందని వక్తలు అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం స్థానిక హిందూ కళాశాల ప్రాంగణంలో యువకెరాటాలు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. బందరు నియోజకవర్గ పరిధిలోని పాఠశాల విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. పాటలు, నృత్యాలు, క్రీడలు, క్విజ్, వ్యాసరచన, ఉత్తేజ ప్రసంగాలు, సృజనాత్మక అంశాల్లో పోటీలు నిర్వహించారు. బందరు పట్టణ, మండల స్థాయిలోని 75 పాఠశాలల నుండి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలురకు క్రికెట్ పోటీలు, బాలికలకు టెన్నికాయిట్‌తో పాటు ఆటపాటలతో ఆ ప్రాంగణం మారుమోగింది. వచ్చే ఏడాది కొత్త స్టేడియంలో యువ కెరటాలు కార్యక్రమాన్ని నిర్వహించు కుందామని పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తదితరులు తమ సందేశాలను వినిపించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు.

బిసిలపై చంద్రబాబుకు కపట ప్రేమ

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు

ప్రజాశక్తి - అన్నవరం(తూర్పుగోదావరి)

బిసిలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కపట ప్రేమ అని ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం నాదెండ్ల భాస్కరరావు విమర్శించారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామిని ఆయన దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఓ ప్రయివేటు హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. బిసిలకు అన్నీ చేసేస్తున్నాం అని గొప్పలు చెప్పుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. లేని పోని హామీలు ఇవ్వడం తప్ప ఆయన చేసేదేమీ ఉండబోదన్నారు.

నాగావళి నదిలో ఏనుగు మృతి

ప్రజాశక్తి- కొమరాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఎనిమిది నెలలుగా సంచరిస్తున్న ఏనుగుల గుంపులోని ఒక ఏనుగు సోమవారం నాగావళి నదిలో విగత జీవిగా కనిపించింది. వారంరోజుల క్రితం కల్లికోట, గుణానుపురం మధ్యలో గుంపునుంచి తప్పిపోయిన ఈ ఏనుగు కల్లికోట, దుగ్గి గ్రామాల పంట పొలాల్లో సంచరిస్తూ రైతులపై దాడి చేసింది. కల్లికోటలో జొన్న పంటకు వేసిన గుళికలు తినడంతో అప్పటి నుంచి ఏనుగు తీవ్ర అస్వస్థతకు గురై అనారోగ్యంతో ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించినప్పటికీ దానికి వైద్యసేవలందించలేదని తెలుస్తోంది.

వృత్తి, క్రీడల పట్ల అంకితభావం అవసరం

- శాప్ చైర్మన్ అంకమ్మచౌదరి
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల ఆటల పోటీలు

ప్రజాశక్తి - గుడివాడ

చేస్తున్న వృత్తి, ఆడుతున్న ఆట పట్ల అంకితభావం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని శాప్ చైర్మన్ అంకమ్మ చౌదరి అన్నారు. సోమవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి 23వ అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత జాతీయ, కళాశాల, క్రీడా జెండాలను ఆవిష్కరించి, శాంతి చిహ్నాలైన పావురాలను, త్రివర్ణ బెలూన్లను ఎగురవేశారు. ముఖ్య అతిథి వి.పద్మారావు క్రీడాజ్యోతిని వెలిగించారు. ఆతిథ్య పాలిటెక్నిక్ కళాశాలతో పాటు 13 జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల విద్యార్థులు పిరమిడ్ ఆకారంలో చేసిన విన్యాసం ఆకట్టుకుంది. స్వాగత నృత్యాలు అబ్బురపరిచాయి. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా మనుషులలో మానసిక, శారీరక ఎదుగుదల సమపాళ్ళల్లో ఉంటుందని ఇలాంటి వారే జాతి భవిత నిర్దేశకులుగా ఎదగగలరన్నారు. జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు టి.ఎస్.ఆర్ శాస్త్రి మాట్లాడుతూ యువత పటిష్ఠంగా ఉండాలంటే బలమైన శరీర దారుఢ్యం ఉండాలన్నారు. ఆంధ్రా యూనివర్శిటీ ఆర్‌జెడి జె.సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావులు మాట్లాడారు. 13 జిల్లాలోని 135 కళాశాలల నుండి 1100 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపిఎ పిడిఎ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి అబ్బాస్ బేగ్, ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ విద్యా సంస్థల అధ్యక్షులు వల్లూరుపల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులు కె.వి కృష్ణారావులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సంపాదకీయం

దిక్సూచి

రాష్ట్రంలో టిడిపి, వైసిపి ఈ రెండు ప్రధాన రాజకీయ పక్షాలూ ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యల జోలికి పోకుండా అధికారం కోసం ఆర్రులు చాస్తుండగా వాటికి పూర్తి భిన్నంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలిసి పని చేసేందుకు జనసేన, సిపిఎం, సిపిఐ ఉమ్మడి అవగాహనకు రావడం ఆహ్వానించదగింది. అసలు సిసలైన ప్రజల దృక్కోణాన్ని ఆవిష్కరింపజేసి భవిష్యత్తు రాజకీయాలను ఆవైపునకు మళ్లించేందుకు నడుంకడతామని మూడు పార్టీలూ ఒకే వేదికపై ప్రకటించడం హర్షణీయం. రాష్ట్రంలో కొంత కాలంగా రాజకీయాలంటే కేవలం ఓట్లు, సీట్లు, అధికార పీఠమేనన్న భావజాలం వేళ్లూనుకోగా సదరు భావజాలానికి కుసంప్రదాయానికి జనసేన, లెఫ్ట్ ఐక్య ప్రకటన తప్పక బ్రేక్ వేస్తుంది. ఎన్నికల వేళ ఈ కూటమి వెల్లడించిన స్పష్టమైన ప్రజానుకూల వైఖరి జనంలో, జనపక్షపాతుల్లో భరోసా నిలుపుతుంది. ఇప్పటి వరకు తమకు తామే ప్రత్యామ్నాయమని జబ్బలు చరుచుకుంటున్న టిడిపి, వైసిపి పార్టీల్లో కలకలం సృష్టిస్తుంది. రెండు పార్టీల స్థానంలో బహుళ రాజకీయ వ్యవస్థ క్రమంగా రూపుదిద్దుకోడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ప్రజల్లో అలాంటి ఆలోచన, చైతన్యం కలగడానికి అవకాశం కలుగుతుంది. పర్యావరణ పరిరక్షణ, హేతుబద్ధమైన గనుల తవ్వకం, అక్రమ మైనింగ్, విశాఖ మన్యంలో విచ్చలవిడిగా బాక్సైట్ తవ్వకాలకు తాము వ్యతిరేకమని, ప్రజలను, బాధితులైన గిరిజనులను కలుపుకొని పోరాడతామని మూడు పార్టీలూ ప్రకటించాయి. భూసేకరణ పేరుతో ప్రజల నుంచి అక్రమంగా భూములు గుంజుకుంటుంటే చూస్తూ ఊరుకోబోమని, కచ్చితంగా 2013-భూసేకరణ చట్టాన్ని ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశాయి. మానవ, పౌర హక్కులపై పోరాడతామని స్పష్టీకరించాయి. ప్రత్యేక హోదా, విభజన హామీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసాలపై ఎక్కుపెట్టాయి. మత సామరస్యం, ఇవిఎంలపై నెలకొన్న అనుమానాలు, తదితర అంశాలపై చర్చించాయి. జనసేన, లెఫ్ట్ ఉమ్మడిగా భుజానికెత్తుకున్న ఈ కర్తవ్యాలు ముమ్మాటికీ విధానపరమైనవి. అధికార, ప్రధాన ప్రతిపక్షం ప్రతిపాదిస్తున్న ప్రజాకర్షక విధానాలకు భిన్నమైనవి.

రాష్ట్రంలో వామపక్షాలు మొదటి నుండి ఉద్యమాల ద్వారా ప్రజలను కదిలించే కృషి చేస్తున్నాయి. ఇప్పుడు కొన్ని ముఖ్యమైన ప్రజా సమస్యలపై జనసేన వీటితో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. అందులో భాగంగానే తమ కూటమి భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేసుకునేందుకు శుక్రవారం విశాఖలో ఆ పార్టీల నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. తమ ప్రజానుకూల దృక్కోణాన్ని మరోసారి స్పష్టీకరించారు. ఎన్నికలు సమీపిస్తుండగా అధికారంలో ఉన్న టిడిపి ప్రజలకు ఎన్నో పథకాలు ప్రకటించి ఆకర్షించాలని చూస్తోంది. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలను కనీసం సమాధానపర్చట్లేదు. 'అభివృద్ధి కావాలంటే మళ్లీ బాబు రావాలి' అని ఆకాశమే హద్దుగా ప్రచారం లంకించుకుంది. ఇక ప్రధాన ప్రతిపక్షం వైసిపి నవరత్నాలంటూ ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోట్లాడకుండా తానొస్తే అన్నీ చేసేస్తానంటోంది. 'కావాలి జగన్ రావాలి జగన్' నినాదం ఎత్తుకుంది. టిడిపి సర్కారును ఎందుకు వ్యతిరేకించాలో చెప్పకుండా 'నిన్ను నమ్మం బాబూ' అంటూ కార్యకర్తలను ఊరూ వాడా తిప్పుతోంది. ఆ రెండు పార్టీల ప్రచార హోరులో ఎక్కడా ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలకు ఇసుమంతైనా స్థానం కల్పించలేదు. గోడ దెబ్బ, చెంప దెబ్బ ఏదో ఒకటి తప్పేలా లేదు అని ప్రజలు భావిస్తున్న తరుణంలో ఇప్పుడు జనసేన, లెఫ్ట్ ఉమ్మడి ప్రకటనలో జనం వ్యధను ఎలుగెత్తడంతో ప్రజలు విధానపర ప్రత్యామ్నాయంపై ఆలోచన చేయడానికి దోహదపడింది.

తమ చేతుల్లో ఉన్న మంది మార్బలాన్ని, వనరులను ఉపయోగించి జనసేన రాజకీయ భవిష్యత్తుపై అటు టిడిపి ఇటు వైసిపి కొంతకాలంగా మైండ్‌గేమ్‌ను సాగిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. కాగా శుక్రవారంనాటి జనసేన, లెఫ్ట్ భేటీతో వాటి ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ప్రజలకు స్పష్టత వచ్చింది. టిడిపి, వైసిపి రెండూ కలిసి తమ రాజకీయ ప్రయోజనాల కోసం చీకట్లో బాణాలేసి జనంలో అపోహలు కలిగించాయని తేటతెల్లమైంది. రాష్ట్రంలో భవిష్యత్తులో ప్రజలు కేంద్రంగా రాజకీయాలంటే ఎలా ఉంటాయో చూపిస్తామంటూనే వచ్చే ఎన్నికలకు సంబంధించి మూడు పార్టీలూ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించడం, సీట్ల పంపిణీపై ఫిబ్రవరిలో చర్చలు, అనంతరం ఉమ్మడి ప్రణాళికను ఖరారు చేస్తామని వెల్లడించడం ప్రజానుకూల ప్రత్యామ్నాయ కూటమికి అంకురార్పణగా చెప్పుకోవచ్చు. మూడు పార్టీల ప్రాథమిక చర్చల్లో అవగాహనకొచ్చిన అంశాలతోపాటు రైతు సమస్యలు, కనీస వేతనాలు, కాంట్రాక్టీకరణ, ఉద్యోగ భద్రత, నిరుద్యోగం తదితర ఎన్నో సమస్యలున్నాయి. వాటిపైనా జనసేన, లెఫ్ట్ ఉమ్మడి కార్యాచరణ రూపొందించి ప్రజల ముందు విధానపరమైన ప్రత్యామ్నాయ ఎజెండాను ప్రతిపాదిస్తాయని ఆశిద్దాం. ఇదే రాష్ట్రంలో నూతన రాజకీయ సమీకరణలకు, ప్రజాసమస్యలపై పోరాటాలకు దిక్సూచి.

ఇదీ విషయం

జ్ఞానం
దాచుకునే ధనం కాదు
సూర్యకిరణాలు సోకి
ఒక్కొక్క రేకు విచ్చుకునే
పద్మం
ప్రత్యేక క్షణాలంటూ
వుండవు
ప్రతిక్షణం విలక్షణమే

- ప్రొ॥ ఎన్.గోపి

'అర్బన్ నక్సల్స్' అర్థం లేని మాట, అతకని ప్రయోగం

ఇంటర్వ్యూ



ఒకప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియచేసేవారిని 'అర్బన్ నక్సల్స్' అనేవారు. ఇవాళ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ప్రశ్నలు ఎవరు వేసినా అలా పిలవడం ఒక నిందారోపణగా మారిపోయింది. ప్రభుత్వానికి భజన కీర్తనలు పాడేందుకు తిరస్కరించిన కవులు, రచయితలకు కూడా ఇదే గతి పడుతున్నది. ఏదో ఒక గుంపు శాసించిన ప్రకారం వారు అనుమతించిందే అందరూ ఆహారంగా తీసుకోవాలంటున్న కాలంలో వారిని దేశ వ్యతిరేకులనడం చాలా తేలికైపోయింది.

రొమిలా థాపర్ ఎవరికీ తలవంచని ధిక్కార ధోరణికి ప్రతినిధిగా నిలిచిన విశిష్ట విద్యావేత్త. చరిత్రకారిణి. సామాజిక కార్యకర్త. రాజ్యాంగ యంత్రం అణచివేతను ఆమె నిర్భయంగా ఎదిరించారు. ఈ ఏడాది ప్రారంభంలో, మీడియా ద్వారా ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా ఐదుగురు మానవ హక్కుల కార్యకర్తలపై అర్బన్ నక్సల్స్ ముద్ర వేసి అరెస్టు చేయడాన్ని ఆమె గట్టిగా వ్యతిరేకించారు. అంత కు ముందు కాలంలో ఆమె చరిత్ర కాషాయీకరణను వ్యతిరేకించి పోరాడారు. మెజారిటీ మతానికి చెందిన ఒక సెక్షన్ మనోభావాలకు అనుగుణంగా చరిత్రను మారుస్తున్నారని ఆమె వాదించారు. ఈరోజున స్వేచ్ఛావరణం, వాక్ స్వాతంత్ర్యం, సంభాషణ, చర్చ, అసమ్మతి తెలిపే హక్కు కోసం కూడా పోరాడాలని కృత నిశ్చయంతో వున్నారామె.

'రాజ్యం అణచివేత ఎంతో కాలం సాగబోదనే విశ్వాసంతో పోరాడుతూనే వుండాలి' అంటారు రొమిలా దృఢంగా. ఈ సందర్భంగా ఆమె ఫ్రంట్‌లైన్ వేసిన కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

'అర్బన్ నక్సల్' పదాన్ని మొట్టమొదటిసారిగా ఎప్పుడు ఉపయోగించారు?

ఈ పదాన్ని మొదట ఎప్పుడు కనిపెట్టారో నాకు తెలియదు. అయితే, ఐదుగురు సామాజిక కార్యకర్తలను అరెస్టు చేసినప్పుడు (గత ఆగస్టులో) బాగా ప్రచారంలోకి వచ్చింది. ఆ పదాన్ని కనిపెట్టినవారు 'పట్టణీకరణ అంటే, నక్సల్ అంటే' ఏంటో తెలియకుండానే వాడేస్తున్నారు. రైతుల నిరసనలు, ఆదివాసీ సంఘాల పోరాట క్రమంలో నగ్జల్బరీ ఉద్యమం ఆవిర్భవించింది. ఆ కార్యక్రమాలు పట్టణాలు కేంద్రంగా జరిగిందే లేదు. ఇప్పుడైనా సరే పేద రైతులు, గిరిజన సమాజాలు దీనావస్థలో వున్న దగ్గరే ఆ ఉద్యమం చురుగ్గా కనిపిస్తుంటుంది. నక్సల్ కార్యకలాపాలకు నగరాల్లోని ఏవో కొన్ని మురికివాడల్లో మాత్రమే చోటు వుంటుంది. అటువంటప్పుడు మామూలుగా చెప్పే నక్సల్‌కు భిన్నమైన అర్థాన్నిచ్చేలా అర్బన్ నక్సల్ గురించి మాట్లాడ్డంలో అర్థమే లేదు.

ఒకవేళ పట్టణ ప్రాంత సమస్యల గురించి ఆలోచించే పట్నవాసులను లేదా వామపక్ష వాదులు, ఉదారవాద దృక్పథం గలవారిని ఉద్దేశించి ఈ పదాన్ని ఉపయోగించారనుకుంటే అది కూడా అసంబద్ధమే. ఎందుకంటే వారు నక్సల్స్ కాదు. కాని మొదట్లో కూడా ఇదే కథ నడిచేది. ఇప్పుడూ నడుస్తోంది. తమ భావాలతో అంగీకరించని వారందరినీ కమ్మీలని, మార్క్సిస్టులని పిలిచేవారు. వారి వాస్తవ కార్యక్రమాలు, రచనలు ఏంటనే దాంతో సంబంధం లేకుండా అలా అనేయడం పరిపాటి.

అర్థరహితమైన పదాలను కూడా ఏదో అర్థం వున్నట్టుగా నటించడం కొంతమందికి అలవాటు. ఎందుకంటే దూషణలకూ శాపనార్థాలకు అవి చక్కగా ఉపయోగపడతాయి గనక బాగా వినియోగంలో పెడతారు. ఈ సందర్భంలో భారత దేశంలోని ఉదారవాదుల పట్ల తమ ద్వేషాన్ని ప్రదర్శించడానికి 'అర్బన్ నక్సల్' అని ముద్ర వేస్తున్నారు. ఈ ఉదారభావనలు పాలక పార్టీకి, దాని మద్దతుదారులకు బొత్తిగా మింగుడు పడకపోవడమే ఇందుకు కారణం.

మరోవైపున 'అర్బన్ నక్సల్' అంటే ఏమిటో నిర్వచించకుండా గందరగోళంగా వదిలివేయడం ఉద్దేశపూర్వకమే. ఇందువల్ల రకరకాలైన కార్యక్రమాలపై తమకు నచ్చిన విధంగా నిర్వచించి చర్య తీసుకోవడానికి అధికారంలో వున్న వారికి అవకాశం ఏర్పడుతుంది. ఈ పదానికి అర్థం లేకపోవడం దాన్ని ఉపయోగించేవారి పైన కూడా ప్రతిబింబిస్తుంది. భారతీయ ఉదారవాదులు అనేకమంది ఈ పదాన్ని ఒక దీన్నో జోక్‌గా తీసుకోవడం జరుగుతున్నది. అయితే దీని వెనక ఎలాంటి ప్రమాదం లేకపోతే నిజంగానే తమాషా కింద తయారవుతుంది.

ప్రమాదం ఏమిటి?

పోలీసులు, పాలనాధికారులు, రాజకీయాధికారాన్ని నియంత్రించేవారు నిరంకుశంగా కొందరిని 'అర్బన్ నక్సల్స్' అని ఆరోపించవచ్చు. తర్వాత సరైన సాక్ష్యాలేవీ లేకుండానే వారిని అరెస్టు చేసి జైలు పాలు చేయవచ్చు. ఇటీవల అరెస్టు చేసిన సామాజిక కార్యకర్తల కేసులో జరిగింది అదే.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేయడానికి, భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడానికి మధ్య వ్యత్యాసాన్ని మనం ఎందుకు విస్మరిస్తున్నాం?

రెండిటి మధ్య అత్యంత ముఖ్యమైన తేడా వుంది. మావోయిజాన్ని, నక్సలిజాన్ని లోతుగా అధ్యయనం చేసిన వారు ఆ తేడా ఏమిటో తెలుసుకోగలుగుతారు. ఈ రెండింటినీ కలగాపులగం చేయడం కూడా ఉద్దేశపూర్వకమే. ఎందుకంటే సాధారణంగా తమకు అనుమతి వున్నదాన్ని మించి మరెన్నో రెట్లు ప్రజలపై నియంత్రణలు విధించడానికి దానివల్ల అధికారులకు అవకాశం లభిస్తుంది.

గత కొద్ది సంవత్సరాలుగా భిన్నాభిప్రాయాలను అనుమతించని ధోరణి పెరిగిపోతున్నది. గోవులను రవాణా చేస్తున్నవారిని, నెత్తిన టోపీ పెట్టుకున్నవారిని మరీ ముఖ్యంగా ముస్లింలను కొట్టి చంపడం, మతాంతర వివాహాలు చేసుకున్న వారి ప్రాణాలు తీయడం వరకు చూస్తున్నాం. ఇవన్నీ కుల నిబంధనలకు, తెగ-మత సంబంధ ఆచారాలకు విరుద్ధమైనవి గనుకనే ఇలా చేయాల్సి వచ్చిందని సమర్థించుకుంటారు. వాస్తవానికి సంప్రదాయాలకు వాటిని ఆచరించే తెగలు, సంస్థల పట్ల అసమ్మతిగానే వారు అడుగు వేస్తుంటారు గనక వారిపై దాడులు జరుగుతాయి.

కాని, ఈ రోజుల్లో కొన్ని రకాలైన రచనలను కూడా జాతి వ్యతిరేకమైనవిగా పేర్కొంటున్నారు...

చర్చలకు, విమర్శలకు మద్దతునిచ్చే రచనలను, అధికారాన్ని విమర్శించే వాటిని జాతి వ్యతిరేకమైనవిగా పిలుస్తున్నారు. ఆ రచయితలను అనుమానాస్పదులుగా చూస్తున్నారు. తమ హక్కుల గురించి నొక్కి చెప్పిన కారణంగా దాడికి గురైన వాటిలో యూనివర్సిటీలున్నాయనేది తెలిసిన విషయమే. వాటి స్వయంప్రతిపత్తిని అనేక పద్ధతుల్లో తొలగిస్తున్నారు. నిర్వీర్యం చేస్తున్నారు. అందుబాటులో వున్న విజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలు వేయడం, విస్తృతంగా అధ్యయనం చేసి చర్చ చేయడం విద్య యొక్క ప్రాథమిక విధులు. వాటినే హరించేస్తున్నారు. పాఠ్య పుస్తకాలను తిరగ రాసే క్రమంలో బోధించాల్సిన అంశాలను మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం వున్న పాఠాలు కొన్ని మతాలకు చెందిన గ్రూపులు, మరీ ముఖ్యంగా హిందువుల మతపరమైన భావాలను గాయపరిచేలా వున్నాయని సాకులు చెబుతున్నారు. ఈ విధమైన ఆక్షేపణలు ఒక శక్తివంతమైన మతాన్ని తక్కువ చేస్తున్నాయనీ, దాని రక్షణకు ఇటువంటి అల్పమైన చర్యలు చేపట్టనవసరం లేదన్న అంశాన్ని అస్సలు గమనించడం లేదు.

భిన్నాభిప్రాయాన్ని నియంత్రించే ప్రయత్నాలకు త్వరలో జరగనున్న ఎన్నికలు కూడా ఒక కారణమా?

ఇప్పుడిక ఎన్నికలు రాబోతున్నాయి గనక భిన్నాభిప్రాయాలను మరింత తొక్కిపట్టే అవకాశం చాలా ఎక్కువ. రాజద్రోహం, జాతి వ్యతిరేకత ఆరోపణలు ఇందుకు ఒక సాధనంగా వాడటం చాలా రోజులుగా జరుగుతున్నది. ఇప్పుడు 'అర్బన్ నక్సల్' అనే ముద్రను ఎవరిపైనైనా, ఎందుకైనా వేయొచ్చు. వారు తీవ్రవాదులకు సహాయం చేస్తున్నారని, జాతి వ్యతిరేక కార్యకలాపాలకు సహకరిస్తున్నారని ఆరోపించవచ్చు. వీరు ఆరోపిస్తున్నట్టు నిజంగా అంతమంది అర్బన్ నక్సల్స్ వున్నారనుకుంటే ఒక ప్రశ్న అడగాల్సి వస్తుంది. భారతీయ సమాజంలో అంతమంది భిన్నాభిప్రాయంతో ఎందుకున్నారు? ఏ సమాజంలోనైనా సరే భిన్నాభిప్రాయాన్ని ఏకపక్షంగా, నిరంకుశంగా తోసిపుచ్చడానికి వీలవదు. అలాంటిది లేకుండా చేయాలనుకునేవారు ఎంత ఇబ్బంది పడినా సరే! అసలంటూ భిన్నాభిప్రాయం ఎందుకు ఉత్పన్నమైందనేది వివరించాల్సి వుంటుంది.

భిన్నాభిప్రాయమనే నిర్వచనానికి తీవ్రవాదం ఏ మేరకు అమరుతుంది?

ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో తీవ్రవాదం వుంది. అందుకు మనం కూడా ఎంతమాత్రం అతీతులం కాదు. ముందుగా చెప్పినట్టు, ఆశించినట్టు ప్రభుత్వ విధానాలు విజయవంతం కాని సమయాల్లో వాటి నుంచి పక్కకు మళ్లించేందుకు తరచుగా దీన్ని కారణంగా చెబుతుంటారు. ఈ వైఫల్యాల గురించి ప్రజలు ప్రశ్నించకుండా దీన్ని ముందుకు తెస్తారు. ఇది ప్రాథమికంగా స్పష్టమైన సమాధానం మాత్రమే. అయితే తీవ్రవాదం మరింత క్లిష్టమైన సమస్య.

తీవ్రవాదాన్ని రెండు దృక్కోణాల నుంచి చూడాలి. ఒకటి, చట్టాన్ని విస్మరించడం ద్వారా, హింసాత్మక పద్ధతులను అవలంబించడం ద్వారా సాయుధ దళాలు ప్రజలలో భయాన్ని, తీవ్రవాదాన్ని వ్యాప్తి చేయడం. వాటికి...రాజకీయ, సామాజిక, ఆర్థిక, మతపరమైన అంశాలలో ఏదో ఒక ఎజెండా వుండవచ్చు. లేదా వాటిలో కొన్ని అంశాలకు సంబంధించిన ఎజండా వుండవచ్చు. హింస ద్వారా భయాన్ని సృష్టించడం మరో మార్గం. రాజ్యాంగ రీత్యా పౌరులకు రక్షణ కల్పించవలసిన వారే ఇందుకు పాల్పడవచ్చు. భయోత్పాతాన్ని వ్యాప్తి చేసే ప్రభుత్వ సంస్థలు చరిత్రలో బాగా పేరు మోసినవే. కాని మనమున్న ప్రస్తుత కాలంలో ఇది మరింతగా గుర్తించబడుతున్నది. స్వాతంత్ర్య పోరాట కాలంలో మనం దీనికి వ్యతిరేకంగా మాట్లాడినప్పటికీ తర్వాతి కాలంలో అవి మరింత పెరగడాన్ని విస్మరించకూడదు.

ఒకానొక ప్రత్యేక ప్రాంతంలోనే ఇటువంటి పరిస్థితి ఎందుకు ఏర్పడుతుందన్న ప్రశ్న మరో కోణం. అక్కడ సమస్యలు పేరుకుపోవడం, దారిద్ర్యం తాండవించడం, అవినీతిభరిత యంత్రాంగం, కుల మత విభేధాలను కొనసాగనివ్వడమే గాక ఇంకా ఎగదోయడం జరుగుతున్నప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురౌతుందనేది మనకు తరచూ కనిపించే కారణం. రాజ్యాంగ బద్ధమైన మానవ హక్కులకు రక్షణ వుండేలా ఆ ప్రాంతం అభివృద్ధి సాగుతున్నదా అనేది ప్రాథమిక ప్రశ్న. సాధారణంగా, మానవ హక్కులను పరిరక్షించే సంస్థలు అక్కడ వుండవు. ఒకవేళ వున్నా అవి వాటిని సరిగా నిర్వర్తించడం జరగదు.

అట్లాంటి పరిస్థితి ఎందుకు తలెత్తింది? దాన్ని ఏవిధంగా సరిచేయాలి? అన్న అంశం మీద చర్చలను ప్రోత్సహించాల్సిందిపోయి. ఆ విషయమై చర్చించి విశ్లేషించడాన్ని, ఆ ఏర్పాట్లు చేయడాన్ని శాంతిభద్రతల సమస్యగా అభివర్ణిస్తున్నారు. వాటిపట్ల అలాగే వ్యవహరిస్తున్నారు కూడా. ఒక అంశం వరకు ఇది శాంతి భద్రతల సమస్యే కావచ్చు. అయితే ఈ పరిస్థితి ఏర్పడ్డానికి మూల కారణం మాత్రం అది కాదు. పైగా ఈ సమస్యకు పరిష్కారమన్నట్టు ఆ సమాజాలపై అదుపాజ్ఞల పట్టు మరింత బిగించడం, వారి కార్యకలాపాలను అణచివేసే ప్రయత్నం జరుగుతోంది. వీటికీ ఇంకా ఇలాంటి ఇతర సమాజాలకు మానవ హక్కులు, న్యాయం పొందేందుకు కొద్దిపాటి వెసులుబాటు కల్పిస్తే తప్ప తీవ్రవాదం బోను నుంచి బైటకు తీసుకు రావడం సాధ్యం కాదు. అయితే అందుకోసం కృషి చేసేవారే ఇప్పుడు 'అర్బన్ నక్సల్స్' అన్న ముద్రకు గురవుతున్నారు.

సోషల్ మీడియా

ఓ నవ కుబేరుడు ఒక రాష్ట్ర జిడిపి



మన దేశంలో 'కొందరి' వ్యక్తిగత ఆస్తులు లక్షల కోట్ల రూపాయలకు పెరుగుతున్నాయి. కొంతమంది సంపద విలువ ఒక రాష్ట్రం లేదా కొన్ని రాష్ట్రాల స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) విలువతో సమానం. లేదా అంతకంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

అంటే ఒక్కో కోటీశ్వరుడి సంపద ఒక రాష్ట్ర జిడిపితో సమానమన్న మాట. 'ఇండియా స్పెండ్' విశ్లేషణ ప్రకారం మన దేశంలో పది మంది అత్యంత ధనవంతుల మొత్తం ఆస్తి కొన్ని రాష్ట్రాల జిడిపితో సమానం.

ముకేశ్ అంబానీ

2017-18 లెక్కల ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఆస్తుల నికర విలువ రూ.3,31,525 కోట్లు. ఇది దాదాపు ఒడిశా జిడిపికి సమానం. ఒడిశా జిడిపి రూ.3,46,294 కోట్లు. ఈశాన్య రాష్ట్రాల మొత్తం జిడిపి కలిపినా కూడా అంబానీ సంపద కంటే చాలా తక్కువ.

అజీమ్ ప్రేమ్‌జీ

విప్రో అధినేత ప్రేమ్‌జీ ఆస్తుల విలువ రూ.1,47,189 కోట్లు. గోవా, త్రిపుర, పుదుచ్చేరి జిడిపి కంటే ఇది పది వేల కోట్ల రూపాయలు అధికం.

లక్ష్మీ మిట్టల్

ఉక్కు పరిశ్రమ ఆర్సెల్ మిట్టల్ సీఈవో లక్ష్మీ మిట్టల్ ఆస్తుల విలువ రూ.1,28,264 కోట్లు. ఇది హిమాచల్ ప్రదేశ్ జిడిపి (రూ.1.52 లక్షల కోట్లు) కంటే కొంచెం తక్కువ.

హిందూజా

హిందూజాల నికర సంపద రూ.1,26,162 కోట్లు. ఉత్తరాఖండ్ జిడిపి (రూ.2.58 లక్షల కోట్ల)లో ఇది సగం ఉంది.

పల్లోంజి మిస్త్రీ

153 ఏళ్ల చరిత్ర గల షాపూర్‌జీ పల్లోంజీ గ్రూపు చైర్మన్ మిస్త్రీకి రూ.1,10,041 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఇది గోవా జిడిపి (రూ.70,400 కోట్లు) కంటే దాదాపు 40,000 కోట్లు ఎక్కువ.

శివనాడార్

హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివనాడార్ ఆస్తుల విలువ రూ.1,02, 331 కోట్లు. 2018లో ఫోర్బ్స్ 100 మంది ధనవంతుల జాబితాలో 4వ స్థానంలో నిలిచారు. ఈయన ఆస్తుల విలువ జార్ఖండ్ జిడిపి (రూ.2.82లక్షల కోట్ల)లో దాదాపు సగం.

గోద్రేజ్

గోద్రేజ్ గ్రూపు మొత్తం ఆస్తుల విలువ రూ.98,126 కోట్లు. ఇది గోవా జిడిపి (రూ.70,400 కోట్లు) కంటే 25 వేల కోట్లు ఎక్కువ.

దిలీప్ సంఘ్వీ

సన్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపకుడు దిలీప్ సంఘ్వీకి రూ.88,313 కోట్ల విలువైన సంపద ఉంది. ఇది మేఘాలయ జిడిపి రూ.24,202 కోట్ల కంటే నాలుగు రెట్లు ఎక్కువ.

కుమార మంగళం

బిర్లా సంస్థ అధినేత కుమార మంగళం బిర్లా నికర ఆస్తుల విలువ రూ.87,612 కోట్లు. సిక్కిం, నాగాల్యాండ్, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌ల మొత్తం జిడిపి కంటే ఇది దాదాపు పది వేల కోట్లు అధికం.


గౌతం అదానీ

అదానీ గ్రూపు వ్యవస్థాపకుడు గౌతం అదానీ సంపద విలువ రూ.83,407 కోట్లు. ఇది కూడా నాలుగు ఈశాన్య రాష్ట్రాల జిడిపి కంటే ఎక్కువే.

పరికల్పన-శాస్త్రీయ నిరూపణ

సమీక్ష

కెఎల్ కాంతారావు



మనుస్మృతి కాలం నాటికి భౌతిక శాస్త్రాలపై నిరాదరణ అత్యంత తీవ్ర స్థాయికి చేరింది. చేతివృత్తుల వారు, వైద్యులు, శస్త్ర చికిత్స నిపుణులను నేరస్తులు, దొంగల జాబితాలో చేర్చి, వారిని ఏ మత కర్మలకూ, చివరకు అంత్యక్రియలకు కూడా పిలువరాదని మనువు శాసించాడు. ఇక వైద్య శాస్త్రం పతనం కాక ఏమవుతుంది? కాబట్టి మన ప్రాచీనుల విజ్ఞానానికి గర్విద్దాం. వారి అజ్ఞానాన్ని అంగీకరిద్దాం. వారి విజ్ఞాన పతనానికి గల కారణాన్ని అన్వేషిద్దాం. మరల ఉన్నత స్థాయికి రావడానికి సరైన ప్రయత్నాలు చేద్దాం. ఏమంటారు?'

'రండి! జోగయ్య గారూ! రండి!' లోనికి వస్తున్న మిత్రులు జోగయ్య గారిని సాదరంగా ఆహ్వానించాను.

మిత్రులిద్దరం పిచ్చాపాటీలో పడ్డాం. పిచ్చాపాటీ మధ్యలో జోగయ్య గారు 'మన ఆధునిక విజ్ఞానానికి మూలాలు వేదాల్లోనే ఉన్నాయండీ. కానీ మన వాళ్ళు అది గుర్తించక, 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష' అంటూ ఎగతాళి చేస్తున్నారండీ' అన్నారు.

'వేదాల్లో ఉన్న జ్ఞానం చాలా పరిమితమైనదండీ. వారికి బంగారం, వెండి, రాగి లోహాలను తయారు చేయడాన్ని గూర్చి (రుగ్వేదం 1-183-1), మేడలు (రుగ్వేదం 1-121-1), ఓడలు (రుగ్వేదం 1-46-7) నిర్మించడాన్ని గూర్చిన ప్రాథమిక వైజ్ఞానిక అంశాలు తెలుసు. అంతే! వారికి భూమి గుండ్రంగా ఉంటుందని కానీ, అది సూర్యుని చుట్టూ తిరుగుతుందని కానీ తెలియదు. ఉదాహరణకు రుగ్వేదం 1-160-4 లో ఇలా చెప్పబడింది. 'సకల భూతములకు సుఖములు కలిగించు భూమిని, ద్యావాను భగవానుడు సృష్టించాడు. ఆ రెంటినీ కదలకుండా బిగించిన భగవానుడు సర్వదేవతలందు శ్రేష్ఠుడు'. అలాగే కృష్ణ యజుర్వేదం 1-5-11-18 లో 'భూమి దేవతలు నిర్మించిన నౌక. అది మహా జలములపై తేలియాడుచున్నది' అని వుంది. 'ఇదీ మన వైదిక రుషుల విజ్ఞానం' అన్నాను నేను.

'భలే వారే మీరు! అణుబాంబు విస్ఫోటనం అంతరార్థాన్ని గూర్చి భగవద్గీతలో 11 వ అధ్యాయంలో 12,32 శ్లోకాలలో చెప్పబడిందండీ. వాటిని గురించి రాబర్ట్ జూలియన్ ఓపెన్ హైమెర్ అనే విదేశీయుడు చెప్పే వరకు మనకు తెలియక పోయింది కదా' అన్నారు జోగయ్య గారు.

'భగవద్గీత 11వ అధ్యాయం, 12వ శ్లోకంలో ఏం చెప్పబడిందంటే-భగవానుని విశ్వరూపం ఎలా ఉందంటే, 'ఏక కాలంలో ఆకాశంలో వేయి మంది సూర్యులు వెలువడితే కలిగే కాంతి, ఆ మహాత్ముడి విశ్వరూప తేజస్సుకు సాటి కావచ్చు' అని. అలాగే 32వ శ్లోకంలో 'లోక సంహారానికి విజృంభించిన కాల స్వరూపుణ్ణి నేను. ప్రస్తుతం ఈ ప్రపంచంలో ప్రజలను సంహరించడమే నా సంకల్పం. నీవు యుద్ధం చేయక పోయినా శత్రు సైన్యంలో వీరులంతా వినాశనం పొందడం ఖాయం'. ఈ శ్లోకాలు అణు విస్ఫోటనం అనే శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వివరిస్తాయా? అణు విస్ఫోటనం సమయంలో వచ్చిన కాంతి లాంటి కాంతి భగవానుడికి ఉందని వివరిస్తే వ్యాస మహామునికి అణు విస్ఫోటన విజ్ఞానం ఉన్నట్లేనా ? మొన్న దీపావళి నాడు మా మనవడు చిచ్చుబుడ్డి కాంతిని చూసి 'అబ్బా! బోలెడంత మంది సూర్యుళ్ళ కాంతి' అన్నాడు. వాడికి కూడా అణు విస్ఫోటన విజ్ఞానం ఉన్నట్లేనా?' అనడిగాను.

'ఇంకొక్కటి అడుగుతాను. సూర్యుడి చుట్టూ భూమి, ఇతర గ్రహాలు తిరుగుతున్నాయని కోపర్నికస్ చెప్పక ముందే మనం నవగ్రహాల మధ్యలో సూర్యుణ్ణి పెట్టి ఆరాధించడం మొదలుపెట్టాం. మన సంస్కృతి ఎంత గొప్పదో అర్థం చేసుకున్నారా?' అని అడిగారు జోగయ్య గారు.

'నవగ్రహ ఆరాధన మన దేవాలయ సంస్కృతి అంటే నేను చర్చకు రాను. కానీ కోపర్నికస్ కంటే ముందే మన వాళ్ళకు సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలకు కేంద్రంగా సూర్యుడున్నాడని ఆ అంశం తెలియజేస్తుందంటే చర్చిస్తాను. ఎందుకంటే నవగ్రహారాధన చేస్తున్న సమయంలోనే ఆనాటి నుండి నేటి వరకు భూమి అన్ని గ్రహాలకు మూలమని చెప్పే జ్యోతిష్యాన్ని అంగీకరిస్తూ, దానికి జ్యోతిష్య శాస్త్రం అని పిలుస్తున్నారు. అది మన వారిలోని ద్వంద్వ ప్రవృత్తిని తెలియజేస్తోంది' అని సమాధానమిచ్చాను.

'అది సరేనండి. 'పైకి వేసిన వస్తువు కిందికి పడుతుంది అని క్రీ.శ. 505లోనే వరాహమిహిరుడు చెప్పాడు గదా? ఆయనను గౌరవించక మీబోటివారు న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం చెప్పాడు అని ఆయనను గౌరవిస్తారేమిటి?'

'జోగయ్య గారూ! ఒక విషయాన్ని సిద్ధాంతం అని ఎప్పుడంటామంటే, ఒక అంశాన్ని పరికల్పన జేసి, దానిని ప్రయోగం ద్వారా నిరూపించినప్పుడే! పరికల్పన మాత్రమే చేస్తే అది సిద్ధాంతం అనిపించుకోదు. వరాహమిహిరుడు, బ్రహ్మ గుప్తుడు, భాస్కరాచార్యుడు పరికల్పన చేశారు. కానీ న్యూటన్ దానిని గణితశాస్త్ర సూత్రాలతో నిరూపించాడు. అందువలన న్యూటన్ చెప్పిన దానిని 'గురుత్వాకర్షణ సిద్ధాంతం' అంటున్నాం' అన్నాను.

'మన ప్రాచీనుల విజ్ఞానాన్ని గూర్చి తెలియక మీరిట్లా మాట్లాడుతున్నారు. గణిత శాస్త్రంలో శూన్యాంశం, వర్గ మూలం, ఘన మూలాలను మనవారే కనుగొన్నారు. రస విద్యలో రాగి, సీసం, బంగారం, తుత్తునాగం వంటి వాటిని శుద్ధి చేసే విధానాన్ని కనుగొన్నారు. కాంతి వేగాన్ని గణించగలిగారు. వైద్య విద్యలో మన పూర్వీకులు 1,50,000 ఔషధ మొక్కల వివరాలు తెలుసుకొన్నారు. గర్భస్రావమైన గాంధారి పిండాన్ని 101 కుండల్లో ప్రవేశ పెట్టి వ్యాస మహర్షి కౌరవ సంతానోత్పత్తికి ఆద్యుడయ్యాడు. ఆకాశంలో ఎగిరే పుష్పక విమానం, కృష్ణ బిల సిద్ధాంతం, బిగ్ బ్యాంగ్ థియరీ ఇలా భారతీయులకు తెలియని అంశం లేదు. దీనికేమంటారు?' అని అడిగారు జోగయ్య గారు.

'జోగయ్యగారూ! మన ప్రాచీనుల విజ్ఞానానికి గర్విస్తున్నాను. గణిత శాస్త్రంలో, రస విద్యలో, వైద్య విద్యలో మన పూర్వీకుల పరిశోధనా ఫలితాలు భారతీయులందరికీ ఎంతో ఆనందాన్నిస్తున్నాయి. కానీ అత్యద్భుత కల్పనా కథలైన మన పురాణాలలో, ఆ రచయితలు చేసిన గొప్ప కల్పనలను, కల్పనలుగానే అంగీకరిద్దాం. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నాగేశ్వరరావు గారు ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పినట్లు, మహాభారత కాలం నాటికి మన వాళ్ళకు గాజుతో టెస్ట్ ట్యూబులు కూడా తయారు చేసే విజ్ఞానం లేదు. అందువలనే వ్యాసుడు మట్టి కుండలలో పిండ భాగాలను పెట్టాడని ఆయన తెలియజేశారు. గాజు ట్యూబులనే తయారు చేయలేని వారు టెస్ట్ ట్యూబ్ బేబీలను చేశారంటే, నమ్ముతారా? మరో విచిత్రం ఏమిటంటే, ఆధునిక విజ్ఞానం ప్రకారం, ఫలదీకరణం చెందిన పిండాన్ని గర్భంలో ప్రవేశపెడతారు. మహాభారతంలో గర్భ విచ్ఛిత్తి అయిన పిండాన్ని కుండలలో పెట్టినట్లుగా చెప్పబడింది. అదీ, ఇదీ ఒకే విజ్ఞానమా?


ఇక పుష్పక విమానం సంగతి. భూమి తిరుగుతోందనే వైజ్ఞానిక విషయం కూడా తెలియనివారు గ్రహాంతర యానం ఎలా చేయగలరు? ఇంకా ఇతర విషయాలు కృష్ణబిల సిద్ధాంతం, బిగ్ బ్యాంగ్ థియరీ ఎలా రూపొందించగలరు? ఇలాంటి మనస్తత్వం అంటే శాస్త్రాన్ని కల్పనలనూ కలగలిపే మనస్తత్వం మనకు కొన్ని వందల ఏళ్ల నుండీ ఉన్నది. ఉదాహరణకు క్రీ.శ. 1017-1030 మధ్య భారతదేశంలో పర్యటించిన అల్-బెరూని ఆనాటి మన శాస్త్రవేత్తల గురించి ఇలా అన్నారు. 'భారతీయ శాస్త్రవేత్తలు పూర్తిగా గందరగోళంలో ఉన్నారు. వారి ఆలోచనలో తర్కం ఎంత మాత్రం లేదు. వారి గణితశాస్త్ర, ఖగోళశాస్త్ర విజ్ఞానాన్ని నేను రత్నాలు, గులక రాళ్ళు కలిసిన మిశ్రమంగా మాత్రమే పరిగణించగలను. మన ప్రస్తుత శాస్త్రవేత్తల మానసిక స్థితి కూడా ఇలానే ఉన్నది' అన్నాను.

'అసలు వేల ఏళ్ల నాడే ఆర్జించిన మన విజ్ఞానం ఇలా ఎందుకు మధ్యలో లుప్తమై పోయిందో చెప్పండి' ప్రశ్నించాడు జోగయ్య గారు.

'చెబుతాను. ఉదాహరణకు వైద్య శాస్త్రాన్ని తీసుకుందాం. సుశ్రుతుడు, చరకుడు వైద్య శాస్త్రాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చారు. కానీ ఆ శాస్త్రాన్ని నిరసించే ప్రక్రియ ఉపనిషత్తుల కాలంలోనే మొదలయింది. తైత్తరీయ సంహితలో 'దేవవైద్యులైన అశ్వినులు, వైద్యులుగా మానవుల మధ్య తిరుగాడుతున్నందున వారు అపవిత్రులు' అని చెప్పబడింది. మనుస్మృతి కాలం నాటికి భౌతిక శాస్త్రాలపై నిరాదరణ అత్యంత తీవ్ర స్థాయికి చేరింది. చేతివృత్తుల వారు, వైద్యులు, శస్త్ర చికిత్స నిపుణులను నేరస్తులు, దొంగల జాబితాలో చేర్చి, వారిని ఏ మత కర్మలకూ, చివరకు అంత్యక్రియలకు కూడా పిలువరాదని మనువు శాసించాడు. ఇక వైద్య శాస్త్రం పతనం కాక ఏమవుతుంది? కాబట్టి జోగయ్య గారూ! మన ప్రాచీనుల విజ్ఞానానికి గర్విద్దాం. వారి అజ్ఞానాన్ని అంగీకరిద్దాం. వారి విజ్ఞాన పతనానికి గల కారణాన్ని అన్వేషిద్దాం. మరల ఉన్నత స్థాయికి రావడానికి సరైన ప్రయత్నాలు చేద్దాం. ఏమంటారు?' అన్నాను.

జోగయ్య గారు ఆలోచనలో పడ్డారు.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com



కీరదోసతో ప్రయోజనాలెన్నో..!

కీరదోసని ఇష్టపడని వారెవరుంటారు. వీటిని ఎక్కువగా ఫేస్‌కి, కళ్లు చల్లబడటానికి కూడా వాడుతుంటారు. దీనిలో విటమిన్ కె పుష్కలంగా ఉంటుంది. దీన్ని సలాడ్స్‌నూ, స్నాక్స్‌లోనూ ఎక్కువగా తింటారు.

అయితే వీటిని నిద్రపోయేముందు తింటే నిద్ర బాగా పడుతుందని నిపుణులు చెబుతున్నారు.



- అన్నం తిన్న తర్వాత నిద్రపోయే ముందు ఉండే గ్యాప్‌లో కొన్ని కీరదోస ముక్కలు తింటే నిద్ర బాగా పడుతుంది. ఇలా తినడం వల్ల తిన్న ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా.. జీర్ణక్రియ మెరుగ్గా ఉండి.. నిద్ర త్వరగా పట్టడానికి ఉపకరిస్తుంది.
- ఏదైనా ఇష్టమైన ఆహారం కళ్లెదుట ఉంటే ఎక్కువగా తినకుండా ఉండలేరు. తిన్న తర్వాత అజీర్తి సమస్యతో బాధపడడం కూడా మామూలే. అలాంటప్పుడు కీరదోసను తింటే అజీర్తి సమస్య ఉండదు. గ్యాస్ట్రిక్ సమస్య కూడా ఉండదు. ★

జీవన సౌరభం

మనిషి అందంగా కనపడాలంటే ఎన్నో రకాల తెరలు తొలగించాలి. కానీ, మనసు అందంగా కనపడాలంటే మాత్రం అహం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, క్రోధం అనే అడ్డుపొరలను తొలగించుకోవాలి.

శిఖరంలాంటి.. మహిళ



ఒక మహిళ పోలీసు శాఖలో ఉండటం అంటేనే కత్తిమీద సాములాంటిది. ఐటిబిపి (ఇండో- టిబెటెన్ బార్డర్ పోలీస్)గా చేయడం అంటే పురుషులకే సాహసంతో కూడుకున్న పని. అలాంటిది మహిళ ఆ ప్రాంతంలో ఉద్యోగం చేస్తుందంటే ఆమెకున్న గుండె ధైర్యాన్ని మాటల్లో చెప్పలేం. పురుషునికి ధీటుగా అక్కడ వృత్తిని కొనసాగిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటుంది అపర్ణ కుమార్. ఆమె 2002 ఉత్తరప్రదేశ్ ఐపిఎస్ బ్యాచుకు చెందిన వ్యక్తి. అందరిలా కాకుండా కొంచెం భిన్నంగా ఆలోచిస్తుంది. అందుకే ఇప్పటి వరకు ఏ మహిళా ఐపిఎస్ అధికారి చేయని సాహసం చేశారీవిడ. ఆరు ఖండాల్లో ఉండే ప్రముఖ శిఖరాలను అధిరోహించి అందరిచూపును ఒక్కసారిగా తనవైపుకు తిప్పుకుంది. తాజాగా.. అత్యంత క్లిష్టంగా భావించే అంటార్కిటికాలో ఎత్తైన పర్వతంలోని ముఖ్యమైన పాయింట్‌కు చేరి తిరిగివచ్చారామె. ఈ సందర్భంగా జనవరి 22వ తారీఖున మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గుబాలను కలిసింది.



అంటార్కిటికాలోని పర్వతాన్ని ఎక్కడం కోసం గత సంవత్సరం ఇండో-టిబెటన్ బోర్డర్‌లో ఉన్న పోలీస్ శిబిరంలో ఆమె శిక్షణ తీసుకుంది. 'జులై 2014లో మొదటి పర్వతారోహణ చేశాను. అప్పటినుంచి ఇప్పటివరకు వెనుదిరిగి చూసుకోలేదు. దక్షిణ ధృవంలో పర్వతారోహణ చేయడం అంటే అంత సులువైన విషయం కాదు. అది భూమిమీదే అత్యంత శీతల ప్రదేశం. అక్కడ కొంతప్రాంతం గడ్డకట్టే మంచుతో కప్పబడి ఉంటుంది. మరి కొంతప్రాంతం పొడిగా ఉంటుంది. ఆ వాతావరణంలో ప్రయాణం అంటే ప్రాణాలను ఫణంగా పెట్టడమే. ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత మైనస్ 37 డిగ్రీల నుంచి మైనస్ 48 డిగ్రీల వరకు ఉంటుంది. ఏప్రిల్‌లో ఉత్తర అమెరికాలోని ఏడవ పర్వతాన్ని అధిరోహించడానికి సిద్ధమవుతున్నట్లు' ఆమె విలేకరుల సమావేశంలో చెప్పారు.

ఈ పర్వతారోహణలో ఆమెతోపాటు మరో ఏడుగురు సభ్యులు పాల్గొన్నారు. అందరూ కలిసి 111 మైళ్లు నడిచారు. ఆమె గతంలో పిఎసి (ప్రాంతీయ ఆర్మీ సాయుధ రక్షక దళం)లో అధికారిగా పనిచేశారు. 44 సంవత్సరాల అపర్ణ కుమార్‌కు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం ఆమె ఐటిబిపిలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి)గా పనిచేస్తున్నారు. చైనా బార్డర్‌లో ఉండే ఈ ఐటిబిపి ప్రాంతం 3,488 కి.మీ మంచుతో కప్పబడి ఉంటుంది. మన భారతదేశంలోనే అత్యంత ఎత్తులో ఉండే సరిహద్దు ఇది. ఈ ప్రాంతాన్ని ఐటిబిపి వాళ్లే కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటారు. అలాంటి టీంలో పనిచేయడమే కాక పర్వతాలను అధిరోహిస్తూ తన ప్రత్యేకతను చాటుతున్న అపర్ణ ఐపిఎస్‌ను ప్రతి ఒక్కరూ అభినందించాలి. ★



పద్మశ్రీతో ప్రకాశించిన తెలుగు చాయ్‌వాలా

కొన్నిసార్లు అరుదైన సందర్భాలు వస్తుంటాయి. 'సొంత లాభం కొంతమానుకుని... పొరుగువానికి తోడుపడవోయ్' అనే గురజాడ మాటని వంటపట్టించుకుని నాలుగు దశాబ్దాలుగా టీ బంకు నడుపుతూనే మరోవైపు సమాజసేవని తన ప్రవృత్తిగా మార్చుకుని ముందుకు సాగుతున్న సాధారణ చాయ్‌వాలాకు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. ఆ విధంగా ఆ పురస్కారానికే ప్రత్యేకతను పెంచింది. దేశంలో 'పద్మశ్రీ' వంటి పురస్కారాలు అందుకోవడానికి సెలబ్రిటీలే కావాల్సిన అవసరం లేదని తన సేవాదృక్పథంతో చాటిచెప్పిన తెలుగోడు ప్రకాశరావు. చాలామందితో పోలిస్తే సంపాదనలో చాలా చిన్నవాడు. జీవితంలో కష్టాలు కన్నీళ్లే తప్ప.. ఆడంబరాలను చూడలేదు. తాను సంపాదించిన దాంట్లోనే కొంత భాగంతో పేదపిల్లలకు కేటాయించటాన్ని జీవితాశయంగా పెట్టుకున్న దేవరపల్లి ప్రకాశరావు... కటక్‌లో ఓ టీ బంకు యజమాని. ఎప్పుడో ఆంధ్రా నుంచి ఉపాధికోసం వలస వెళ్లి అక్కడే స్థిరపడి తన సామాజిక సేవాచరణతో ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్న చాయ్‌వాలా ప్రకాశరావు 'జీవన' విశేషాలు మీకోసం ...

ఒడిశా రాజధాని కటక్‌లో బక్సీబజార్ అనేది ఒక బస్తీ. అక్కడ ఉండేవాళ్లంతా కూలీనాలి చేసుకునే వాళ్లు, రిక్షా తోలేవాళ్లు, ఇంకా రకరకాల చిన్న చిన్న పనులు చేసి బతుకు వెళ్లదీస్తున్న వాళ్లు. ఆ బస్తీ ఒక మురికివాడ. ఈ మధ్య హఠాత్తుగా ఈ బస్తీ వార్తలకెక్కింది. జాతీయ, అంతర్జాతీయ మీడియా, సీనియర్ ప్రభుత్వాధికారులు, అంతర్జాతీయ ఎన్జీవోల ప్రతినిధులు బస్తీకొస్తున్నారు. బస్తీ పేరు ఎక్కడ చూసిన మారుమ్రోగుతూ ఉంది. తాజాగా ఈ మధ్య జిల్లా కలెక్టర్ కూడా వచ్చివెళ్లారు. దీనికంతటికీ కారణం, అక్కడున్న ఒక చిన్న చాయ్ దుకాణం, దాన్ని నడిపే తెలుగాయనే ఈ ప్రకాశ్ రావు. తాజాగా ఆయనకు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. ప్రకాశ్‌రావు ఒడిశాలో నివసిస్తున్నా ఆయన తెలుగు భాషని మర్చిపోలేదు. తననెవరైనా ఫోన్లో తెలుగులో బాగున్నారా? అని పలుకరిస్తే చాలు... ఆయన అనర్గళంగా తెలుగులో సంభాషణ మొదలుపెట్టి, మధ్య మధ్య ఒడియాలోకి దూకుతూ, ఇంగ్లీష్‌లో అలవోకగా మాట్లాడుతూ, అపుడపుడు హిందీ వాడుతూ మినీ ఇండియాలా ప్రత్యక్షమవుతాడు. ప్రకాశ్‌రావు ఖాయిలాపడి, చచ్చిబతికినవాడు. ఆపరేషన్ జరుగుతున్నపుడు ఎవరో అనామకుడు చేసిన రక్తదానంతో బతికి బయటపడ్డాడు. ఈ రోజు 'ఇంత వాడు' అయ్యాడు. ఇది జరిగి 40 సంవత్సరాలయింది. అప్పటినుంచి చావుబతుకుల్లో ఉన్నవాళ్లకి రక్తదానం చేసితీరాలనుకున్నాడు. రక్తమే కాదు, ఎంత సహాయం చేయాలో అంతచేయాలనుకున్నాడు. చేస్తున్నాడు.

పేదరోగుల్ని ఆదుకుంటూ ...

గత నలభై ఏళ్ల నుంచీ ఇప్పటిదాకా ఆయన 210 సార్లు రక్తదానం, 17 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేశాడు. ఇపుడు, పేద రోగులకు ఆసుప్రతిలో వేడి నీళ్లందిస్తాడు, పాలు, బ్రెడ్ అందిస్తాడు. వీలయితే, పండ్లు కూడా అందిస్తాడు. ఇది రోజూ జరిగే ప్రక్రియ. ప్రకాశ్‌రావు సేవ చూసి ఒక పెద్ద మనిషి ఆయనకు గీజర్ కొనిచ్చాడు. అధికారులు ఆసుప్రతిలో ఒక గది ఇచ్చారు. మరొకరెవరో అంబులెన్స్ ఇచ్చారు.

ఇంట్లోనే పేదపిల్లలకు స్కూలు

రోగులకు సాయం చేయడానికి మాత్రమే ప్రకాశరావు పరిమితం కాలేదు. తానుంటున్న బస్తీలో పిల్లలెవరూ చదువుకోవడం లేదని, చిల్లర తిరుగుళ్లలో ఉన్నారని కనిపెట్టి, ఆ పరిస్థితి మార్చాలనుకున్నాడు. అంతే! తన రెండు గదుల ఇంటిలో ఒక గదిని స్కూలుగా మార్చేశాడు. పిల్లలను ఒప్పించి ఇంటికి తీసుకువచ్చి, పుస్తకాలు కొనిపించి చదువు చెప్పడం మొదలుపెట్టాడు. ఆ విషయాన్నే ఆయన వివరిస్తూ 'మొదట్లో పిల్లల తల్లిదండ్రులు నన్ను తిట్టారు. మాపిల్లలకు పాచిపనికి వెళ్లి నాలుగు రూకలు తెచ్చేవాళ్లు. నువ్వు బడిపెట్టాక, వీళ్లు పని మానేస్తున్నారని దబాయించారు. వాళ్లని ఒప్పించేందుకు చాలా కష్టపడ్డాను. చివరకు భోజనం నేనే పెడతాను అని చెప్పి వాళ్ల అంగీకారం పొందాను. ఇపుడు నా గది స్కూలయింది. 70 మంది విద్యార్థులు, అయిదుగురు టీచర్లున్నారు. టీచర్‌కు రూ.1500 ఇస్తాను. అందరికీ భోజనం ఉచితం..' తనను అడిగివారికి చెప్తారు.



సంపాదనలో చెరిసగం

తన రోజువారీ సంపాదనలో సగం పేదపిల్లల కోసం ఉదారంగా ఖర్చు చేసేస్తాడు. అదంతా అతని సొంత సొమ్మే. టీ స్టాల్‌లో బన్ బిస్కట్‌లతో పాటు వడలు కూడా ఉంటాయి. రోజూ అన్ని ఖర్చులు పోను 600 రూపాయలు వరకూ మిగులుతుంది. అందులో స్కూలు కోసం 300 రూపాయలిస్తాడు. తన కుటుంబ అవసరాలను తగ్గించుకున్నా కూడా బడికయ్యే ఖర్చుని ఏమాత్రం తగ్గించడు. ఎందుకంటే అది ఆయన జీవిత ధ్యేయం. చిన్నపుడు డాక్టర్ కావాలని తనకో కల ఉండేది. పేదరికం, అనారోగ్యం వల్ల సాధ్యం కాలేదు. అందువల్ల ఈ పిల్లలను చదివిస్తున్నాడు. వారిలో కొంత మంది మెట్రిక్యులేషన్ పాస్ అయ్యారు కూడా.

ఈ స్కూల్లో మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రోజుకు 8 రూపాయలు కావాలి. అయితే, అంత డబ్బు లేదు. అందువల్ల ఉన్నంతలో చేస్తూనే సాయపడే చేతుల కోసం చూస్తున్నాడు. ఈ మధ్య కలెక్టర్ వచ్చి ప్రకాశరావుని అభినందిస్తే...'ఈ మధ్యాహ్న భోజనం పథకాన్ని మా స్కూలుకు పొడిగించాలని కోరాను. అయితే, రూల్స్ ప్రకారం ప్రయివేటు స్కూళ్లకు ఆ పథకం వర్తించదని చెప్పారు. నేను నిరుత్సాహ పడలేదు.' అన్నాడు. పొద్దున పూటంతా చాయ్ దుకాణం నడిపి, మధ్యాహ్నం టీచర్ అవతారం ఎత్తుతాడు ప్రకాశ రావు. ఈ మధ్యలో ఒక రౌండ్ సైకిలేసుకుని ఆసుప్రతికి వెళ్లడం ఆయన రోజు వారి పని.





ఆడపిల్లలు చదవాలి

'సంపాదనకోసమే ఎన్నో అవస్థలు పడుతూ సామాజిక సేవలో ఇంత ఉత్సాహం ఎలా వచ్చిందంటే ...ఇద్దరు కూతుర్లున్నతండ్రికి కొంచెం గర్వం ఉండాలి. నాకు ఇద్దరు కూతుర్లు. బాగా చదువుకున్నారు. స్థిరపడ్డారు. అదే నా ఉత్సాహానికి అసలు కారణం. నాస్కూళ్లో కూడా ఆడపిల్లలకు ప్రాధాన్యం. ఆడపిల్లలు బాగా చదువుకోవాలి. వారి మీదే దేశ భవిష్యత్తు ఆధారపడుంది'

- ప్రకాశరావు,
ఫోన్: 09861235550

ప్రకాశరావుది ప్రకాశం జిల్లా

ప్రకాశరావు ముత్తాత దేవరపల్లి అప్పాలస్వామి. స్వస్థలం ఆంధ్రాలోని ప్రకాశం జిల్లా దేవరపల్లి. 1888 ప్రాంతంలో పిల్లా జెల్లా వేసుకుని నడుచుకుంటూ తూర్పు దేశ యాత్ర ప్రారంభించారు. చివరకు వాళ్ల కుటుంబం కటక్ సమీపంలో ఉన్న ఒక ప్రాంతంలో మకాం వేశారు. అదిపుడు తెలంగపెంటగా మారింది. అతని తాత మంచి వంటగాడు కావడంతో బ్రిటిష్ వాళ్ల దగ్గర కొలువుకు కుదిరాడు. బెంగాల్, అస్సాం తిరిగి, చివరకు తెలంగపెంటకే వచ్చాడు. తండ్రి కృష్ణమూర్తి రెండో ప్రపంచయుద్ధ కాలంలో సైన్యంలో బర్మాలో పనిచేసి తిరిగొచ్చాడు. కొద్ది రోజులు ఒక ప్రయివేటు కంపెనీలో వెల్డర్‌గా పనిచేశాడు. 1960లో టీ స్టాల్ తెరిచాడు. అయితే, తండ్రి చనిపోవడం, తర్వాత టిబి వ్యాధి సోకడంతో ప్రకాశరావు చదువు మానేసి ఈ టీస్టాల్ బాధ్యత తీసుకున్నాడు.

గతేడాది బిసెంట్ సెల్ఫ్ లెస్ సర్వీస్ అవార్డు-2016కి ప్రకాశరావు ఎంపికయ్యారు. ఆయనకు గతంలో చాలా అవార్డులొచ్చాయి. ఇప్పుడతని కీర్తి అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఇపుడాయన వయస్సు 59 సంవత్సారాలు. తన పనిలో ఎలాంటి అలసట లేదు.. విశ్రాంతి లేదు. ఈ సేవ ఇలాగే కొనసాగుతుందని ఉత్సాహంగా చెబుతాడు ప్రకాశరావు.

- ఆసియానెట్ సౌజన్యంతో

కొత్తిమీరతో.. జలుబు నివారణ

శీతాకాలంలో జలుబుతో తుమ్ములు రావడం సహజం. అలాంటప్పుడు కొత్తిమీర మంచి ఔషధంగా పనిచేస్తుంది. కొత్తిమీరకు సహజంగానే సువాసనలు వెదజల్లే గుణం ఉంది. కొత్తిమీర ఆకుల వాసన బాగా పీల్చుకుంటే తుమ్ముల నుంచి ఉపశమనం దొరుకుతుందని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో వేడిని తగ్గించడంలో కొత్తిమీర చక్కగా పనిచేస్తుంది. శరీరంలోని ఉష్ణతాపాన్ని తగ్గించడంలో కొత్తిమీర పాత్ర చెప్పుకోదగింది. కఫం, వాత, పిత్త వ్యాధులను కొత్తిమీర దూరం చేస్తుంది. ఆకలిని పెంచుతుంది. గుప్పెడు కొత్తిమీర ఆకులను తీసుకుని నీటిలో బాగా మరిగించి.. సేవించడం ద్వారా జలుబును దూరం చేసుకోవచ్చు. అంతేకాదు కొత్తిమీర మధుమేహాన్ని నియంత్రిస్తుంది. రక్తంలోని ఇన్సులిన్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ ఎ ఊపిరితిత్తులకు మేలు చేస్తుంది. అలాగే కొత్తిమీర క్యాన్సర్ కారకాలను దరిచేరనివ్వదు. వీటితో పాటు నోటి అల్సర్‌కు కొత్తిమీర చెక్ పెడుతుంది. అల్జీమర్స్‌ను దూరం చేసుకోవాలంటే కొత్తిమీరను రోజూ ఆహారంలో చేర్చుకోవాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. ★



మీకోసం

ఒక గ్లాసు మజ్జిగలో స్పూను పంచదార వేసుకుని తాగితే నిద్ర బాగా పడుతుంది.



దంత సంరక్షణ.. ఇలా!



కొందరి దంతాలు ఎంత బ్రష్ చేసినా గానీ పచ్చగానే కనిపిస్తుంటాయి. ఇలాంటివారు తాము మాట్లాడేటప్పుడు చాలా ఇబ్బందిగా ఫీలవుతుంటారు. దీనికి కారణం తాగే నీరు, తీసుకునే ఆహారమే ఈ సమస్యకు ప్రధాన కారణాలవుతాయి. తిన్న ఆహార పదార్థాలు దంతాలపై నిల్వ ఉంటే రంగు మారే అవకాశం ఉంటుంది. తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకున్నా దంతాలు పాడవుతాయి. సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం, ఖైనీలు నమలడం వంటి అలవాట్లు దంతాలకు హానిచేస్తాయి. దంతాలతో పాటు చిగుళ్ళకూ ఇన్‌ఫెక్షన్ వస్తుంది. అంతేకాదు దంతాలు విరిగిపోవడంతో పాటు దవడ ఎముకా విరిగి పోతుంది. విటమిన్ సి, విటమిను డి లోపించినా, శరీరంలో క్యాల్షియం తగ్గిపోయినా దంతాలు రంగు మారతాయి. తాగే నీటిలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్నా ఇదే పరిస్థితి తలెత్తుతుంది. అందుకే ప్రతిరోజు ఉదయం, రాత్రినిద్రకు ముందు దంతాలు శుభ్రపరుచుకోవాలి. భోజనం చేసిన ప్రతిసారీ నోటిని స్వచ్ఛమైన నీటితో శుభ్రపరచుకోవాలి. మెడికేటెడ్ టూత్ పేస్ట్ వాడాలి. వైద్యుని సలహా మేరకు జాగ్రత్తగా నడుచుకోవాలి. ★

సెన్సెక్స్ ⬇ 399
35,656

నిఫ్టీ ⬇ 119
10,661

రూపాయి ⬆ 07 పై
అమెరికా డాలరుకు రూ. 71.10



। క్రొత్త బలెనో..

మారుతి సుజుకి మార్కెట్లోకి కొత్త బలెనో 2019ను రెండు రంగుల్లో విడుదల చేసింది. పెట్రోల్ వర్షన్ కారు న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం రూ.5.45 లక్షలుగా నిర్ణయించింది. డీజిల్ వర్షన్ ధర రూ.6.60 లక్షలుగా ప్రకటించింది. పాత వర్షన్ ధరతో పోల్చితే రూ.9,000 ఎక్కువగానుంది.

సామ్‌సంగ్ నుంచి కొత్త ఫోన్లు..



ఎం 10, ఎం 20 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేస్తున్న మనీష్ తివారి, ఆసిమ్ వార్సీ

గుర్గావ్ : సామ్‌సంగ్ భారత మార్కెట్లోకి కొత్త ఎం10, ఎం 20 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. సోమవారం గుర్గావ్‌లో ఈ స్మార్ట్‌ఫోన్లను సామ్‌సంగ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఆసిమ్ వార్సి, అమెజాన్ ఇండియా కేటగిరీ వైస్ ప్రెసిడెంట్ మనిష్ తివారి ఆవిష్కరించారు. 2జి రామ్, 16 స్టోరేజీ కలిన ఎం 10 ప్రారంభ ధర రూ.7,990గా, 3జిబి రామ్, 32జిబి స్టోరేజీ మోడల్ ధరను రూ.8,990గా నిర్ణయించింది. కాగా గెలాక్సీ ఎం 20లో 3జిబి ర్యామ్, 32జిబి స్టోరేజీ ధరను రూ.10,990గా, 4జిబి రామ్, 64జిబి స్టోరేజీ మోడల్ ధరను రూ.12,990గా నిర్ణయించారు. ఈ స్మార్ట్‌ఫోన్లను ఫిబ్రవరి 5 నుంచి అమెజాన్.ఇన్, సామ్‌సంగ్ ఇండియా ఇ స్టోర్‌లో విక్రయించనున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ఎం 10ను 5 ఎంపి సెల్ఫీ కెమెరా, 13 ప్లస్ 5 ఎంపి వెనుక కెమెరాలో అందుబాటులోకి తెచ్చింది. కాగా ఎం20ని 8 ఎంపి ముందు కెమెరా, వెనుకాల 13 ఎంపి ప్లస్ 5 ఎంపి కెమెరాలతో రూపొందించింది.

బ్యాంకుల పరిస్థితిపై సమీక్ష

పిఎస్‌బి చీఫ్‌లతో ఆర్‌బిఐ గవర్నర్ భేటీ



న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల ముఖ్య అధికారులతో భేటీ అయ్యారు. బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బిఐ ఏమి ఆశిస్తోందో వారికి తెలియజెప్పడం కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు దాస్ తెలిపారు. ప్రస్తుత బ్యాంకింగ్ పరిస్థితిపై చర్చించామన్నారు. అదే విధంగా భవిష్యత్తులో బ్యాంకుల పనితీరుపై కూడా మాట్లాడినట్లు తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ ఆరో పరపతి విధాన సమీక్ష జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ కీలకమైందని బ్యాంకింగ్ వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో ఆర్‌బిఐ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని ఇప్పటికే చాలా విశ్లేషణలు, అభిప్రాయాలు వచ్చాయి.

జియో నుంచి రైల్వే టికెట్ యాప్

హైదరాబాద్ : రిలయన్స్ జియో కొత్తగా జియో రైల్ యాప్‌ను ఆవిష్కరించింది. దీని ద్వారా తమ వినియోగదారులు రైలు టికెట్లు బుక్ చేసుకోవడం, రద్దు చేసుకోవడం వంటి సేవలను పొందవచ్చని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఏ జియో ఫోన్‌తో అయినా జియోరైల్ యాప్ ద్వారా ఐఆర్‌సిటిసి రిజర్వ్డ్ టికెట్ బుకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఈ అప్లికేషన్ 'జియో యాప్ స్టోర్'లో అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్, వాలెట్ల ద్వారా చెల్లింపులు చేయవచ్చని తెలిపింది. అదే విధంగా పిఎన్ఆర్ స్టేటస్ తెలుసుకోవడం, రైళ్ల రాకపోకల వేళలు, రూట్లు, అందుబాటులో ఉన్న సీట్లు వంటి పలు సేవలను జియో ఫోన్ ద్వారా వినియోగదారులు పొందే వెసులుబాటు ఉంటుందని వెల్లడించింది.

కేంద్రంపై బీమా కంపెనీల ఆశలు..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు కేంద్ర ప్రభుత్వంపై ఆశలు పెంచుకుంటున్నాయి. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌లో పిఎస్‌యు బీమా సంస్థలకు రూ.4,000 కోట్ల మేరకు ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు కేటాయింపులు జరుగొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందులోని మూడు పిఎస్‌యులకు ఈ మొత్తం మూలధనం అవసరమని ఆర్థిక సేవల శాఖ ప్రతిపాదనలు చేసింది. ఈ మొత్తం అందించడం ద్వారా నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీలు మెరుగుపడటానికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు. ఈ మూడు కంపెనీలు కలిపి 200 రకాల బీమా సేవలను అందజేస్తున్నాయి.

మార్కెట్లకు బడ్జెట్ భయాలు

- నిరాశపర్చిన కార్పొరేట్ల ఫలితాలు
- సెన్సెక్స్ 369 పాయింట్ల పతనం
- కోలుకున్న జీ స్టాక్స్



ముంబయి : వరుసగా రెండో సెషన్ దేశీయ స్టాక్ మార్కెట్లు నేల చూపులు చూశాయి. ముఖ్యంగా ఎస్సెల్ గ్రూపు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడంతో ఆ కంపెనీకి అప్పులిచ్చిన మ్యూచువల్ ఫండ్ సంస్థల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురైయ్యాయి. ఇప్పటికే ఎంఎఫ్‌లు ఐఎల్అండ్ఎఫ్ఎస్ అప్పు భారాన్ని ఎదుర్కోంటున్నాయి. దీనికి తోడు ఎస్సెల్ గ్రూపు సంక్షోభం మరింత ప్రభావం చూపింది. కాగా ఎన్నికల సంవత్సరం కావడంతో తాత్కాలిక బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలు ఎక్కువ ఉండవచ్చనే అంచనాలు.. మదుపర్లను కొనుగోళ్లకు పురిగొల్పాయి. ఈ పరిణామాల మధ్య సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 368.84 పాయింట్లు పతనమై 35,656.70కు దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 119 పాయింట్లు నష్టపోయి 10,661.55 వద్ద ముగిసింది. ఎస్సెల్ గ్రూపు సంక్షోభ వార్తల నేపథ్యంలో ఇంతక్రితం సెషన్‌లో భారీగా నష్టపోయిన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు సోమవారం తిరిగి పుంజుకున్నాయి. తాము ఇప్పటి వరకూ ఏ బ్యాంకుకు రుణాల చెల్లింపులో డిఫాల్ట్ కాలేదని ప్రకటించడంతో బిఎస్ఇలో ఈ స్టాక్ 16.64 శాతం పెరిగి రూ.372.50 వద్ద మగిసింది.

ఐటి సూచీ మినహా అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. వైద్య సూచీ, ఆటోమొబైల్, లోహ, ఫైనాన్సీయల్ సర్వీసెస్, బ్యాంకింగ్ రంగాలు 0.65 శాతం నుంచి 2 శాతం వరకు నష్టపోయాయి. ఒక్క ఐటి సూచీ మాత్రం 0.40 శాతం లాభపడింది. సెన్సెక్స్-30లో ఏడు స్టాక్స్ మినహా 23 స్టాక్స్ పతనమయ్యాయి. టిసిఎస్ అత్యధికంగా 1.71 శాతం లాభపడింది. ఇదే బాటలో కోల్ ఇండియా, ఎల్అండ్‌టి, పవర్ గ్రిడ్, ఆసియన్ పెయింట్స్, హెచ్‌సిఎల్ టెక్, ఎన్‌టిపిసి స్టాక్స్ 0.07- శాతం నుంచి 1.51 శాతం వరకు రాణించాయి. యస్ బ్యాంకు, బజాజ్ ఫినాన్స్, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండుస్ఇండ్ బ్యాంకు, హీరో మోటో కార్ప్ 2.35 శాతం నుంచి 5.46 శాతం వరకు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ప్రతికూలాంశాలు..

దేశీయ పరిణామాలకు తోడు చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం భయలు కూడా భారత మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో పలు కార్పొరేట్ కంపెనీలు నిరాశజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందాకొచ్చర్‌పై సిబిఐ కేసును నమోదు చేయడంతో ఆ సంస్థ షేర్లు ఒత్తడికి గురయ్యాయి. మొండి బాకీలను తగ్గించి చూపించారని కొచ్చర్‌పై ఆరోపణలు వచ్చాయి. భారత మార్కెట్లలో నుంచి ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గు చూపారు. జనవరి నెలలో నికరంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారనే రిపోర్టులు మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

రెట్టింపైన కెనరా బ్యాంకు లాభాలు

తగ్గిన మొండి బాకీలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంకు నికర లాభాలు రెట్టింపు అయ్యాయి. 2018-19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.317.52 కోట్ల లాభాలు సాధించింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ3లో రూ.125.75 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.12,341.09 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం క్యూ3లో రూ.13,513.35 కోట్లకు చేరింది. 2018 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 10.25 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటికి 10.38 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో 6.78 శాతంగా ఉన్న నికర నిరర్థక ఆస్తులు.. క్రితం డిసెంబర్ ముగింపు నాటికి 6.37 శాతానికి తగ్గాయి. క్రితం క్యూ3 నాటికి మొండి బాకీల కోసం బ్యాంకు కేటాయింపులు రూ.1,977 కోట్లుగా ఉండగా, 2017-18 ఇదే కాలంలో రూ.2,673.64 కోట్ల కేటాయింపులు జరిపింది. మొండి బాకీలు తగ్గడం వల్ల బ్యాంకు లాభదాయకత పెరిగింది.

జెఎల్ఆర్ నుంచి సరికొత్త డిస్కవరీ స్పోర్ట్

న్యూఢిల్లీ : టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వర్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) సోమవారం దేశ మార్కెట్లోకి 2019 ఎడిషన్ డిస్కవరీ స్పోర్ట్ ల్యాండ్‌మార్క్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూం ధర రూ.53.77 లక్షలుగా నిర్ణయించింది. దీన్ని 2 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు జెఎల్ఆర్ ఇండియా ప్రెసిడెంట్ రోహిత్ సూరీ పేర్కొన్నారు. అత్యాధునిక ఫీచర్లతో రూపొందించామన్నారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

చరిత్ర



ఎవిపి.రాజు
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

'నవరత్నాలు' ఏ ఆస్థానంలోని కవులు?

గుప్తులయుగం (320-550 ఎడి)

1. గుప్తుల కాలంనాటి మంత్రిమండలి ఎలా ఉండేది?

చక్రవర్తికి పరిపాలనలో సహాయపడటానికి, మంత్రిమండలి ఉంది. మంత్రులను మంత్రి లేదా సచివ అని పిలిచేవారు. విశ్వాసపాత్రులైన వారిని, ప్రతిభగలవారిని మాత్రమే మంత్రులుగా నియమించారు.

సర్వాదక్ష : ఇతను మొత్తం కేంద్రపరిపాలనను పర్యవేక్షిస్తాడు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను గవర్నర్లకు, జిల్లా అధికారులకు చేరవేసే బాధ్యత సర్వాధ్యక్షునిది.

మహాసేనాపతి : గుప్తచక్రవర్తులే సైన్యానికి నాయకత్వం వహించి దండయాత్రలు నడిపేవారు. అయినప్పటికీ సైనిక నిర్వహణ కోసం మహాసేనాధిపతిని నియమించేవారు.

మహాదండనాయక : ఇతను న్యాయాధిపతి

మహాబలాధికరణ : సైనికశాఖాధిపతి

దండోపాశిక : పోలీసుశాఖాధిపతి

మహాసంధివిగ్రహిక : విదేశాంగమంత్రి

భండాగారాధికృత : ప్రభుత్వకోశాధికారి

మహాప్రతిహార : ప్రభుకుటుంబ బాధ్యతలు చూసుకునేవాడు.

2. మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ 320-335) ఎవరు ?

గుప్తవంశాల మూలపురుషుడు శ్రీగుప్తుడు. ఇతడు పాటలీపుత్రం దాని పరిసర ప్రాంతాలకు అధిపతి. ఇతని కుమారుడు ఘటోత్కచుడు. ఘటోత్కచుని కుమారుడు మొదటి చంద్రగుప్తుడు. ఇతడు లిచ్చవీరాకుమార్తె అయిన కుమారీదేవిని వివాహమాడి, వారి సాయంతో గంగానదీ పరిసర ప్రాంతాలను జయించి, గుప్తసామ్రాజ్యానికి పునాదులు వేశాడు. ఇతడు క్రీ.శ 320 ఫిబ్రవరి 26న గుప్తశకాన్ని ప్రారంభించాడు.

3. 'నీతిసారం' గ్రంథకర్త ఎవరు ?

కౌటిల్యుని అర్థశాస్త్రానికి పూర్వార్థంలోని ఒకటో చంద్రగుప్తుని కాలంలో కామందుకుని 'నీతిసారం' అనే గ్రంథం ప్రసిద్ధి చెందింది. ఆనాటి రాజనీతి, పరిపాలనా వ్యవస్థ ఈ నీతిసారంలో ప్రతిబింబిస్తున్నాయి.

4. గుప్తవంశం - రాజులు ఎవరు ?

- ✧ శ్రీగుప్తుడు (మూలపురుషుడు)
- ✧ ఘటోత్కచుడు
- ✧ మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ 320-335)
- ✧ సముద్రగుప్తుడు (క్రీ.శ 335-380)
- ✧ చంద్రగుప్త విక్రమాదిత్యుడు (క్రీ.శ 380-414)
- ✧ మొదటి కుమారగుప్తుడు (క్రీ.శ 414-435)
- ✧ స్కందగుప్తుడు (క్రీ.శ 435-467)

నోట్ : స్కందగుప్తుడు చివరి గుప్త చక్రవర్తి. అతని తర్వాత గుప్తరాజ్యం పతనం కావడం ప్రారంభమైంది. స్కందగుప్తుని తర్వాత పురుగుప్తుడు రాజయ్యాడు. తర్వాత 477 ఎడిలో బుద్ధగుప్తుడు అధికారంలోకి వచ్చాడు. హుణ దండయాత్రల వల్ల గుప్తరాజ్యం బాగా బలహీనపడి, మూడవ కుమారగుప్తుడు చివరి గుప్త చక్రవర్తి.

5. సముద్రగుప్తుడిని గుప్తవంశం గొప్పవాడు అని ఎందుకు అంటారు?



గుప్తచక్రవర్తులలోనేకాక భారతీయ చక్రవర్తులలో అగ్రగణ్యుడు సముద్రగుప్తుడు. ఇతనిని చరిత్రకారుడు స్మిత్ 'భారతీయ నెపోలియన్' అని అభివర్ణిస్తారు. ఇతడు గొప్ప విజేత. ఓటమి ఎరుగనిధీరుడు. సముద్రగుప్తుని దిగ్విజయయాత్రలను గురించి అతని మంత్రియైన హరిసేనుడు అశోకుని స్తంభముపై రాయించిన అలహాబాద్ ప్రశస్తి అనే శిలాశాసనం వల్ల తెలుస్తుంది. ఇతడు తన దిగ్విజయ యాత్రలతో గుప్తసామ్రాజ్యాన్ని ఉత్తర హిమాలయ పర్వతాల నుంచి దక్షిణ నర్మదానది వరకూ, పడమర యమున, చంబల్ నదుల నుంచి తూర్పు బ్రహ్మపుత్రవరకూ విస్తరింపజేశాడు.

సముద్రగుప్తుడు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతడు గొప్పనాయకుడు. సంగీత విద్వాంసుడు. వీణ వాయిస్తున్నట్లు ఉన్న అతని బంగారు నాణేలు అతని సంగీత ప్రతిభను, సంగీతాభిమానాన్ని చాటుచున్నవి. సముద్రగుప్తుడు గొప్పకవి. కవి, పండిత పోషకుడు. ఇతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉన్నది. ఇతని ఆస్థానంలో 'వసుబంధుడు' అనే బౌద్ధ పండితుడు ఉండేవాడు.

6. సంస్కృత సాహిత్యాన్ని అభివృద్ధి చేసిన 'నవరత్నాలు' అనే కవులు ఎవరి ఆస్థానంలో ఉన్నారు?

గుప్తచక్రవర్తులలోనేకాక భారతీయ చక్రవర్తులలో ప్రముఖుడు రెండో చంద్రగుప్తుడు లేక చంద్రగుప్త విక్రమాదిత్యుడు. ఇతని పాలనాకాలం స్వర్ణయుగంగా కీర్తికెక్కింది.

రెండో చంద్రగుప్తుడు తన తండ్రి సముద్రగుప్తుని వలే దిగ్విజయ యాత్రలు సాగించాడు. ఇందుకు మొదట భారతదేశంలోని బలీయులైన చక్రవర్తులతో వివాహ సంబంధాలు కలిపి, విదేశీయులైన శక్తులను భారతదేశం నుంచి తరిమివేశాడు. ఈ విజయానికి చిహ్నంగా చంద్రగుప్తుడు 'శకారి', 'సాహసాంక', 'విక్రమాదిత్య' అనే బిరుదులను ధరించాడు. సింహం బొమ్మగల బంగారు నాణేలను ముద్రించాడు.

చంద్రగుప్తుని దిగ్విజయ యాత్రల వల్ల ఇతని రాజ్యం ఉత్తర హిమాలయ పర్వతాల నుంచి దక్షిణ నర్మదానది వరకూ, తూర్పు బెంగాలు నుంచి పశ్చిమ వల్లభి వరకూ విస్తరించింది.

చంద్రగుప్త విక్రమాదిత్యుని ఆదరణలో ఉజ్జయిని గొప్ప విద్యాకేంద్రంగా విలసిల్లింది. విక్రమాదిత్యుని ఆస్థానంలో 'నవరత్నాలు' అనే తొమ్మిదిమంది సంస్కృత పండితులు ఉండేవారు. వారి పేర్లు...

1. కాళిదాసు	2. వరహమిహిరుడు
3. ధన్వంతరి	4. అమరసింహుడు
5. క్షపణకుడు	6. శంకు
7. భేతాళభట్టు	8. ఘటకర్పురుడు
9. వరరుచి	

నవరత్నాలలో కాళిదాసు అగ్రగణ్యుడు. ఈయన రచించిన అభిజ్ఞాన శాకుంతలం, మేఘసందేశం, కుమారసంభవం, మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, రఘువంశం, ఋతుసంహారం, మేఘదూత.. మొదలైన రచనలు సంస్కృత భాషలో అత్యుత్తమమైనవి.

వరాహమిహిరుడు రచనలు.. పంచసిద్ధాంతం, బృహత్ సంహిత. తన బృహత్ సంహితలో చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతున్నాడని, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని చెప్పాడు. బృహత్ జాతక అనే గ్రంథాన్నీ రచించాడు. ఇవి ఖగోళ, భౌతిక, వృక్ష, ప్రకృతి శాస్త్రాల విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చు.

7. రెండో చంద్రగుప్తుని కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు ఎవరు?

చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలంలో 'పాహియాన్' అనే చైనాయాత్రికుడు భారతదేశాన్ని సందర్శించాడు. ఇతడు భారతదేశంలో పది సంవత్సరాలు ఉమ్మడి గుప్తుల పాలనను ప్రశంసించాడు. ఇతని రచన 'రికార్డు ఆఫ్ బుద్ధిస్ట్ కింగ్‌డమ్స్.

గుప్తుని కాలంలో ప్రజలపై పన్నుల భారం లేదని పేర్కొన్నాడు. సుమారు క్రీ.శ 399-414 మధ్య కాలంలో సందర్శించాడు.

8. గుప్తులకాలంనాటి- పండితులు - రచనలు ఏవి?

- ✧ రామచంద్రుడు - నాట్యదర్పణం
- ✧ సుబంధు - వాసవదత్త
- ✧ ప్రవరసేనుడు - సేతుబంధం
- ✧ వాగ్భటుడు - పుష్పాంగ సంగ్రహం (వైద్యశాస్త్రం)
- ✧ మాఘకవి - శిశుపాలవధ
- ✧ కాస్మాస్ - క్రిష్టియన్ టోపోగ్రఫీ
- ✧ బ్రహ్మగుప్తుడు - గురుత్వాకర్షణ శక్తి సిద్ధాంతం, బ్రహ్మస్పృత సిద్ధాంతం, కందకంద్యకా
- ✧ దండి - దశకుమార చరిత్ర, కావ్యదర్శ
- ✧ ఆర్యభట్టు - సూర్యసిద్ధాంతం, ఆర్యభట్టీయం
- ✧ శిఖాభదత్తుడు - ముద్రరాక్షసం, దేవీచంద్రగుప్తం
- ✧ శూద్రకుడు - మృచ్ఛకటికం, మృత్యకటిక
- ✧ విష్ణుశర్మ - పంచతంత్రం
- ✧ భారవి - కిరాతార్జునీయం
- ✧ బాణుడు - స్వప్నవాసవదత్త, ప్రతిజ్ఞాయుగంధరాయ
- ✧ మయూరుడు - సూర్య శతకం

9. 'విషయపతి' అంటే ఎవరు ?

రాష్ట్ర పరిపాలనా కేంద్ర పరిపాలనను పోలి ఉంది. ప్రావిన్సులను జిల్లాలుగా (విషయ) విభజించారు. జిల్లాధికారిని విషయపతి అంటారు. ఇతన్ని ఐదేళ్ల కాలానికి నియమించారు. విషయ పరిపాలనా నిర్వహణ కోసం 30 మందితో కూడిన సలహాబోర్డు ఉండేది. ఈ బోర్డును 'విషయ మహత్తర' అంటారు. ఈ బోర్డు సభ్యులను విషయపతి నియమిస్తాడు. ఈ బోర్డు సభ్యులు వివిధరకాల గిల్డులు, వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

1. సార్థవహ - వ్యాపారవాణిజ్య సంస్థాధిపతి
2. నగరశ్రేష్ఠి - గిల్డు అధ్యక్షుడు
3. ప్రథమ కాయస్త - ప్రధానలేఖనుడు
4. ప్రథమ కులిక - మొదలైనవారు జిల్లా బోర్డులో సభ్యులుగా ఉండి, జిల్లా పరిపాలనలో విషయపతికి సహకరిస్తారు.

★

నమూనా ప్రశ్నలు

1. హైందవ తర్కశాస్త్రానికి మూలపురుషుడైన ప్రాచీన భారతమేధావి
- దిజ్నాగుడు

2. గుప్తుల కాలంలో వైద్య విజ్ఞానంలో, శస్త్రచికిత్సలు చేయడంలో పేరుగాంచినవారు
- శుశ్రుతుడు - శుశ్రుతసంహిత గ్రంథం రచయిత

3. నలందా విశ్వవిద్యాలయంతో సంబంధమున్న గుప్త చక్రవర్తి
- కుమారగుప్తుడు

4. పాటలీపుత్రం నుంచి ఉజ్జయినికి తన రాజధానిని మార్చిన గుప్తరాజు
- రెండో చంద్రగుప్తుడు

5. గుప్తుల కాలంలో 'పూగ' అనేపదం దేన్ని సూచిస్తుంది
- వర్తకుల సమూహం (వర్తక వ్యాపారులు)

6. గుప్తులకాలంలో తూర్పు తీరంలోని ఓడరేవు (ముఖ్యమైనది)
- తామ్రలిప్తి

7. సముద్రగుప్తుని పరిపాలనాకాలం
- క్రీ.శ 335-375

8. సముద్రగుప్తుని సుప్రసిద్ధ ప్రశస్తియైన అలహాబాద్ స్తంభశాసనాన్ని రచించిన హరిసేనుడు ఏ పదవిని నిర్వహించాడు
- సేనాధిపతి

9. సముద్రగుప్తుని సైనిక విజయాలతో విశేషంగా ఆకర్షితుడైన ఏ చరిత్రకారుడు ఇతన్ని 'ఇండియన్ నెపోలియన్'గా వర్ణించాడు
- డా.వి.ఎ.స్మిత్

10. దశాంశ, సున్న విలువలను ప్రపంచానికి ఇచ్చింది ఏ కాలపు గణిత, ఖగోళశాస్త్రజ్ఞులు
- గుప్తుల కాలంనాటి

11. అజంతాలోని కుడ్యచిత్రాలలోని గుప్తులకు సంబంధించిన గుహలు
- 16,17,19

12. నిగమ అనగా
- ఒక పట్టణానికి చెందిన ప్రజల సమూహం

13. మౌర్యుల కాలంనాటి కౌటిల్యుని అర్థశాస్త్రంలో పోల్చదగిన గుప్తులకాలం నాటి గ్రంథం ఏమిటి
- కామందకుడు రచించిన నీతిసారం

14. గుప్తుల కాలంలో రచించిన నవనికేతనం ఏ శాస్త్రానికి సంబంధించినది
- వైద్యం

15. స్కందావారాలు అనగా
- మిలటరీ క్యాంపులు

ఉద్యోగాలు

ఆర్మీ-ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 46వ కోర్సు ద్వారా షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 55 (ఎన్‌సీసీ పురుషులు-50, మహిళలు-5).

అర్హత: కనీసం 50% మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. చివరి ఏడాది చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌సీసీ-సీ సర్టిఫికెట్‌తో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.

వయసు: 2019, జూలై 1 నాటికి 19-25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: స్టేజ్ 1, 2 పరీక్షలు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 7, 2019.

వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

కౌలు రైతుల మేనిఫెస్టో విడుదల

ప్రజాశక్తి - తాళ్లరేవు(తూర్పుగోదావరి)

కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం 10 డిమాండ్లు, 42 అనుబంధ అంశాలతో మేనిఫెస్టోను సోమవారం విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు లయన్స్ హాల్లో వల్లు రాజబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగబోయిన రంగారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సంఘం ఇచ్చిన కౌలు రైతుల మేనిఫెస్టోలోని అంశాలను పకడ్బంధీగా అమలు చేయాలని కోరారు. 2011 కౌలు రైతు చట్టం ప్రకారం రుణాలివ్వాలని, కౌలు మొత్తానికి వడ్డీ లేకుండా రుణం రూపంలో ఇవ్వాలని, కౌలు రైతులకు సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని, సాగుదారు, కౌలుదార్లను నమోదు చేయాలని, 50 ఏళ్లు దాటిన కౌలు రైతులకు నెలకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంక్షేమ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు.



దీక్ష రిలే నిరాహార దీక్ష చేస్తున్న జూట్ మిల్లు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

జూట్ కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్ (విజయనగరం జిల్లా)

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన విజయనగరం జిల్లా బొబ్బిలిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస జూట్‌మిల్లు కార్మికులు సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మూతబడిన మిల్లును తెరిపించాలని, బకాయిలు చెల్లించాలని తదితర డిమాండ్లతో ఎన్‌టిఆర్ విగ్రహం కూడలిలో చేపట్టిన ఈ దీక్షలను ప్రముఖ న్యాయవాది, బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు అమరాపు రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూట్ మిల్లు కార్మికుల సమస్యలను 50 ఏళ్లుగా పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం కార్మికులను రోడ్డుమీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం చట్టవిరుద్ధమని తెలిపారు. సిఐటియు జిల్లా (పార్వతీపురం) ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జూట్‌మిల్లు యాజమాన్యం తీరువల్ల సుమారు మూడు వేల మంది కార్మికుల జీవితాలు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సుమారు రూ.50 కోట్లు జీతాలు, గ్రాట్యూటీ, బోనస్‌లు, పిఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మిల్లును మూసివేసిన యాజమాన్యంపై ప్రభుత్వంగానీ, స్థానిక మంత్రిగానీ చర్యలు తీసుకోకపోవడంతో కార్మికుల బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 4న మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పి.శంకరరావు, వి.శేషగిరిరావు, బి.శ్రీను, జ్యూట్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాలకు రిజర్వేషన్ వద్దంటూ 11న ఢిల్లీలో ధర్నా

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేయనున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు చెప్పారు. గుంటూరులోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. రిజర్వేషన్లు ఇప్పటి వరకు సామాజిక అంశంగా కొనసాగాయని, మోడీ ప్రభుత్వం ఆర్థిక అంశంగా మార్చిందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ప్రజాక్షేత్రంలో, న్యాయస్థానాల్లో పోరాడతామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22న ఢిల్లీలో నిర్వహించిన 'అఖిల భారత బిసి ఫెడరేషన్' పిలుపులో భాగంగా ఫిబ్రవరి 11న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ స్థాయి ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ రిజర్వేషన్ ఎన్నికల ఎత్తుగడని, ఓట్ల క్రీడలో భాగంగా టిడిపి ప్రభుత్వం సైతం 5 శాతం రిజర్వేషన్ కాపులకు కేటాయిస్తున్నట్లు ప్రకటించిందని దుయ్యబట్టారు.

విద్యార్థినిపై లెక్చరర్ లైంగిక వేధింపులు

ప్రజాశక్తి - సామర్లకోట, పిఠాపురం

విద్యార్థినిపై లెక్చరర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సామర్లకోట వైఆర్‌ఎల్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినిపై అదే కళాశాలలోని ఇళ్లపల్లికి చెందిన పితాని నూకరాజు లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన తరచూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇంటర్నల్ మార్క్స్ తన చేతిలోనే ఉంటాయని, చెప్పినట్లు వినకపోతే పరీక్షలో ఫెయిల్ చేస్తానని తరచూ వేధించేవాడు. విద్యార్థిని మొబైల్‌కు అసభ్యకరమైన వీడియోలు పంపిస్తూ ఉండేవాడు. ఆదివారం సాయంత్రం స్టేషన్ సెంటర్‌లోని అమ్మవారి ఆలయానికి రావాలంటూ ఆదేశించాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీను ఈ మేరకు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

హైదరాబాదుకు నౌహీరా

ప్రజాశక్తి-చిత్తూరు నగరం

గొలుసుకట్టు కేసులో రిమాండ్‌లో ఉన్న నౌహీరాను సిబిసిఐడి పోలీసులు సోమవారం చిత్తూరు కోర్టుకు హాజరుపరిచారు. అనంతరం తెలంగాణలో కూడా పలు కేసులు ఆమెపై ఉండటంతో కోర్టు అనుమతితో కూకట్‌పల్లి పోలీసులు సోమవారం హైదరాబాదుకు తరలించారు.

ప్రజ్ఞ

జవాబులు

1.రోమ్
2.దావోస్
3.15
4.గీతా మెహతా
5.రోహిత్ పౌడెల్

ఆశా వర్కర్లపై నిర్బంధం

- శ్రీకాకుళంలో సుమారు 500 మంది అరెస్టు
- సమస్య పరిష్కారానికి డిఎంఅండ్ హెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు సోమవారం చేపట్టిన ధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వం విఫలయత్నం చేసింది. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడే అరెస్టులకు పాల్పడింది. నిర్బంధాన్ని ఎదురొడ్డి వందలాది మంది ఆశా కార్యకర్తలు డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయానికి చేరుకొని ధర్నాలో పాల్గొన్నారు. జిఒ 113 ప్రకారం వేతనం, పారితోషికం చెల్లించాలని, ఎఎన్ఎం కోర్సు పూర్తి చేసిన వారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని తదితర తొమ్మిది డిమాండ్లతో ఆశా వర్కర్లు జిల్లాలోని 38 మండలాల నుంచి జిల్లా కేంద్రానికి బయలుదేరారు.

వీరిని ఎక్కడికక్కడే పోలీసులు అడ్డుకొని సుమారు 500 మందిని అరెస్టు చేసి, ఆయా పోలీస్ స్టేషన్లకు తరలివచ్చారు. అయినప్పటికీ, భయపడకుండా వందలాది ఆశా వర్కర్లు డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నాగమణి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు 2018 జులై 29న విడుదల చేసిన 113 జిఒ ప్రకారం ఆశా వర్కర్లకు వేతనాలు, పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టి.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిఎం అండ్ హెచ్ఒ చెంచయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అరెస్టు చేసిన వారందరినీ పోలీసులు ఆ తర్వాత విడుదల చేశారు.



శ్రీకాకుళంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆర్‌టిసి సమ్మె సన్నాహకాల్లో భాగంగా జెఎసి ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు, ధర్నాలు చేపట్టారు. విజయవాడ మెయిన్ డిపో, ఆటోనగర్, తదితర డిపోల వద్ద నిరాహార దీక్షలు జరిగాయి. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జిలానీ బాషా, కృష్ణా రీజియన్ కార్యదర్శి బిడిఆర్ రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా రీజయన్ కార్యదర్శి వైఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా నరసరావుపేట ఆర్‌టిసి డిపో వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. జెఎసి రాష్ట్ర చైర్మన్ దామోదర్ మాట్లాడుతూ ఆర్‌టిసి రక్షణ, మెరుగైన పని పరిస్థితుల కోసం పోరాడక తప్పదని చెప్పారు. 9 కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమయ్యాయని, ఎన్ఎంయు సైతం మద్దతిస్తోందని చెప్పారు. ఆరో తేదీన చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

విజయనగరంలో కార్మికులు ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. పార్వతీపురం, సాలూరు, ఎస్.కోట డిపోల వద్ద కూడా దీక్షలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లాలో కార్మికులు ఒక్క రోజు నిరహార దీక్ష నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలో రిలే నిరాహార దీక్షలను నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఆర్‌టిసి కార్మికులు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు ప్రారంభించారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) ఆధ్వర్యాన కార్మికులు విశాఖ స్టీల్ సిటీ, మద్దిలపాలెం, పెదవాల్తేరు, విశాఖ డిపోల వద్ద రిలే నిరాహారదీక్ష దీక్షలు చేపట్టారు. అనకాపల్లి ఆర్‌డిఒ డిపో వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు.కర్నూలులోని కొత్తబస్టాండ్‌లో ఉన్న 1,2 డిపోల కార్మికులు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు.

'హోదా' సాధనకు 1న రాష్ట్ర బంద్

ఆచార్య జార్జి విక్టర్ పిలుపు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యాన ఫిబ్రవరి 1న రాష్ట్ర బంద్‌ను అన్ని పార్టీలు, సంఘాలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జార్జి విక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎపికి ప్రత్యేకహోదా కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీని స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, తమ సాధన సమితి చేపట్టిన ఆందోళన కార్యక్రమాలతో యూటర్న్ తీసుకుని, ప్రత్యేక హోదా కావాలని కోరుతున్నారన్నారు. తొలి నుంచి సిపిఎం, సిపిఐ పార్టీలు, తమ సాధన సమితి నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తూ ప్రత్యేక హోదా అంశాన్ని సజీవంగా ఉంచాయని కొనియాడారు.

ముగిసిన 48 గంటల నిరాహార దీక్షలు

5న 'చలో అమరావతి'

ప్రజాశక్తి- సింహాచలం, విశాఖ

పంచగ్రామాల సమస్యపై సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సింహాచలం ప్రధాన కూడలి వద్ద చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షలు సోమవారం ముగిశాయి. దీక్షాపరులకు ద్రావిడ యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్ చలం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచగ్రామాల భూ సమస్యను ప్రభుత్వం తన అధికారాన్ని వినియోగించి ఒక్క జీవోతో పరిష్కరించవచ్చుని, ప్రజా పోరాటాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను ఎన్నికలలోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.రమణి మాట్లాడుతూ 20 ఏళ్లుగా రావణకాష్టంలా కొనసాగుతున్న ఈ పంచగ్రామాల భూ సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని, లేకుంటే పెద్దఎత్తున ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. దీక్ష విరమించిన ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కష్ణంరాజు మాట్లాడుతూ, ఇంతటితో ఉద్యమం ఆగదని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఫిబ్రవరి 5న చలో అమరావతి కార్యక్రమం చేపట్టనున్నామని చెప్పారు. జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ ఆలివర్‌రాయ్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎ.వెంకటరావు, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి కుమార్, రైతు కులీ సంఘం కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



అజశర్మకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ద్రావిడ యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్ చలం



ప్రధాన గేట్‌కు తాళాలు వేసి ఆందోళన చేస్తున్న రైతులు

'తుమ్మపాల' రైతుల ఆందోళన

ప్రజాశక్తి - అనకాపల్లి (విశాఖపట్నం)

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో తరచూ క్రషింగ్ ఆగిపోతుండడంపై రైతులు సోమవారం ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపట్టారు. మూడేళ్ల పాటు మూతపడిన ఈ సుగర్ ఫ్యాక్టరీని ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం ఈ ఏడాది తెరిచి క్రషింగ్ ప్రారంభించింది. పాత యంత్రాలు కావడం, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా గానుగాట ప్రారంభించడంతో తరచూ క్రషింగ్ నిలిచిపోతుంది. ఆదివారం కూడా క్రషింగ్ నిలిచిపోవడంతో ఫ్యాక్టరీకి చెరకు తీసుకొచ్చిన రైతులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. సోమవారం ప్రధాన గేటును మూసివేశారు. ఎమ్‌డి కార్యాలయానికి వెళ్లే గేటుకు అడ్డంగా చెరకు బళ్లు ఉంచి నిరసన తెలిపారు. అసలు ఫ్యాక్టరీలో క్రషింగ్ జరుగుతుందా? లేదా? ఏదో విషయం ఎమ్‌డి వచ్చి ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎమ్‌డి సన్యాసినాయుడు ఫ్యాక్టరీ నిత్యం ఏదో ఒక మరమ్మతుకు గురవుతుందని, ప్రతిరోజూ కొన్ని గంటలు నిలిచిపోతుందని చెప్పారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో ఓవర్ ఆయిలింగ్ చేసి క్రషింగ్ చేస్తామని చెప్పడం రైతులు ఆందోళన విరమించారు.

ప్రజల నిజమైన అభివృద్ధే లక్ష్యం

పాదయాత్రలో వామపక్ష, జనసేన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల అభివృద్ధే లక్ష్యంగా వామపక్ష, జనసేన పార్టీలు కృషి చేస్తున్నాయని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ దిశగా రాజకీయ మార్పు కోరుతూ అనంతపురంలో చేపట్టిన చైతన్యయాత్ర సోమవారం రెండవ రోజుకు చేరుకుంది. 1,2,3,4,5 డివిజన్లలో యాత్ర కొనసాగింది. నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తుండడంతో ప్రజలకు తాయిలాలు ఇచ్చి మభ్యపెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారమే లక్ష్యంగా హామీలు ఇస్తున్నారన్నారు. ఇలాంటి పార్టీలను నమ్మితే మరోసారి మోసపోవాల్సి వస్తుందని తెలిపారు. వామపక్ష కూటమి, జనసేన అధికారంలోకి వస్తే ప్రజా అభివృద్ధి పాలన కొనసాగుతుందని చెప్పారు.

ఈ బడ్జెట్‌లోనే కేటాయించండి

ఖర్చు చేయని సబ్‌ప్లాన్ నిధులపై కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత బడ్జెట్‌లో కేటాయించి ఖర్చు చేయని సబ్‌ప్లాన్ నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ నేతలు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లడుతూ రాష్ట్రంలో దళితులకు కేటాయించిన నిధులు, విడుదల చేసిన నిధులు, ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులు ప్రక్కదారి పట్టాయని, ఇందులో ప్రజాప్రతినిధుల పాత్రతో పాటు అధికారుల పాత్ర ప్రముఖంగా కనిపిస్తోందని, ఇంతటి అన్యాయానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దుర్మార్గమైన దాడులు జరుగుతున్నాయని, వీటి నివారణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. నిందితులను కాపాడుతూ బాధితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళిత సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కెవిపిఎస్ నాయకులు జి నటరాజ్, ఎం శ్రీనివాసరావు, జి క్రాంతి కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేకం

వినూత్న రీతిలో 104 ఉద్యోగుల సమ్మె



చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కర్నూలు ఉద్యోగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరింది. కర్నూలులో చెవిలో పూలు పెట్టుకొని, విజయనగరంలో ఆరోగ్య తనిఖీలు నిర్వహించి వివిధ రకాల్లో నిరసన తెలిపారు. విశాఖలోనూ మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం కొనసాగింది. సమ్మెలో భాగంగా విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగులు ధర్నా చేశారు. చంద్రన్న సంచార చికిత్స ఆంధ్రప్రదేశ్ (104) కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యసారథి, ప్రధాన కార్యదర్శి ఎస్.చిన్న నాగరాజు మాట్లాడారు. జిఒ 151 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయవాడలో సంచార చికిత్స కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో 104 సిబ్బంది కలెక్టరేటు ఎదుట ధర్నా నిర్వహించారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలివెల శ్రీనివాస్ సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగులు ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల బెదిరింపులను నిరసిస్తూ కళ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ అతిథి గహానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి జవహర్‌కు వినతిపత్రం సమర్పించారు. నెల్లూరులో 104 ఉద్యోగుల యూనియన్ నాయకుడు మహ్మద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో జరుగుతోన్న వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మంత్రి నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శిబిరం కొనసాగుతోంది. శిబిరాన్ని సందర్శించిన ఎఎన్ఎం(హైర్డ్, సెకండ్) యూనియన్ల నాయకులు మద్దతు తెలిపారు. 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో 104 చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. ఉద్యోగులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు.

సంక్షిప్తం

ఎస్‌సి, ఎస్‌టిలపై పెరిగిన దాడులు

స్పందించని అధికార, ప్రతిపక్షాలు : హర్షకుమార్

ప్రజాశక్తి -కాకినాడ

ఇటీవల కాలంలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు పెరిగిపోయాయని, వీటిపై అధికార పక్షం, ప్రతిపక్షాలు కూడా స్పందించట్లేదని అమలాపురం మాజీ ఎంపి జివి.హర్షకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కాకినాడలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ఎస్‌సి సెల్ నగర కార్యదర్శిగా ఉన్న సత్య అనే మహిళను బెదిరించి ఆమె ఇంటిని తగులబెట్టారన్నారు. దీనిపై పోలీసులు నేటికీ కేసు నమోదు చేయకపోవడం వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యేల హస్తం ఉందన్నారు. అమలాపురం నడిబొడ్డులో హోంమంత్రి బంధువుల కుక్క వరుణ్ అనే బాలుడిపై దాడి చేసి చంపేస్తే ఇంకా కేసు దర్యాప్తులోనే ఉందని పోలీసులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల పట్ల జిల్లా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోతే అరెస్టు చేస్తామంటూ కలెక్టర్ ప్రకటించారన్నారు, ఇప్పటివరకూ ఎన్ని అరెస్టులు చేశారని ఆయన ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టిలపై జరిగిన దాడులపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట బచ్చుల కామేశ్వరరావు,తాలురి రాజు, కామ రాజు, సత్య తదితరులున్నారు.

రైస్ మిల్లు కార్మికుల అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ.. సిఐటియు ఆధ్వర్యంలో రైస్ మిల్లు కార్మికులు సోమవారం అర్ధనగ్నంగా నిరసన చేపట్టారు. శ్రీ సాయి కమల్ రైస్ మిల్, శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్, శ్రీ సత్య సాయి రైస్ మిల్లుల్లో ప్రమాదానికి గురైన కార్మికులను ఆదుకోవాలని, వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

132 జిఒను రద్దు చేయాల్సిందే

ఐటిడిఎ వద్ద ఉపాధ్యాయుల మహాధర్నా

ప్రజాశక్తి- సీతంపేట

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ వద్ద గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన సీతంపేట హైస్కూల్ నుంచి ఐటిడిఎ వరకూ ర్యాలీ వచ్చి ఈ కార్యక్రమం చేపట్టారు. జిఒ 132ని రద్దు చేయాలని, జిఒ 40ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఎ ముఖద్వారం వద్ద మహాధర్నా చేపట్టారు. 500 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, 20 మండలాల్లోని ఆశ్రమ పాఠశాలలకు సూపర్‌వైజర్ (ఎంఇఒ)లను నియమించాలని, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ జిపిఎస్ పాఠశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు ఎమ్మెల్యే వి.కళావతి సంఘీభావం తెలిపారు. పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. అనంతరం ఐటిడిఎ పిఒ ఎల్. శివశంకర్‌కు వినతిపత్రం అందించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆరిక భాస్కరరావు, పిఆర్‌టియు నాయకులు పప్పల రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి చేరిన 'జనఘోష' రైలు యాత్ర

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన 'జన ఘోష' రైలు యాత్ర సోమవారం ఢిల్లీకి చేరింది. చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్ర ఆదివారం విశాఖపట్నం రైల్వే స్టేషన్లో ప్రారంభమైంది. విశాఖపట్నం-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో వైజాగ్‌లో మొదలై రాజమండ్రి, విజయవాడ, వరంగల్, నాగపూర్, భోపాల్, ఆగ్రా మీదుగా ఢిల్లీకి చేరింది. మంగళ, బుధ, గురువారాల్లో ఢిల్లీలోని స్థానిక జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు కొణతాల తెలిపారు.

దేశాన్ని వదిలి వెళతాం...

అస్సాం ప్రజలకు తగిన గౌరవం ఇవ్వకపోతే, జాతీయ పౌరసత్వ సవరణ బిల్లును ఆమోదిస్తే భారతదేశంలో ఉండకుండా పోవటానికి తగిన ధైర్యం తమకుందని ఆదివారం జరిగిన ప్రదర్శన సందర్భంగా క్రిషక్ ముక్తి సంగ్రామ సమితి నాయకుడు అఖిల్ గొగోయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



హిమాచల్‌లో తీవ్రంగా మంచు

వృద్ధుడిని భుజాలపై ఆస్పత్రికి తరలింపు

హిమాచల్‌ప్రదేశ్ : రాష్ట్రంలో తీవ్రమైన మంచు పడటంతో జనజీవనం స్తంభించింది. రోడ్డు మార్గాలన్నీ మంచుతో కప్పుకుపోయాయి. వాహనాలు వెళ్లేందుకు కనీసం దారి లేకుండా పోయింది. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న మండి ప్రాంతానికి చెందిన ఒక 70 ఏళ్ల వృద్ధుడిని ఆదివారం మనుషులు తమ భుజాలపై 9 కిలోమీటర్లు మోసుకొని ఆస్పత్రికి తీసుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మనాలి ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 5 డిగ్రీలు, కుఫ్రి ప్రాంతంలో మైనస్ 4.2 డిగ్రీలుగా నమోదైంది. గత మూడు రోజులుగా కురుస్తున్న మంచు ప్రభావంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 500 రోడ్లను అధికారులు మూసేశారు. రోడ్లపై పేరుకుపోయిన మంచును తొలగించేందుకు 2 వేల మంది కార్మికులతో పాటు 300 పైగా యంత్రాలు కృషి చేస్తున్నాయి. బుధవారం నుంచి రాష్ట్రంలో మరింత భారీ స్థాయిలో మంచు, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

బాధితులకు పరిహారం పెంపుపై విచారణకు సుప్రీం అంగీకారం

ఏప్రిల్‌లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసు విచారణ

న్యూఢిల్లీ : 1984 నాటి భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో బాధితులకు యూనియన్ కార్బైడ్, దాని అనుబంధ సంస్థలు రూ. 7,844 కోట్లను అదనపు నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై విచారణ చేపట్టనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. గతంలో ఒప్పందం కుదుర్చుకున్న నష్టపరిహారం కంటే బాధితులకు అదనంగా చెల్లించాలని యూనియన్ కార్బైడ్, ఇతర సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని కేంద్రం కోరింది. 1984, డిసెంబర్ 2, 3 తేదీల్లో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్(యుసిఐఎల్) సంస్థలో మిథైల్ ఐసోసైనేట్(ఎంఐసి) లీక్ కావడంతో సుమారు 3వేల మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తాం : జెడియు

గువహటి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లు-2016కు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని జెడియు పార్టీ కార్యదర్శి కెసి త్యాగి తెలిపారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలోని బృందం సోమవారం ఎజిపి నేతలతో గువహటిలో సమావేశమయింది. బీహార్‌లో జెడియు, బిజెపి మిత్రపక్షాలుగా ఉన్నాయి. అయితే పౌరసత్వ సవరణ బిల్లుపై వచ్చిన విభేదాలతో అస్సాంలో ఇటీవలి వరకూ మిత్రపక్షాలుగా ఉన్న ఎజిపి, బిజెపిల మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. సమావేశం అనంతరం త్యాగి మాట్లాడుతూ రాజ్యసభలో బిల్లును వ్యతిరేకిస్తామన్నారు.

లాలూ, కుటుంబసభ్యులకు బెయిల్ మంజూరు



న్యూఢిల్లీ : రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) కేసులో రాష్ట్రీయ జనతాదళ్ నేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు రబ్రీదేవి, వారి కుమారుడు తేజస్వి యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరికి లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై ముగ్గురికి తాత్కాలిక ఊరటను కల్పించింది. ఈ నెల 19న ఈ కేసు విచారణ సమయంలో ముగ్గురికీ తాత్కాలిక బెయిల్‌ను పొడిగించిన సంగతి తెలిసిందే. ఐఆర్‌సిటిసికి చెందిన రెండు హోటళ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించడంలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైంది.

రాహుల్ గాంధీ ర్యాలీలో మేం కూడా.. : ఆర్‌జేడి

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఫిబ్రవరి 3న పాట్నాలో నిర్వహించే ర్యాలీలో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడి) కూడా భాగస్వామం అవుతుందని ఆ పార్టీ నాయకుడు తేజస్వి యాదవ్ తెలిపారు. 'మేం ఆహ్వానం అందుకున్నాం.. ర్యాలీలో పాల్గొంటాం' అని ఆయన తెలిపారు. 2006 ఐఆర్‌సిటిసి హోటల్స్ కేసు విచారణలో భాగంగా పాటియాల హౌస్ కోర్టుకు వచ్చిన తేజస్వి యాదవ్ విలేకరులతో మాట్లాడారు. 'న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, ఈ కేసు రాజకీయ ప్రతీకారంతో పెట్టినదని' ఆయన తెలిపారు.

ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో చిదంబరం, కార్తీలకు మరోసారి ఊరట

న్యూఢిల్లీ : ఎయిర్‌టెల్-మాక్సిక్ కేసులో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం, ఆయన కుమారుడు కార్తీకి సోమవారం మరోసారి ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. వారిద్దరికీ వచ్చే నెల 18 వరకు అరెస్టుల నుండి తాత్కాలిక రక్షణను పొడిగించింది. చిదంబరం ఫిబ్రవరి 1 వరకు అందుబాటులో ఉండరని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపిన నేపథ్యంలో సిబిఐ ప్రత్యేక జడ్జి ఒపి సైనీ తాత్కాలిక రక్షణను పొడిగించారు. కాగా, ఇదే కేసులో కార్తీని విచారించేందుకు తేదీని నిర్ణయించాలని సుప్రీంకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని ఆదేశించింది. ఇడికి సహకరించనట్లయితే విదేశాలకు అనుమతినిచ్చేది లేదని కార్తీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు స్పష్టం చేసింది. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎఫ్ఐపిబి) నుండి ఐఎన్ఎక్స్ మీడియాకు 305 కోట్ల విదేశీ నిధులకు క్లియరెన్స్ ఇప్పించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు నమోదైంది.

యువ మహిళల్లో నిరుద్యోగులు 16.3 శాతం

న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరుకున్నట్టు పలు సర్వేల్లో వెల్లడైన సంగతి తెలిసిందే. నిరుద్యోగుల్లోనూ మహిళల సంఖ్య అత్యధికంగా ఉన్నట్టు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ విస్తృతస్థాయిలో నిర్వహించిన సర్వే నివేదిక(స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2018) వెల్లడించింది. 15-25 ఏండ్ల వయసువారిలో నిరుద్యోగ మహిళలు 16.3 శాతం ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. పురుషులతో పోలిస్తే ఇది అత్యధికమన్నది గమనార్హం. విద్యావంతుల్లోనూ ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. గ్రాడ్యుయేట్ మహిళల్లో నిరుద్యోగులు 30.6 శాతం కాగా, పురుషుల్లో 9.9 శాతం. పీజీ పూర్తి చేసిన వారిలో నిరుద్యోగ మహిళలు 23.8 శాతం కాగా, పురుషులు 8.4 శాతం.

సామాజికవర్గాల్లో చూస్తే విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య ఎస్సీ,ఎస్టీ,ఓబీసీల్లోనే అధికంగా ఉండటం గమనార్హం. ఈ వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించినా నిరుద్యోగుల్లో వీరే అధికంగా ఉండటానికి కారణం ప్రయివేట్ రంగంలోనే అధిక ఉద్యోగాలుండటమని అర్థమవుతోంది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ రంగాన్ని నీరుగార్చి ప్రయివేట్ రంగాన్ని ప్రోత్సహించాయి. తత్ఫలితంగా అణచివేతకు గురైన కులాల్లో నిరుద్యోగుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

గ్రాడ్యుయేట్లలో చూస్తే అగ్రకులాలవారిలో నిరుద్యోగుల సంఖ్య 10.5 శాతం కాగా, ఎస్సీలలో 18.7 శాతం, ఎస్టీల్లో 14.7 శాతం, ఓబీసీల్లో 15.7 శాతంగా నమోదైంది. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు అమలవుతున్నా ఎస్సీ,ఎస్టీ,ఓబీసీల్లో నిరుద్యోగులు అధికంగా ఉన్నారంటే వారిపై సామాజిక, సాంస్కృతిక వివక్ష కనిపించని కుట్రగా కొనసాగుతున్నట్టు స్పష్టమవుతోంది.

ఇక మహిళల్లోనూ ఆ వర్గాల్లో నిరుద్యోగులు అధికంగా ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారిలో నిరుద్యోగులు ఎస్సీల్లో 34.3 శాతం, ఎస్టీల్లో 29 శాతం, ఓబీసీల్లో 32.4 శాతం ఉండగా, ఉన్నత కులాల్లో 24.3 శాతంగా ఉన్నారు. గ్రాడ్యుయేట్లలో మహిళలతోపాటు పురుషుల సగటు 13.5 శాతం. అంటే.. మహిళల్లో మొత్తమ్మీద నిరుద్యోగులు అధికమని తేలింది.

ఈ నివేదిక ద్వారా తెలిసేదేమంటే దళిత, గిరిజన, వెనకబడిన కులాల విద్యావంతుల విషయంలో ఉద్యోగాల కల్పనలో వివక్ష తీవ్రస్థాయిలో కొనసాగుతున్నదని. లింగ వివక్ష అంతకన్నా తీవ్రంగానే ఉన్నట్టు స్పష్టం చేస్తోంది.

కొత్త పొత్తుల కోసం బిజెపి వెంపర్లాట

విజయావకాశాలు సన్నగిల్లుతున్నందునే

న్యూఢిల్లీ: కాషాయ దళానికి ఓటమి భయం పట్టుకుందా? సర్వేలు వెల్లడిస్తున్న వివరాలు బిజెపి నాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయా? అంటే అవుననే విశ్లేషకులు చెబుతున్నారు. రోజు రోజుకు మోడీ చరిష్మా తగ్గిపోతుండటం నాయకులను కలవర పెడుతున్నాయని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో మరో నేతను రంగంలోకి దించాలని పార్టీలో అంతర్గతంగా మొదలైనట్టు తెలుస్తున్నాయి. ఇటీవల బిజెపి నేత నితిన్ గడ్కరిని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురానున్నారని వార్తలు వెలుపడటం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశ ముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో మిత్రపక్షాలుగా ఉన్న తెలుగుదేశం (టిడిపి), పీపుల్స్ డెమోక్రటిక్ (పిడిపి) మరి కొన్ని పార్టీలు బిజెపికి దూరమయ్యాయి. మిత్రులు ఒక్కొక్కరుగా దూరమవు తుండటం, శివసేన వంటి పార్టీలు నేరుగా విమర్శలు చేస్తుండటంతో పార్టీని కలవర పెడుతున్నాయి. రాఫెల్, పెద్దనోట్ల రద్దు వంటి అంశాలతో పార్టీ ప్రతిష్ఠ మసక బారిందని కొందరు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా యూపీలో సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్‌వాద్ పార్టీలు కూటమి కట్టడంతో అక్కడ విజయావకాశాలకు గండిపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా ఇటీవల తాజాగా ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం, ఆమెను యూపీ ప్రాంత వ్యవహారాలు అప్పగించడం వారికి గుబులు పుట్టిస్తోంది. ప్రధాన మిత్ర పక్షాలైన అప్నాదళ్, ఎస్‌బిఎస్‌పి అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రతికూలతలు పెరిగే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో యుపిలో నిలదొక్కుకోవాలంటే మిత్రులను ప్రసన్నం చేసుకోవడం ఒక్కటే మార్గంగా వారికి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నష్టనివారణ చర్యలు చేపట్టాలని కాషాయ పార్టీ యోచిస్తోంది. దీంతో వారికి యుపిలో ఉన్న ఓటు బ్యాంకు దృష్ట్యా వారి డిమాండ్లను సమ్మతించాలని పార్టీ భావిస్తోంది. కాగా గతంలో యూపీ ఎన్నికల్లో బీఎస్‌పీకి చెందిన నాయకులైన బ్రిజేష్ పాఠక్, ఎస్‌పీ మౌర్య వంటి నాయకులు బిజెపి నుంచి పోటీ చేశారు. ఈ సారీ ప్రత్యర్థి పార్టీల నాయకులకు గాలం వేయాలని బిజెపి చూస్తోంది. ఆ దిశగా కార్యాచరణను చేస్తోంది. కాగా తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కొత్త పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నాయి. అవసరమైతే సీట్ల సర్దుబాటులో కొంత మెత్తగా వ్యవహరించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ రాష్ట్రంలో అన్నాడీఎంకే పార్టీతో టచ్‌లో ఉన్నట్టు కొందరు నాయకులు చెబుతున్నారు.

చైనా కాన్సులర్ జనరల్‌గా సిపిసి మాజీ సభ్యులు ఝూలియూ

ప్రజాశక్తి ప్రతినిధి, కోల్‌కతా :

"భారత్-చైనా సంబంధాలు బంగారు భవిష్యత్‌కు బాటలు వేయనున్నాయి. 2018లో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్ మధ్య జరిగిన 4వ ఉన్నత స్థాయి సమావేశమే ఇందుకు చక్కటి సాక్ష్యం" అని ఝూ లియూ అన్నారు. కోల్‌కతాలో చైనా కాన్సులర్ జనరల్‌గా ఝూ లియూ కొత్తగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోల్‌కతాలోని ఒక హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు ఈ పదవిలో కొనసాగిన మా ఝున్యూ పదవీకాలం 2018 నవంబరుతో ముగిసింది. ఝున్యూ స్థానంలో లియూ నియమితులయ్యారు. ఝూ లియూ చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) సభ్యుడిగా విస్తృత సేవలు అందించారు. ఎంతో అనుభవాన్ని గడించారు. ఆయన నియామకంతో భారత్-చైనా సంబంధాల కాన్సులర్ వ్యవహారాలు బలోపేతమవుతాయని పలువురు విదేశీ వ్యవహారాల నిపుణులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కోల్‌కతాలో కాన్సులర్ జనరల్‌గా నియమితులయ్యేందుకు ముందు ఆయన శాన్ ఫ్రాన్సిస్కో, అమెరికా కాన్సులేట్ జనరల్‌లో పిఆర్‌సి డిప్యూటి కాన్సులర్ జనరల్‌గా వ్యవహరించారు. అంతేకాక చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) సెంట్రల్ కమిటీ నిర్వహణలోని జనరల్ ఆఫీస్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. 1998 నుండి 2008 వరకు పదేళ్ళపాటు ఆయన ఈ పదవిలో కొనసాగారు. పశ్చిమ బెంగాల్ మంత్రి సాధన్ పాండే, ఎంపి సుఖేందు శేఖర్ రాయ్, కోల్‌కతా యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సురంజన్ దాస్, సినీ దర్శకుడు అశోక్ విశ్వనాథన్, మధుబంటి మైత్ర, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత ఘర్షణ కేసులో బిజెపి కార్పొరేటర్‌పై కేసు

రాజ్‌ఘర్ (మధ్యప్రదేశ్) : భారత గణతంత్ర దినోత్సవం రోజున మధ్యప్రదేశ్‌లోని ఖుజ్నెర్ పట్టణంలో జరిగిన మత ఘర్షణ కేసులో బిజెపి కార్పొరేటర్‌తో సహా 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా వేరువేరు మతాలకు చెందిన రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఖుజ్నెర్ పట్టణంలో సెక్షన్ 144ను అమల్లోకి తెచ్చారు. మరిన్ని ఘర్షణలు జరగకుండా పట్టణంలో భద్రత సిబ్బందిని మోహరించామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘర్షణపై రెండు వర్గాలు వేరువేరుగా ఫిర్యాదు చేయడంతో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిట్లు పోలీసులు తెలిపారు. ఇరు వర్గాలకు చెందిన మొత్తం 15 మందిపై కేసు నమోదు చేశారు.

కేజ్రీవాల్‌పై బిజెపి ఎమ్మెల్యే ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ప్రజలకు ఫోన్ కాల్స్ చేస్తూ ఆప్ అధినేత కేజ్రీవాల్ వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని బిజెపి ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రేటర్ ఢిల్లీ పరిధిలోని రాజౌరి నియోజకవర్గంలో ఓట్లను బిజెపి తొలగించిందని ఆప్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇద్దరికి ఇటువంటి కాల్స్ వచ్చాయని ఆయన తన ఫిర్యాదులో తెలిపారు. దీనిపై ఆప్ అధికార ప్రతినిధి సౌరబ్ భరద్వాజ్ స్పందిస్తూ ఓటు వివరాలపై ప్రజలకు సమాచారం ఇవ్వడం నేరం కాదన్నారు. బిజెపియే ఢిల్లీలోని, ముస్లిములు, బనియా, పూర్వాంచలి వర్గాలకు చెందినవారి ఓట్లను తొలగిస్తోందని ఆరోపించారు.

రుణమాఫీ పథకం ఉన్నా..430 మంది రైతుల ఆత్మహత్యలు

పంజాబ్‌లో దుస్థితిని వెల్లడించిన భారతీయ కిసాన్ యూనియన్

న్యూఢిల్లీ : పంజాబ్‌లో గత ఏడాది జనవరి నుండి రైతు రుణ మాఫీ పథకాన్ని అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ అన్నదాతలు రుణాల భారంలోనే కూరుకుపోతున్నారు. రుణ మాఫీ అమల్లోకి వచ్చి ఏడాది కాలంలోనే లక్ష- లక్ష ఇరవై వేల రూపాయల మధ్య రుణభారంతో బాధపడుతున్న సుమారు 430 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెవెన్యూ విభాగం, పోలీసుల రికార్డులు, మీడియా నివేదికలు నుండి తీసుకున్న సమాచారాన్ని భారతీయ కిసాన్ యూనియన్ (ఉగ్రహన్) రైతు సంఘం సేకరించింది. మన్సా, బతిందా, బర్నాలా, మాల్వా ప్రాంతాల్లోని రైతులు ఎక్కువగా ఆత్మహత్య చేసుకుంటున్నారని వెల్లడైంది. 2017 మార్చి నాటికి ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య 900 ఉందని బికెయు తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ అమలు పరచినప్పటికీ.. 50 శాతం కన్నా తక్కువ మంది రైతలకు మాత్రమే ఈ పరిహారం లభించిందని బికెయు నేత సుఖ్‌పాల్ సింగ్ మనక్ తెలిపారు. ఈ రైతు రుణమాఫీ పథకం మూడవ దశను అమలు చేయనున్నట్లు తాజాగా ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ ప్రకటించారు.



సీనియర్ జర్నలిస్టు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సీనియర్ జర్నలిస్టు, కవి ఎ. కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మా సచ్ దేవ్ రాసిన ఎ హ్యాండ్‌ఫుల్ ఆఫ్ సన్ అండ్ ఆధర్ పోయిమ్స్ కవితల్ని తెలుగులో గుప్పెడు సూర్యుడు, మరికొన్ని కవితలు పేరిట అనువదించినందుకు తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ఈ మేరకు సోమవారం నాడిక్కడ రబీంద్ర భవన్‌లో సాహిత్య అకాడమీ అధ్యక్షులు చంద్రశేఖర్ కంభర్ నేతృత్వంలో అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 24 భాషలకు చెందిన అనువాద పుస్తకాలను సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం-2018నకు ఎంపిక చేసినట్లు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఆ పుస్తకాలను ప్రతి భాషకు ముగ్గురు సభ్యులతో కూడిన ఎంపికల కమిటీలు నియమ, నిబంధనలకు లోబడి చేసిన ప్రతిపాదనల మేరకు ఎంపిక చేసినట్లు చెప్పారు. 2012 జనవరి 1 నుంచి 2016 డిసెంబర్ 31 మధ్య వెలువడిన అనువాద పుస్తకాలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ఈ ఏడాదిలోనే ప్రత్యేక సభ ఏర్పాటు చేసి అందజేస్తామని, రూ.50వేల నగదు బహుమతితో పాటు, రాగి షీల్డ్‌తో సత్కరిస్తామని తెలిపారు. 24 భాషల్లో ప్రకటించిన ఈ పురస్కారం, తెలుగులో సీనియర్ జర్నలిస్టు, కవి ఎ.కృష్ణారావును వరించింది. తెలుగులో జ్యూరీ సభ్యులుగా ప్రొఫెసర్ షేక్ మస్తాన్, ఓల్గా, వై. లక్ష్మీ ప్రసాద్‌లు వ్యవహరించారు. భారతీయ స్త్రీ ఎదుర్కొనే సామాజిక అన్యాయం, సుఖ దుఃఖాలతో పాటు దేశ విభజన సమయంలో తన తండ్రిని పోగొట్టుకున్న కవయిత్రి మానసిక వేదన ఈ కవితల్లో వ్యక్తీక ^రించారు. వీటిని కృష్ణారావు తెలుగులో అనువదించారు. కృష్ణారావుకు సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటిం చడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు.

అధికారులను వారి సొంత జిల్లాల్లో నియమించొద్దు

- ఒకే చోట మూడేళ్లు పనిచేస్తే బదిలీ చేయండి
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(సిఈసి) రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సొంత జిల్లాల్లో అధికారులను నియమించొద్దని ఆదేశించింది. సోమవారం ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల సంఘం ప్రధాన అధికారులకు, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో స్పష్టమైన సూచనలు చేసింది. అధికారులకు సొంత జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వరాదని, గత నాలుగేళ్లలో వరుసగా మూడేళ్ల పాటు పనిచేసిన జిల్లాల్లో ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించరాదని పేర్కొంది. 2019 మార్చి 31 నాటికి ఒకే జిల్లాలో మూడేళ్లపాటు కొనసాగిన ఉద్యోగులకు అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వరాదని స్పష్టం చేసింది. 2017 మే 31కి ముందు సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన డిఈఓ, ఆర్వో, ఏఆర్వో, పోలీస్ ఇన్స్పెక్టర్స్, ఎస్సైలకు తిరిగి అదే జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వరాదని సూచించింది. ఈ నిబంధనలు కేవలం ప్రత్యేక ఎన్నికల విధులకు నియమించిన అధికారులకే కాదని, డిఈఓలు, డిప్యూటీ డిఈఓలు, ఆర్వో, ఎమ్మార్వోలు, నోడల్ అధికారులతో వివిధ స్థాయిల్లోని అధికారులకూ వర్తిస్తాయని పేర్కొంది. పోలీస్ శాఖలోని రేంజ్ ఐజిలు, డిఐజిలు, రాష్ట్ర ఆర్మ్‌డ్ పోలీస్ కమాండెంట్‌ల నుండి ఆర్ఐ స్థాయి అధికారుల వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. పోలీస్ శాఖలోని కంప్యూటరైజేషన్, స్పెషల్ బ్రాంచ్, ట్రైనింగ్ విభాగాలకు ఈ నిబంధనలు వర్తించవని తెలిపింది.



గోవా టేపుల్లో 'రాఫెల్ రహస్యాలు'.. చర్యలకు రాహుల్ డిమాండ్

న్యూఢిల్లీ : వివాదాస్పద రాఫెల్ ఒప్పందానికి సంబంధించి గోవా ఆడియో టేపులు విడుదలై 30 రోజులు అయినప్పటికీ దానిపై ఎటువంటి చర్య తీసుకోలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఈ టేపుల్లో వెల్లడించిన అంశాల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం గాని, విచారణ గాని జరగలేదన్నారు. గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ వద్ద ఉన్న ఆ టేపులు వాస్తవమైనవేనని, వాటిని విశ్లేషిస్తే పలు రహస్యాలు బయటపడతాయని రాహుల్ అన్నారు. ఆ టేపుల కారణంగానే ప్రధాని మోడీపై పారికర్ ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

ముజఫర్‌నగర్ అల్లర్ల కేసు... కేసులు ఉపసంహరించుకోవాలని యూపీ సర్కారు ఆదేశాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్‌లో గతంలో చోటుచేసుకున్న మత ఘర్షణలకు సంబంధించి పలువురు రాజకీయ నాయకులపై నమోదైన 18 కేసులను ఉపసంహరించుకోవాలని జిల్లా అధికారులకు యూపీ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. 2013లో జరిగిన ఈ ఘర్షణలలో దాదాపు 60 మంది పౌరులు చనిపోగా, ఘటనకు సంబంధముందన్న ఆరోపణలతో 89 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా, రెండు వర్గాల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణలకు కారణమైన వారిని రక్షించడానికి యూపీ సర్కారు ప్రయత్నిస్తున్నది. ఈ కేసులో 18 మందిపై నమోదైన కేసులను ఉపసంహరించాలని బీజేపీ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ముజఫర్‌పూర్ జిల్లా మెజిస్ట్రేట్ రాజీవ్ శర్మ మాట్లాడుతూ.. కేసుల ఉపసంహరణకు సంబంధించి మూడు రోజుల క్రితం తనకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ కేసులో నిందితులుగా రాజకీయ నాయకులెవ్వరూ లేరని తెలిపారు. కానీ, బీజేపీ ఎంపీ (ముజఫర్‌పూర్) సంజీవ్ బల్యాన్, శాసనసభ్యుడు సంగీత్ సోమ్‌లకు ఈ కేసుతో సంబంధమున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు 'షాక్'

టిఎంసిలో చేరిన మాల్దా ఎంపి మౌసమ్

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర మాల్దా నుండి రెండు సార్లు కాంగ్రెస్ ఎంపిగా గెలిచిన మౌసమ్ బెనజీర్ నూర్ సోమవారం తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆమె రైల్వే మాజీ మంత్రి, దివంగత నేత ఎబిఎ ఘనీ ఖాన్ చౌదరి మేనకోడలు కూడా. టిఎంసి ఎంపి, మాల్దా ఇన్‌చార్జి సుభేందు అధికారితో..రాష్ట్ర సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీని ఆమె కలిశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కూడా మౌసమ్ ఉత్తర మాల్దా నుండి తమ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తారని, ఉత్తర బెంగాల్‌లో అన్ని జిల్లాలో ప్రచారాలు చేపట్టనున్నారని మమతా బెనర్జీ మీడియాకు తెలిపారు. మంగళవారం ఉత్తర బెంగాల్‌లో నిర్వహించనున్న బహిరంగ సమావేశంలో మమతా బెనర్జీ సమక్షంలో అధికారికంగా పార్టీలో చేరతారని సుభేందు తెలిపారు.

టిఎంసి నేతకు చెందిన రూ. 239 కోట్ల ఆస్తి జప్తు

పోంజి స్కామ్ కేసు



న్యూఢిల్లీ : పోంజి స్కామ్ కేసులో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), ఎంపి కేడి సింగ్ సంస్థకు చెందిన రూ 239 కోట్ల ఆస్థులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) జప్తు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) చట్టం కింద ఈ ఆస్థులను ఎటాచ్డ్ చేసినట్లు ఈడి ఒక ప్రకటనలో తెలిపింది. కెడి సింగ్ సంస్థ ఆల్‌కెమిస్ట్ ఇన్ఫ్రా రియాల్టీ లిమిటెడ్‌కు చెందిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఖాతాలతో పాటు చండీఘర్, పంచ్‌కుల, దెరబాస్సి, ఎస్ఎఎస్ నగర్ (పంజాబ్), సిమ్లాల్లో ఉన్న ఆస్థులను జప్తు చేసినట్లు ఈడి తెలిపింది. టిఎంసి తరుపున రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కేడీ సింగ్‌కు ఈ కేసు విషయంలో గత ఏడాదిలో ఈడి సమన్లు కూడా జారీ చేసింది. సింగ్ తన రాజ్యసభ్య ప్రొఫైల్‌లో ఈ సంస్థకు చైర్మన్‌గానూ, వ్యవస్థాపకుడు గానూ పేర్కొన్నారు. ఈ కేసు విషయంలో సింగ్, అతని సంస్థపై క్రిమినల్ నేరంతో 2016, సెప్టెంబరులోనే ఛార్జ్‌షీట్ నమోదు చేసింది. ఆల్‌కెమిస్ట్ ఇన్ఫ్రా రియాల్టీ లిమిటెడ్ సంస్థ కోసం వివిధ పెట్టుబడీదారుల నుంచి సేకరించిన నిధులను ఆ సంస్థ కోసం వినియోగించకుండా వేరువేరు బ్యాంక్ ఖాతాలకు తరలించినట్లు ఆధారాలు ఉన్నాయని ఈడి తన ప్రకటనలో తెలిపింది.

పశ్చిమ బెంగాల్‌లో 2015లో సుమారు రూ. 1,916 కోట్ల విలువైన పోంజి స్కామ్ వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చిట్ ఫండ్ పథకాల పేరుతో ప్రజల నుంచి భారీ మొత్తాలను సేకరించారు. ఆల్‌కెమిస్ట్ ఇన్ఫ్రా రియాల్టీ లిమిటెడ్ కూడా సెబీ అనుమతి లేకుండానే ప్రజల నుంచి నగదును వసూలు చేసిందని ఈడి ఆరోపించింది.

చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు పెంపు

జపాన్ ప్రధాని అబె

టోక్యో : చైనాతో ఇప్పటికే మెరుగుపడిన సంబంధాలను మరింత అభివృద్ధిపరుచుకుంటామని జపాన్ ప్రధాని షింజో అబె చెప్పారు. రక్షణ సామర్థ్యాలను మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. సోమవారం జపాన్ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా అబె ప్రసంగించారు. గత అక్టోబరులో తాను బీజింగ్‌లో పర్యటించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయని చెప్పారు. వాణిజ్యం, ఇతర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచాలని భావిస్తున్నట్లు చెప్పారు. రోదసీ, సైబర్ సాంకేతికతలను కూడా జపాన్ పెంచుకోవాల్సి వుందన్నారు.

నిరసన

ఎల్లో వెస్ట్ నిరసకారులపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ ఆదివారం పారిస్‌లో వేలాదిమంది రెడ్ స్కార్ఫ్‌లతో ప్రదర్శన నిర్వహించిన దృశ్యం.



ఎల్లో వెస్ట్ ఆందోళనలో ప్రభుత్వ హింసను ఖండిస్తూ పారిస్‌లో ప్రదర్శన

పారిస్ : గత కొద్ది వారాలుగా ఫ్రాన్స్‌ను కుదిపివేస్తున్న 'ఎల్లో వెస్ట్' ఉద్యమంపై చోటు చేసుకుంటున్న హింసాకాండను ఖండిస్తూ ఆదివారం పారిస్‌లో వేలాదిమంది రెడ్ స్కార్ఫ్‌లతో ప్రదర్శన నిర్వహించారు. ఎల్లో వెస్ట్ ఆందోళనకారులకు మద్దతుగా జరిగిన ఈ ప్రదర్శనలో దాదాపు 10వేల మంది పాల్గొన్నారు. వరుసగా 11 శనివారాలు జరిగిన నిరసనల్లో ప్రదర్శకారులతో పోలీసులు ఘర్షణ పడ్డ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్నవారు తలకు ఎర్రని గుడ్డ కట్టుకుని ప్రభుత్వాన్ని ఉద్దేశించి 'హింసను ఆపండి' అంటూ నినాదాలు చేశారు. ప్రశాంతంగా సాగిన ఈ ప్రదర్శన తూర్పు పారిస్‌లోని బాస్టిల్లా స్క్వేర్ వద్ద ముగిసింది. కాగా శనివారం జరిగిన ఎల్లో వెస్ట్ ప్రదర్శనలో దాదాపు 70వేల మంది పాల్గొన్నారు. ఆ ప్రదర్శన కూడా బాస్టిల్లా స్క్వేర్ వద్దనే ముగిసింది. అక్కడ ఆందోళనకారులతో పోలీసులు ఘర్షణ పడడంతో మానవ హక్కుల కార్యకర్త ఒకరి కంటికి గాయం అయింది. దాంతో పోలీసులు బల ప్రయోగానికి దిగటంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఆ నేపథ్యంలో ప్రభుత్వ బలప్రయోగాన్ని ఖండిస్తూ, ఎల్లోవెస్ట్ ఆందోళనకారులకు మద్దతు తెలుపుతూ ఆదివారం నాటి ప్రదర్శన జరిగింది.

ఇరాన్‌పై ఆంక్షలు ఉల్లంఘిస్తే తీవ్ర పర్యవసానాలు

ఇయుకు ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్ : ఇరాన్‌పై అమెరికా ఆంక్షలను ఉల్లంఘిస్తే తీవ్ర పర్యవసానాలు వుంటాయని యురోపియన్ యూనియన్ దేశాలపై ట్రంప్ ప్రభుత్వం బెదిరింపులకు దిగింది. .కాగా ఆంక్షలు ఉల్లంఘించకుండా ఇరాన్‌తో వ్యాపారం సాగించడాన్ని సులభతరం చేసేందుకు గానూ ప్రత్యామ్నాయ డబ్బు చెల్లింపు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని యురోపియన్ యూనియన్ భావిస్తోంది. ఇయు చేసే ఈ ప్రయత్నాలను ట్రంప్ సర్కార్ నిశితంగా గమనిస్తోంది. ఇయు ప్రతినిధి మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయని, త్వరలోనే ఇందుకు సంబంధించి ప్రకటన వెలువడే అవకాశం వుందని అన్నారు.

కాక్‌పిట్‌లో పొగతాగడం వల్లే నేపాల్ విమాన ప్రమాదం

న్యూఢిల్లీ : గత ఏడాది మార్చిలో ఖాట్మండులోని త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన విమానా ప్రమాదానికి పైలెట్ తప్పిదమే కారణమని తమ దర్యాప్తులో తేలినట్లు నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. కాక్‌పిట్‌లో ఉన్న పైలెట్ సిగరెట్ తాగడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలపింది. సిగరెట్ పొగవల్ల పైలెట్ వ్యక్తిగతంగా ఒత్తిడికి లోనై ఆందోళన చెందడంతో ప్రమాదం సంభవించిందని తమ దర్యాప్తులో తేలినట్లు నేపాల్ ప్రభుత్వం వెల్లడించింది. త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వద్ద అమెరికా-బంగ్లా విమానానికి జరిగిన ప్రమాదంలో 51 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

ఫిబ్రవరి 10నుండి

వెనిజులా సైనిక విన్యాసాలు

- కుట్రలను ఎదుర్కోవాలి
- దేశ రక్షణకు సన్నద్ధం కావాలని మదురో పిలుపు



కారకస్ : ఎలాంటి పరిస్థితులు ఎదురైనా దేశ రక్షణకు సన్నద్ధం కావాల్సిందిగా వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో సైన్యానికి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 10 నుండి 15వరకు పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైతే సైనిక జోక్యం తప్పదని అమెరికా వ్యాఖ్యానించిన నేపథ్యంలో మదురో ఈ పిలుపునివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. సైనిక విన్యాసాలు నిర్వహించడానికి ముందుగా మదురో పలు సైనిక స్థావరాలను సందర్శిస్తున్నారు. తనకు సైన్యం సంపూర్ణ మద్దతు వుందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. విదేశీ జోక్యం నుండి దేశాన్ని రక్షించేందుకు సైన్యం సన్నద్ధంగా వుందని పునరుద్ఘాటించారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అతి ముఖ్యమైన సైనిక విన్యాసాలకు సమాయత్తమవుతున్నామని ఆయన ఆదివారం ప్రకటించారు. అందుకు జరుగుతున్న సన్నాహాలను సమీక్షించారు. సైనిక స్థావరాల సందర్శనకు సంబంధించిన వీడియోలను ఆయన తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించేందుకే సైన్యం కట్టుబడి వుందని రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో ప్రకటించారు. దీంతో తనకు సైన్యం నుండి ఎలాంటి మద్దతు లభించదని అమెరికా దన్నుతో దేశాధ్యక్షుడుగా ప్రకటించుకున్న ప్రతిపక్ష నేత జువాన్ గైడోకు స్పష్టమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అమెరికా నేతృత్వంలోనే ఈ కుట్ర

వెనిజులా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు జరుగుతున్న కుట్ర వెనుక అమెరికా హస్తం వుందంటే సరిపోదని, అసలు మొత్తం వ్యవహారం దాని కనుసన్నలలోనే జరుగుతోందని వెనిజులా విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అవసరమనుకుంటే ప్రతిపక్షంతో చర్చించడానికి సిద్ధంగా వున్నామని చెప్పారు. ఈ కుట్రలను సహించమని విదేశాంగ మంత్రి జార్జి అరెజా 'రష్యా టుడే'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. అమెరికా కుట్రకు ఆజ్యం పోసేలా స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్‌లు శనివారం మదురోకి అల్టిమేటమ్ జారీ చేశాయి. ఎనిమిది రోజుల్లో కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని మదురోకి ఆదేశాలు జారీచేశాయి. కొత్తగా ఎన్నికలు నిర్వహించే ప్రసక్తే లేదని మదురో స్పష్టం చేశారు. అహంకారం ప్రదర్శిస్తూ, అగౌరవంగా వ్యవహరిస్తున్నా యంటూ ట్రంప్, ఇయులపై మదురో ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా జోక్యం చాలా మితిమీరుతోందని అన్నారు. ప్రతిపక్షానికి మద్దతునిస్తున్న దేశాలతో సంబంధాల విషయంపై కూడా పరిశీలిస్తామని హెచ్చరించారు.

శాంతియుత పరిష్కారం : పోప్



పనామా : వెనిజులా సంక్షోభానికి న్యాయమైన, శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలని పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న పోప్ వెనిజులా పరిస్థితులపై తొలిసారిగా స్పందించారు. వెనిజులా ప్రజల మానవ హక్కులను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విదేశీ జోక్యందారీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు ప్రస్తుతం వెనిజులా చర్యలు తీసుకుంటోంది.

వాతావరణ మార్పులపై ఉధృత పోరు

- బ్రస్సెల్స్‌లో 70వేల మందితో ప్రదర్శన
- ఫ్రాన్స్‌లో మానవ హారాలు

బ్రస్సెల్స్ : వాతావరణ మార్పులపై పోరును ఉధృతం చేయాలని కోరుతూ బ్రస్సెల్స్‌లో ఆదివారం పెద్ద ప్రదర్శన నిర్వహించారు. తీవ్రమైన చలి, వర్షాలను కూడా లెక్క చేయకుండా దాదాపు 70వేల మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. గత రెండు నెలల కాలంలో బ్రస్సెల్స్‌లో జరిగిన నాల్గవ ర్యాలీ ఇది. వాతావరణ మార్పులపై బెల్జియంలో జరిగిన అతి పెద్ద ప్రదర్శన ఇది. దేశవ్యాప్తంగా రైళ్ళన్నీ జనాలతో కిక్కిరిసి పోయాయి. దాంతో చాలా మంది సకాలంలో ప్రదర్శనకు హాజరు కాలేకపోయారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు తక్షణమే కార్యాచరణ చేపట్టాలని కోరుతూ దాదాపు 35వేల మంది విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పునర్వినియోగ ఇంధనాన్ని మరింతగా వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టాలని, మన తర్వాతి తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించాలంటే మనం ఇప్పుడే కార్యాచరణకు దిగాలని ఆందోళనకారుడు హెన్నీ క్లాసెన్ వ్యాఖ్యానించారు. మే నెల్లో బెల్జియం, యురోపియన్ యూనియన్‌లో ఎన్నికలకు పార్టీలన్నీ సమాయత్తమవుతున్న నేపథ్యంలో వాతావరణ మార్పుల అంశాన్ని నేతల దృష్టికి తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రదర్శనలు కేవలం బెల్జియంకే పరిమితం కాలేదు. ఫ్రాన్స్‌వ్యాప్తంగా కూడా వేలాదిమంది మానవహారాలు చేపట్టి, బహిరంగ సభలు నిర్వహించారు.

పెను తుపానుతో హవానా అతలాకుతలం

ముగ్గురు మృతి : 174 మందికి గాయాలు

హవానా : హవానాలో ఆదివారం అర్థరాత్రి సంభవించిన తుపాను జన జీవనాన్ని అతలాకుతలం చేసింది. తుపాను ధాటికి ముగ్గురు మృతి చెందగా, 174 మందికి గాయాలయ్యాయి. ప్రధానంగా శ్రమ జీవులు నివసించే మూడు జిల్లాలు తుపాను ధాటికి తీవ్రంగా దెబ్బ తిన్నాయి. దశాబ్ద కాలంలో ఇంతటి పెద్ద తుపాను హవానాలో సంభవించడం ఇదే తొలిసారి. తుఫాను కారణంగా తీవ్రంగా దెబ్బ తిన్న ఒక జిల్లాను తాను సందర్శించానని అధ్యక్షులు మిగ్యుల్ డియాజ్ కానెల్ ట్వీట్ చేశారు. తుపాను ధాటికి అ జిల్లా అంతా ధ్వంసమైనట్లు ఆయన చెప్పారు. జరిగిన విధ్వంసాన్ని ధ్రువీకరిస్తూ పలు ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేస్తున్నాయి. ధ్వంసమైన పలు నివాసాలు, రోడ్డుపైకి ఒరిగిపోయిన కార్లు, ట్రక్కులు, వీధుల్లో చెల్లాచెదురుగా పడిపోయిన భవన శిథిలాలతో కూడిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమంలో సర్క్యులర్ అవుతున్నాయి. సహాయ కార్యక్రమాలు ఇప్పుడిప్పుడే కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే తాయిలాలు

ఆగ్రహం వ్యక్తం చేశారు. 74 షెడ్యూల్ కేటగిరిలోని 50 లక్షల మంది కార్మికులకు 15 సంవత్సరాల నుండి వేతనాలు సవరించలేదని తెలిపారు. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణం కాలయాపన జరగడానికి ప్రభుత్వమే కారణమన్నారు. పోర్టు కోసం 33 వేల ఎకరాలు బలవంతపు భూ సేకరణకు పూనుకుని ప్రభుత్వం వివాదాస్పదంగా మార్చిందన్నారు. 2013 చట్ట ప్రకారమే అవసరమైన మేరకు మాత్రమే భూములు సేకరించాలని స్పష్టం చేశారు. ఈ చట్టంలోని కీలకమైన సోషల్ ఇంప్యాక్టు ఎసెస్‌మెంట్ క్లాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయడం సరికాదన్నారు. ఇటువంటి విధానాలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. టిడిపికి ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటున్న వైసిపి వద్ద ప్రజల సమస్యలను పరిష్కరించే కార్యక్రమమేమీ లేదన్నారు. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన, సిపిఎం, సిపిఐ కలిసి మరో కొత్త శక్తిగా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో మంచి పరిణామమన్నారు. టిడిపి లేదా వైసిపి అనేలా ప్రస్తుతమున్న ద్విముఖ రాజకీయాల స్థానంలో బహుముఖ రాజకీయ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జనసేన, సిపిఎం, సిపిఐ మధ్య ఫిబ్రవరిలో ఎవరు ఏ సీట్లలో పోటీ చేయాలో నిర్ణయించుకుని ఎన్నికలకు సిద్ధపడతామని, ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో పొత్తులపై విలేకర్లడిగిన ప్రశ్నకు రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయని, ఎన్నికల అనంతరమే బిజెపికి వ్యతిరేకంగా దేశంలో లౌకిక ప్రభుత్వం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు పాల్గొన్నారు.

నాకే 'చుక్కలు' చూపిస్తారా!

జిల్లా కలెక్టర్ కోన శశిధర్ మాట్లాడుతూ చుక్కల భూములకు సంబంధించి తమ జిల్లాలో 28వేల మందికి సంబంధించిన సమస్యలను పరిష్కరించామని, 10 వేల ఇళ్ల స్థలాలను అందిస్తున్నట్లు సిఎం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై బాబు స్పందిస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ అనుసరించిన విధానాన్నే మిగిలిన కలెక్టర్లు అనుసరించాలని సూచించారు. అవసర మైతే ఆయనతో సంప్రదించాలని అన్నారు. భూ సేవపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఫిబ్రవరి 4నుంచి 15వ తేదీ వరకు చైతన్య సదస్సులు నిర్వహిస్తే బాగుంటుందని కలెక్టర్లు చేసిన సూచన పై బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో పింఛన్ల పండగ ఉందని, 5వ తేది నుండి 15 వరకు భూ సేవపై చైతన్య సదస్సులు నిర్వహించా లని చెప్పరు. భూదార్ నమోదులో రెవెన్యూ 83 శాతం, పంచాయితీరాజ్‌శాఖ 48శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ 14శాతం చేసిందని అధి కారులు ముఖ్యమంత్రికి వివరించారు. మునిసిపల్ శాఖ భూదార్ నమోదులో వేగం పెంచాలని సిఎం అధికారులను ఆదేశించారు.

గవర్నర్ ఆమోదం కోసం చర్యలు తీసుకోండి

చుక్కల భూములతో పాటు అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ ఆమోదం కోసం గవర్నర్‌కు ప్రభుత్వం ఫైలును పంపిందని, సాధ్యమైనంత త్వరగా ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్నక్యాంటీన్ భవనాలు పూర్తయ్యేలోగా ఆయా నిర్మాణాల పక్కనే తాత్కాలిక ఏర్పాట్లతో పథకం ప్రారంభించాలని సూచించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చేపట్టే పనులను తక్షణం నిధులు అందజేస్తామని చెప్పారు. ఈనెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో ఫెథాయ్ తుఫాన్ నష్టం పరిశీలనకు కేంద్ర బృందం రాష్ట్రానికి రానుందని తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఇతర సహాయాలపై ఢిల్లీ వెళ్ళి ఆయా శాఖల మంత్రులపై వత్తిడి తేవాలని మంత్రి వర్గ సహచరులకు చంద్రబాబునాయుడు సూచించారు. గ్రీన్ అంబాసిడర్లకు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు పే స్కేలు అమలు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. అన్ని గ్రామాలు పరిశుభ్రంగా కనిపించాలని, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం అధికారులకు సూచించారు. పెండింగ్ పనులన్నింటికీ షార్ట్ టెండర్లు పిలవాలని, కడప హజ్ భవన్ నిర్మాణం కోసం అవసరమైన నిధుల్ని విడుదల చేయాలని సిఎం సూచించారు.

ఇలా ఐతే రాజీనామా చేస్తా

కాంగ్రెస్‌కు సిఎం కుమార స్వామి హెచ్చరిక



కొత్త మెట్రో రైలును ప్రారంభిస్తున్న సిఎం కుమారస్వామి

బెంగళూరు, ప్రజాశక్తి ప్రతినిధి : కర్ణాటకలో కొందరు కాంగ్రెస్ నాయకులు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయటాన్ని మానుకోకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగుతానని కుమారస్వామి హెచ్చరించారు. ఆయన సోమవారం బెంగళూరులో బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. సంకీర్ణం సారథిగా కాంగ్రెస్, జెడిఎస్ పార్టీల శాసనసభ్యుల నియోజకవర్గాలకు సాధ్యమైనంత నిధులు మంజూరు చేస్తున్నా కూడా కొందరు శాసనసభ్యులు దీనిపై అవాకులు చెవాకులు పేలుతాన్నారని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులైన ఎస్‌టి.సోమశేఖర్ తదితరులు ఆదివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో సిఎం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దరామయ్య హయాంలో మంజూరైన రోడ్డు ప్రాజెక్టులకు తగిన నిధులు ఇవ్వకుండా సతాయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సిఎం ఘాటుగా స్పందించారు. నేనేమీ కావాలని సిఎం పదవీ అడగలేదు. కాం గ్రెస్ నాయకులే మానాన్న ఇంటికి వచ్చి జెడిఎస్‌తో పొత్తు పెట్టుకుంటామని, ముఖ్యమంత్రి పదవిని కేటాయిస్తామని చెప్పారు. వారి హామీల మేరకే సిఎం అయ్యాను. ఇపుడు ప్రతిదానికీ కాంగ్రెస్ ఎంఎల్ఎలు నన్ను నిలదీసేలా వ్యాఖ్యలు చేయటం బాగోలేదు. తాను సిఎం కుర్చీని పట్టుకుని వేలాడే వ్యక్తిని కానని స్పష్టం చేశారు. వారికి కావాలంటే ఇపుడే సిఎం పదవి నుంచి వైదొలగుతానని హెచ్చరించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి.పరమేశ్వర ముఖ్యమంత్రికి సర్దిచెప్పటానికి ప్రయత్నించారు. మీడియా కూడా సిఎంను ఇదే అంశంపై గుచ్చిగుచ్చి అడగ్గా ఇది కాంగ్రెస్ నాయకుల అంతర్గత వ్యవహారం. వారినే అడిగి తెలుసుకోవాలని చెప్పారు. మరోవైపు మైసూరులో జరిగిన ఒక ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సిఎం సిద్దరామయ్య అక్కడ జరిపిన జనతాదర్శన్ కార్యక్రమంలో సొంతపార్టీ నాయకుల వ్యవహారశైలికి ఉక్కిరిబిక్కిరయ్యారు. తన తనయుడు డాక్టర్ యతీంద్ర ప్రాతినిధ్యం వహించే వరుణా నియోజకవర్గం అభివృద్ధి పనులకు సంబంధించి సదరు శాసనసభ్యుడు ప్రజలకు, నాయకులకు అందుబాటులో లేరని ఒక మహిళా నాయకురాలు చేసిన ఆరోపణలు సభ రసాభాసకు దారి తీశాయి. చమాలాల్ అనే మైసూరు తాలూకా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షురాలు నిధులు అందక తన ఏరియాలో పనులు ముందుకు సాగటం లేదని ఆరోపించారు. ఈసమయంలో సిద్దరామయ్యను ఉద్దేశించి మీరు గత సారి ఎని న్నికలపుడు వచ్చివెళ్లారు. మీరు చెప్పిన అభ్యర్థికే ఓటు వేశాం. అప్పటినుంచి మా ఏరియా పనులు జరగటం లేదని ఆరోపించారు. తన తనయునిపై నేరుగా ఆరోపణలు చేసిన సదరు కాంగ్రెస్ నాయకురాలిపై సిద్దరామయ్య ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసి ఇక్కడ ఏవైనా పనులు కావాలంటే తనను అడిగితే సరిపోతుందని చెప్పారు.మాటల మధ్యలో సదరు మహిళను గమ్మున ఉండాలని ఆదేశించారు. ఇదంతా క్షణాల్లో వైరల్‌గా మారింది. మాజీ సిఎం సిద్దరామయ్య కాంగ్రెస్ నాయకురాలిపై దురుసుగా ప్రవర్తించారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. తరువాత సిద్దరామయ్య మహిళా నాయకురాలి సమస్యను ఆలకించి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పటంతో వివాదం సద్దుమణిగింది.



తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ నివాసం వద్ద మొహరించిన పోలీసులు

పోలీసు వలయంలో కిర్లంపూడి

మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. సోషల్‌మీడియా, మొబైల్స్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. దీనిపై జగ్గంపేట సిఐ వై.రాంబాబును వివరణ కోరగా కిర్లంపూడికి 700 మంది పోలీసులను బందోబస్తు నిమిత్తం తరలించామని తెలిపారు. కత్తిపూడి సమావేశానికి ఎటువంటి అనుమతులూ కోరలేదని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకే పోలీసులను తరలించామని తెలిపారు.

చలో కత్తిపూడికి అనుమతులు లేవు : ఎస్‌పి

ఈనెల 31న తలపెట్టిన 'చలో కత్తిపూడి'కి పోలీసు శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి విశాల్‌గున్నీ స్పష్టం చేశారు. సోమవారం ఆయన పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో కత్తిపూడి సభకు అనుమతులు కోరుతూ ఎవరూ దరఖాస్తు చేసుకోలేదన్నారు. రాజమండ్రిలో జరిగిన బిసి సభ, ప్రతిపక్ష నేత జగన్ ఆధ్వర్యంలో నిర్వహించే సభలు, పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు సైతం ముందస్తుగా పోలీసుశాఖ నుంచి అనుమతులు తీసుకున్నారని గుర్తు చేశారు. దరఖాస్తు చేసుకుంటే నిబంధనలు బట్టి అనుమతులు ఇవ్వడం, ఇవ్వకపోవడం అనేది ఆధారపడి ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా బహిరంగ సభలు నిర్వహిస్తే మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి అనుమతులు లేని సభలకు వెళ్లి ఇబ్బందులకు గురికావొద్దని ప్రజలకు సూచించారు. ఆయన వెంట పెద్దాపురం సిఐ జి.యువకుమార్, ఎస్ఐ ఎ.కృష్ణభగవాన్‌లు పాల్గొన్నారు.

'ఓడిఎఫ్ ప్లస్'కు సమస్యలెన్నో...!

ట్రై సైకిళ్ల పంపిణీలోను జాప్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓడిఎఫ్ ప్లస్ కార్యక్రమాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో భాగంగా అన్ని జిల్లాల్లో ఇప్పటి వరకూ 9 వేల షెడ్ల నిర్మాణం పూర్తి చేసినా 5,200 గ్రామాల్లో మాత్రమే డోర్ టు డోర్ చెత్తను సేకరిస్తున్నారు. దీంతో మరో 3,800 షెడ్లు నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ అంశంపై తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని చెబుతున్నా ఇప్పటికీ సన్నద్ధం కాకుండా ఎప్పటికప్పుడు గడువు పొడిగించుకుపోతే ఎప్పటికి పూర్తవుతుందని అధికారులను ప్రశ్నించారు. ఫిబ్రవరి నాటికి గ్రామాల్లో డోర్ టు డోర్ చెత్తను సేకరించాలని గతంలో లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికీ పూర్తి స్థాయిలో ట్రై సైకిల్స్ అందుబాటులో లేకపోవడం, చెత్త బుట్టల పంపిణీ పూర్తి కాకపోవడం, గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యలతో కార్యక్రమం ముందుకు సాగడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 29 వేల ట్రైసైకిల్స్ పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకూ 16 వేల మాత్రమే పంపిణీ చేశారు. చాలా గ్రామాలకు కొద్ది సంఖ్యలో మాత్రమే ట్రైసైకిళ్లు మంజూరు చేయడంతో చెత్త సేకరణ సాధ్యం కావడం లేదు. బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా లిథింఅయాన్ బ్యాటరీలు అందుబాటులో లేకపోవడంతో ట్రై సైకిళ్ల పంపిణీలో సరఫరా చేస్తున్న సంస్థలు జాప్యం చేస్తున్నాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అదే విధంగా డస్ట్ బిన్‌ల పంపిణీ పూర్తి స్థాయిలో జరగలేదు. పారిశుధ్య కార్యక్రమాల కోసం నియమించిన గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇబ్బందు పడుతున్నారు. సిఎఫ్ఎంఎస్ విధానంలో సమస్యలు తలెత్తడం వల్ల వీరికి జీతాలు చెల్లింపులో జాప్యం జరిగుతోందని స్వచ్ఛంధ్ర అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.58 కోట్లు చెల్లింపులు జరపాల్సి ఉంది. మార్చి 1 నాటికి అన్ని గ్రామాలకు ట్రైసైకిళ్లు పంపిణీ చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోకపోతే మరోమారు ఈ కార్యక్రమం అమలు వాయిదా తప్పదని అధికారులు భావిస్తున్నారు. ఓడిఎఫ్ ప్లస్‌లో భాగంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం భూగర్భ డ్రైనేజీ నిర్మాణం 150 కిలోమీటర్ల మేర పూర్తయ్యింది. మరో వంద కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

సిఎంతో కోట్ల కుటుంబం భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కర్నూలు మాజీ ఎంపి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి సుజాతమ్మ, కుమారుడు రాఘవేంద్రరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి సోమవారం రాత్రి ఉండవల్లిలోని సిఎం నివాసంలో భేటీ అయ్యారు. కోట్ల కుటుంబానికి ముఖ్యమంత్రి డిన్నర్ ఇస్తుండటం రాజకీయంగా భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ముఖ్యంగా కర్నూలు ఎంపి సీటుతో పాటు డోన్, ఆలూరు ఎమ్మెల్యే సీట్లు తమ వర్గానికి కేటాయించాలని భేటీలో చర్చకు వచ్చే అవకాశముంది. కర్నూలు జిల్లా రాజకీయాల్లో కోట్ల, కెఇ కుటుంబాల మధ్య నాలుగు దశాబ్ధాలుగా రాజకీయ వైరం ఉన్న నేపథ్యంలో కెఇ చేరికపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. కోట్ల టిడిపిలోకి రాక గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు కెఇ కృష్ణమూర్తి స్పందిస్తూ తమకు ఇంత వరకు వారి చేరిక గురించి తమతో చర్చించలేదని, వారి చేరికపై ఎలాంటి సమాచారం తమకు లేదన్నారు.. సిట్టింగ్ ఎంపి బుట్టా రేణుక వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చారు. ఈమెకు పాణ్యం నుంచి అసెంబ్లీ సీటు కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాజకీయ ప్రత్యర్థులు ఒకే పార్టీలో కొనసాగుతారా లేదా ననే అంశంపై కాలమే సమాధానం చెప్పాలి. రెండు వర్గాలను చంద్రబాబు ఎలా సమన్వయం చేస్తారో వేచి చూడాల్సిందే.

రామ మందిర అంశంలో.. దేశాన్ని తప్పదోవ పట్టిస్తున్న యోగి

యూపీ మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్

లక్నో: యూపీ మంత్రి, సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాశ్ రాజ్‌భర్.. మరోసారి ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై విమర్శలు చేశారు. రామ మందిర వివాదంలో దేశాన్ని యోగి తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయోధ్య అంశం తమకు అప్పగిస్తే 24 గంటల్లో పరిష్కరిస్తామని సీఎం యోగి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన పైవిధంగా స్పందించారు. 'కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నది. గత ఐదేండ్లలో ఈ సమస్యపై వారు ఎలాంటి పరిష్కారాన్ని కనుగొనలేదు. మరి అలాంటప్పుడు రామ మందిర నిర్మాణంపై 24 గంటల గడువునిస్తే యోగి ఏం చేస్తారు?' అని ప్రశ్నించారు. 'కేంద్రంలో, రాష్ట్రంలో రెండింటా అధికారంలో ఉన్న బీజేపీని ఆలయ నిర్మాణం విషయంలో ఎవరు అడ్డుకుంటున్నారు?. ఈ విషయంలో సీఎం యోగి దేశ ప్రజలను అయోమయానికి గురిచేసి తప్పుదారి పటిస్తున్నారు' అన్నారు. ప్రధాని పదవికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అర్హుడేనని, అయితే ప్రజాస్వామ్య దేశంలో ప్రజల తీర్పే శిరోధార్యమన్నారు. వెనుకబడిన కులాలను బీజేపీ మోసం చేసినందుకు ఫిబ్రవరి 24న ఆ పార్టీతో పొత్తులను తెగదెంపులు చేసుకుంటామని రాజ్‌భర్ పునరుద్ఘాటించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఎస్పీ-బీఎస్పీ కూటమికి మద్దతు పలుకు తారని అన్నారు.

ఆ ఛాన్స్ ఎవరికి?



కీర్తి సురేశ్

రష్మిక మడన్నా



పరిణీతి చోప్రా

రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్న సినిమా 'ఆర్ఆర్ఆర్'. ఇది వర్కింగ్ టైటిల్ మాత్రమే. ఎన్టీఆర్, రామ్ చరణ్ నటిస్తున్న మల్టీస్టారర్ ఇది. రూ.300 కోట్లతో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో దానయ్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఒకటో షెడ్యూల్ పూర్తి చేసుకుంది. రాజమౌళి కొడుకు వివాహం వల్ల సుమారుగా 45 రోజులు పాటు విరామం తీసుకున్నారు. తాజాగా హైదరాబాద్‌లో కొత్తగా రెండో షెడ్యూల్ మొదలైంది. ఈ షూటింగ్‌లో రామ్ చరణ్, ఎన్టీఆర్ ఇద్దరూ పాల్గొంటున్నారు. అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ప్రస్తుతం పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికలుగా ఎవరు నటిస్తారన్నది ఇప్పటివరకూ స్పష్టత లేదు. ముఖ్యంగా ఇందులో నటించబోయే హీరోయిన్లలో ముగ్గురు కథానాయికల పేర్లు వినిపిస్తున్నాయి. అందులో కీర్తి సురేశ్, రష్మిక మడన్నా, పరిణీతి చోప్రా ఉన్నారు. కీర్తి సురేశ్ 'మహానటి' తర్వాత ఇటీవలే ఓ తెలుగు సినిమాలో నటించేందుకు అంగీకరించింది. కోనేరు మహేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నరేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. అమెరికాలోనే ఎక్కువ భాగం చిత్రీకరణ జరుపుకోనుంది. ఈ సినిమా తర్వాత 'ఆర్ఆర్ఆర్'లో కథానాయికగా చేసే అవకాశాలు ఉన్నాయి. ఈమెతో పాటు రష్మిక మడన్నాతోనూ రాజమౌళి చర్చలు జరిపారట. వీరిద్దరూ ఈ చిత్రంలో నటించేందుకు ఎక్కువ ఛాన్సలు ఉన్నాయి. వీరితో పాటు బాలీవుడ్ కథానాయిక పరిణీతి చోప్రాను కూడా సంప్రదించిందట ఈ చిత్రబృందం. పరిణీతి ప్రస్తుతం 'కేసరి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. ఈ చిత్రం ఒక్కటే ఆమె చేతిలో ఉంది. అందుకే దక్షిణాదిలో అవకాశాలు వస్తే నటించేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ నేపథ్యంలో రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' కోసం ఆమెను సంప్రదించారు. అయితే ఇందులో ఎవరు నటిస్తారన్నది ఇప్పటి వరకూ స్పష్టత రాలేదు. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపొందుతోంది.



ఇటీవల ప్రభుత్వం గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని పద్మశ్రీ పౌర పురస్కారంతో గౌరవించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీతారామశాస్త్రిని చిరంజీవి సోమవారం అభినందించారు. 80, 90 దశకాల్లో చిరంజీవి నటించిన చాలా చిత్రాలకు సిరివెన్నెల అద్భుతమైన గీతాలు రాశారు. 'రుద్రవీణ', 'రౌడీ అల్లుడు', 'స్వయంకృషి' వంటి సినిమాలకు ఆయన పాటలు రాశారు.

'ఇస్మార్ట్ శంకర్' హీరోయిన్ నిధి అగర్వాల్



నిధి అగర్వాల్



రామ్

రామ్ పోతినేని, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా 'ఇస్మార్ట్ శంకర్'. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభం అయ్యింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నిధి అగర్వాల్‌ని ఎంపిక చేసినట్లు దర్శకుడు వెల్లడించారు. అందం అభినయంతో ఆకట్టుకున్న నిధి అగర్వాల్‌కి తెలుగులో ఇది మూడో సినిమా. ఇటీవలే ఆమె కథానాయికగా నటించిన 'మిస్టర్ మజ్ను' చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. దీనికి ముందు 'సవ్యసాచి'లో నటించింది. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ యాక్షన్ సీన్లు చిత్రీకరణ జరుపుకుంటుంది. హీరో రామ్ షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. రియల్ సతీష్ ఈ యాక్షన్ ఎపిసోడ్‌కి కొరియోగ్రఫీ చేస్తున్నాడు. త్వరలో నిధి అగర్వాల్ షూటింగ్‌లో పాల్గొననుంది. పునీత్ ఇస్సార్, సత్య దేవ్, మిలింద్ గునాజీ, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం సమకూరుస్తున్నారు. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాఉ. ఈ సినిమాని మేలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

70వ దశకం కథ



నారా రోహిత్

'బాణం' చిత్రం నారా రోహిత్‌కు, దర్శకుడు చైతన్య దంతులూరికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత వీరి కాంబినేషన్‌లో మరే చిత్రమూ చేయలేదు. ఇన్నాళ్లకు వారి కలయికలో మరో చిత్రం రాబోతుంది. ఈసారి 1971 కాలంలో సాగే పీరియాడిక్ కథతో రాబోతున్నారు. ఇటీవలే ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుందని ఈ చిత్రం ఫిబ్రవరి నెలాఖరులో పట్టాలెక్కనుందని తెలుస్తోంది. దర్శకుడిగా తన మొదటి చిత్రమైన 'బాణం'తో చైతన్య దంతులూరి మంచి పేరు తెచ్చుకున్నా ఆ తరువాత 'బసంతి' చిత్రంతోనూ ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేశాడు. అయినా కమర్షియల్‌గా మాత్రం సక్సెస్ సాధించలేకపోయాడు. అందుకే ఈ సారి ఎలాగైనా హిట్ కొట్టాలని ఎన్నో జాగ్రత్తలు తీసుకొని మరి ఈ సినిమా చేస్తున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది.

కొత్తతరం ఆలోచనలు



మిషాన్, హేమలత

కొత్తతరం ఆలోచనలకు దగ్గరగా ఉండే సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిలబడతాయి అని చాలా చిత్రాలు నిరూపించాయి. అలాంటి సబ్జెక్ట్‌తో శుక్రా ప్రొడక్షన్ బ్యానర్‌లో మిషాన్ జైన్, హేమలతా రెడ్డి హీరో, హీరోయిన్లుగా రాబోతున్న చిత్రం టాకీ పార్ట్‌ని పూర్తి చేసుకొంది. పాటల చిత్రీకరణకు సిద్ధమవుతుంది. కంటెంట్ బేసెడ్ సినిమాగా ఇండస్ట్రీలో బజ్‌ని క్రియేట్ చేసుకుంది. ఈ సినిమా టైటిల్‌ని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాత సంజయ్ జాదవ్ తెలిపారు.

దర్శకుడు వి ఎస్ ఫణీంద్ర మాట్లాడుతూ 'ఇప్పటి ట్రెండ్‌కు తగిన అంశాలతో సినిమా రూపొందుతుంది. అలాగే యాక్షన్ ఎపిసోడ్స్ బాగా ఆకట్టుకుంటాయి. కథకు యూత్ బాగా రిలేట్ అవుతారు. ఇప్పటివరకూ వచ్చిన అవుట్ పుట్ చాలా సంతృప్తిగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. రాజా రవీంద్ర కీలక పాత్రను పోషిస్తున్నారు. సినిమా పిబ్రవరి 4నుండి ఫైనల్ షెడ్యూల్‌కి వెళుతుంది' అని పేర్కొన్నారు.

'సకల కళా వల్లభుడు' సిద్ధం

తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సకల కళా వల్లభుడు'. 'సుబ్రమణ్యపురం' నిర్మాత బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహ ఫిలింస్, దీపాల ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. శివగణేష్ దర్శకత్వం వహించారు. నిర్మాతలు మాట్లాడుతూ 'అవుట్ అండ్ అవుట్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 1న ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. హీరో పెర్ఫార్మెన్స్, కథ, కథనాలు హైలైట్‌గా నిలుస్తాయి. అలాగే ఇంటర్వెల్ సన్నివేశం ఉత్కంఠకు గురిచేస్తుంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ' అని అన్నారు.

దర్శకుడు శివ గణేష్ మాట్లాడుతూ 'ఒక హిట్ చిత్రానికి కావలసిన ఎలిమెంట్స్ అన్నీ ఈ చిత్రానికి కుదిరాయి. ధర్మేంద్ర ఎడిటింగ్, అజయ్ పట్నాయక్ సంగీతం, హీరో హీరోయిన్ల, విలన్ పెర్ఫార్మన్స్‌తో మా చిత్రం ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంటుంది. ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ పృథ్వీ, జీవా కామెడీ సన్నివేశాలు. ఇప్పటకే విడుదలైన ట్రైలర్‌లో పృథ్వీ మేనరిజానికి మంచి రెస్పాన్స్ వచ్చింది' అని తెలిపారు.



'సకల కళా వల్లభుడు'లో తనిష్క్



రాయ్ లక్ష్మీ

పాప నీకేదంటే ఇష్టం...

రాయ్ లక్ష్మీ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి'. కిషోర్ కుమార్ దర్శకత్వంలో రాబోతున్న కామెడీ ఎంటర్‌టైనర్. ఈ చిత్రం నుండి 'పాప నీకేదంటే ఇష్టం' అనే పాటను చిత్ర యూనిట్ విడుదల చేయబోతోంది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటుంది. 'ఖైదీ నెం 150', 'సర్దార్ గబ్బర్ సింగ్' చిత్రాల్లోని ప్రత్యేక పాటల్లో నటించి మెప్పించిన రాయ్ లక్ష్మి, మళ్లీ 'వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి' చిత్రంతో టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తుంది. 'రంగస్థలం' ఫేమ్ పూజిత పొన్నాడ కూడా ఇందులో కీలకపాత్రను పోషిస్తుంది. ఈ చిత్రాన్ని ఏబీటీ క్రియేషన్స్ బ్యానర్ రూపొందిస్తోంది. ఈ సినిమాలో నవీన్ నేని, మహాత్, పంకజ్ ఇతర పాత్రలలో నటిస్తున్నారు. ముఖ్యంగా ఈ చిత్రంలోని హాస్యం ప్రేక్షకులను బాగా అలరిస్తోందని చిత్రబందం నమ్మకంగా చెబుతుంది.

కేన్సర్ నా జీవితాన్ని మార్చేసింది



మనీషా కొయిరాల

భారతదేశంలో కేన్సర్‌కు ట్రీట్‌మెంట్ తీసుకోవడం భారీ ఖర్చుతో కూడుకున్న విషయమేమీ కాదని, ఈ విషయంలో అవగాహన పెరగాలని బాలీవుడ్ నటి మనీషా కొయిరాల అన్నారు. కేన్సర్ తన జీవితంలోకి టీచర్‌లా వచ్చి, జీవితం విలువను తెలిపిందని పేర్కొందామె. మనీషా అండాశయ కేన్సర్‌తో పోరాడి గెలిచింది. ఆమె 'హీయిల్డ్ హౌ కేన్సర్ గేవ్ మీ ఏ న్యూ లైఫ్' పేరుతో ఓ పుస్తకాన్ని రాశారు. ఆదివారం లిచరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కొయిరాల మాట్లాడుతూ ' నేను నిర్లక్ష్యం చేయడం వల్ల నా ఆరోగ్యం నా నుంచి అనుమతి తీసుకుంది. అందుకే కేన్సర్ నాకు వచ్చింది. అయితే అది ఒక టీచర్‌లా వచ్చి పాఠం బోధించింది. జీవితం ఎంత విలువైందో ఇప్పుడు తెలిసింది. ఆరోగ్యంగా ఉండాలని ఇప్పుడు తెలుసుకున్నా. ఎందుకంటే ఒకవేళ ఆరోగ్యంగా లేకపోతే ఏవిధంగానూ ఆనందంగా జీవించలేం. నేను రాసిన పుస్తకం కూడా నేను చనిపోవాలని అనుకోవడం లేదు అని రాశాను. కేన్సర్ వచ్చిందంటే ఆ వ్యక్తి చనిపోవాలనే ఆలోచన వచ్చేస్తుంది. ఈ వ్యాధి నాకొచ్చినప్పుడు షాక్ అయ్యాను. ఆ రోజు రాత్రి ఒంటరిగానే గడిపాను. ఖాట్మాండు నుంచి ముంబాయికి ట్రైన్‌లో కుటుంబంతో ప్రయాణించినా అనేక సార్లు అనేక విధాలుగా ఆలోచించాను. నాకు బాగా బాగోలేనప్పుడు పాజిటివ్ కథలు కోసం వెతికేదాన్ని. కేన్సర్‌ను జయించిన నటి లిసా రాయ్, క్రికెటర్ యువరాజ్ సింగ్ వంటి స్టోరీస్ తప్ప ఎక్కువగా అయితే సంపాదించలేకపోయాను. అందుకే కోలుకున్నాక నేను ఎదుర్కొన్న వాటిని తెలియజేయాలని నిర్ణయించుకున్నా. అందుకే ఈ పుస్తకం రాశా. నేను మళ్లీ బతికితే కేన్సర్ గురించి అందరిలోనూ అవగాహన పెంచాలని అనుకున్నా ' అని చెప్పింది.

ఆ హక్కు ప్రేక్షకులకుంది

– అమిర్ ఖాన్



'వాళ్ల ఊహించినట్టు సినిమా లేకపోతే కఠినంగా విమర్శించి, నాపై ఒత్తిడి తెచ్చే హక్కు ప్రేక్షకులకు ఉంది. ఆడియెన్స్ ఎటువంటి సినిమాను ఇష్టపడతారో చెప్పగలను గానీ, చేసిన చిత్రం ఆడుతుందో? లేదో? మాత్రం తీర్పునివ్వలేను' అని బాలీవుడ్ హీరో అమిర్ ఖాన్ అన్నారు. ఆయన నటించిన చిత్రం 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'. అమిర్, అమితాబ్ బచ్చన్, కత్రినా కైఫ్, ఫాతిమా సేన షేఖ్ కలసి నటించిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సందర్భంగా ప్రేక్షకులు తనను క్షమించాలని కూడా అమిర్ ఇదివరకే కోరారు. తాజాగా తన ప్రొడక్షన్ హౌస్ అమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో రూపొందుతోన్న 'రుబరు రోష్ని' అనే డాక్యుమెంటరీ ప్రమోషన్ పనుల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ "క్షమించండి..అని అడగాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్య, మా చిత్రబృందం మంచి సినిమానే తీసింది. నాతో పని చేసిన దర్శకులంతా మంచివారే. వాళ్ల ఉద్దేశాలూ మంచివే. ఓ మంచి సినిమా చేయాలన్నదే మా అందరి లక్ష్యం. కానీ కొన్నిసార్లు వైఫల్యం పొందొచ్చు. సినిమా రూపొందించడం చాలా కష్టమైన పని. నేను జట్టు నాయకుడ్ని. మా దర్శకుడు తప్పు చేస్తే నేను కూడా తప్పుచేస్తాను' అని చెప్పారు.

అమిర్ తన విధానం ఎలా ఉంటుందో వివరిస్తూ...' ఒక వేళ సినిమా విజయం సాధించకపోయినా ఆ విషయాన్ని నేను మనసులో పెట్టుకోను. ఆ సమస్య నాకు లేదు. నేను దర్శకుడ్ని నమ్ముతాను కాబట్టి వాళ్లు చెప్పినవే నేనూ చేస్తాను. కాకపోతే తప్పులు జరిగితే వాటి నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటాం' అని పేర్కొన్నారు.

తనను అభిమానించే ప్రేక్షకులు, అభిమానుల విషయంలో అమిర్ ఏ విధంగా ఆలోచిస్తారో చెబుతూ "నా పేరు చూసి ప్రేక్షకులు నా సినిమా చూడ్డానికి వస్తారు. కాబట్టి ప్రేక్షకులు నా వ్యక్తిగతం, వారి పట్ల పూర్తి బాధ్యత వహిస్తా. సినిమా విజయం సాధించి కూడా కొందరు విమర్శలు చేస్తే అది తప్పే. ప్రజలు ఏ తరహా సినిమాలను ఇష్టపడతారో నాకు తెలుసు. కానీ ఏం సినిమా ఆడుతుందో? ఏ చిత్రం ఆడదో అన్న విషయంపై మాత్రం తీర్పులివ్వలేం. అయితే ప్రేక్షకులు ఊహించనట్టు సినిమా లేకపోతే కఠినంగా విమర్శించే హక్కు వాళ్లకు ఉంటుందని నేను అనుకుంటున్నా. కొంత కోపం కూడా ఉంటే ఉండొచ్చు. చాలా కాలంగా నేను ఫ్లాప్ సినిమాలు చేయడం లేదు. అందువల్ల ప్రేక్షకుల వారి ఆగ్రహం తీర్చుకోవడానికి అవకాశం వచ్చింది. ఇది చాలా మంచిది కూడా" అని అన్నారు.

కథ దొరికితే కొడుకు ఎంట్రీకి సిద్ధం

అమిర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ కూడా హీరోగా రంగ ప్రవేశం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు అమిర్ తెలిపారు. సరైన కథ కోసం అన్వేషిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అమిర్‌కు ఇరా ఖాన్, జునైద్ ఖాన్ ఇద్దరు కొడుకులు. వీళ్ల మొదటి భార్య పిల్లలు. వీరిలో ఇరా ఇప్పటికే నటుడు. జునైద్ నటుడు కావాలని తప్పన పడుతున్నాడు. 'జునైద్ కాబోయే నటుడు. సరైన స్క్రిప్ట్ కోసం వెతుకుతున్నాం. జునైద్ పనితనం నేను చూశాను. బాగుంది. నేను స్క్రీన్ టెస్ట్‌ను నమ్ముతాను. వాడు స్క్రీన్ టెస్ట్ పాసైతే యాక్టర్ అవుతాడని నమ్ముతాను, లేకుంటే అవ్వడని అనుకుంటాను" అని అమిర్ అన్నారు.

ఆమెకు దూరంగా ఉన్నా...

జుహి చావ్లా, అమిర్ ఖాన్ జోడీగా 'ఖ్యాయమ్యాట్ సే ఖ్యాయమ్యాట్', 'లవ్ లవ్ లవ్', 'హమ్ హైన్ రహి ప్యార్ కే' వంటి ఏడు సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. 'ఇష్క్' చిత్రం సెట్‌లో వీరిద్దరి మధ్య విభేదాలు పొడచూచాయి. ఏడేళ్ల క్రితం వచ్చిన ఆ సినిమా తర్వాత ఇప్పటి వరకూ వీరిద్దరూ కలసి ఒక్క సినిమాలోనూ నటించ లేదు. దానికి కారణాన్ని అమిర్ తాజాగా వివరించారు ' ఇష్క్ సినిమా చిత్రీకరణ సమయంలో చిన్నపాటి సమస్యల వల్ల పోట్లాడుకున్నాం. అది పెద్ద విషయం కాదు. కానీ నేనొక పెద్ద ఇగోయిస్టిక్‌గా ఆలోచించా. అందుకే సెట్‌లో కూడా మళ్లీ ఆమెతో మాట్లాడకూడదని నిర్ణయించుకున్నా. సెట్‌లో ఆమెకు దూరంగా ఉండేవాడ్ని. ఎందుకలా ఉండేవాడినో నాకే తెలియదు. చావ్లా వచ్చి నా పక్కన కూర్చొన్నా సరే...నేను అక్కడ నుంచి 50 అడుగుల దూరంగా వెళ్లిపోవాలనుకునేవాడ్ని(నవ్వుతూ). ఆమెనెప్పుడూ పలకరించేవాడ్ని కాదు. సీన్లు చిత్రీకరణ జరిగేటప్పుడు మాట్లాడాల్సి వస్తేనే ఆమెతో మాట్లాడేవాడ్ని. అది వృత్తిలో భాగంగానే జరిగేది అన్నట్టు. అందువల్ల ఆరేళ్ల పాటు మేం మాట్లాడుకోలేదు. కానీ రీనాతో నేను విడాకులు పొందిన విషయం తెలుసుకుని చావ్లా నాకు ఫోన్ చేసి మాట్లాడి తర్వాత వచ్చి కలుసుకుంది. తర్వాత రీనాకు, నాకు చావ్లా దగ్గరయ్యారు. మా ఇద్దరి మధ్య ఉన్న విబేధాలను చెరిపేయాలని ప్రయత్నించింది. ఆమె ఇప్పటికీ నాకు ఫోన్ చేస్తూనే ఉంటుంది" అని అన్నారు అమిర్ ఖాన్.



జుహి చావ్లా, అమిర్



లుకేమియా..
ఆధునిక వైద్యంతో నివారణ

క్యాన్సర్... శరీరంలోని కణజాలాలను తీవ్రంగా ప్రభావితం చేసి, జీవక్రియలను తారుమారుచేసి మరణానికి దగ్గరగా తీసుకెళ్లే వ్యాధి. క్యాన్సర్లలో చాలా రకాలున్నా తొలిదశలోనే వాటిని గుర్తించి తగిన చికిత్స పొందితే జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చు. కొన్నింటి నుంచి శాశ్వతంగా బయటపడొచ్చు. ఒకప్పుడు క్యాన్సర్ వస్తే ఇక జీవితం అక్కడితో ముగిసిపోయినట్టే అని చాలామంది ఆందోళనతో గడిపేవారు. ఆధునిక వైద్య విజ్ఞాన పరిశోధనల ఫలితంగా క్యాన్సర్ వ్యాధిని కూడా జయించొచ్చని రుజువవుతోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల4న 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా బ్లడ్‌క్యాన్సర్ (లుకేమియా) లక్షణాలు, రకాలు, చికిత్సలు తదితర విశేషాలే ఈవారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో తెలుసుకుందాం!

రక్తంలోని తెల్ల రక్త కణాలలో ఏర్పడే క్యాన్సర్‌ని 'లుకేమియా' అంటారు. సాధారణ పరిభాషలో బ్లడ్‌క్యాన్సర్ అని వ్యవహరిస్తుంటారు. శరీరానికి అవసరమయ్యే ఎముక మూలుగ(మజ్జ)లో రక్తం ఉత్పత్తి అవుతుంది. ఈ ఎముక మజ్జలో తెల్ల రక్తవిభాజ్యకణాల్లో డీఎన్‌ఏ మార్పులు జరిగి, అవి విచ్చలవిడిగా పెరుగుతూ ఉంటే ఎర్రరక్తకణాల సంఖ్య తగ్గిపోతుంది. తెల్లరక్త కణాలు విపరీతంగా పెరిగిపోతుంటాయి. ఈ పరిస్థితి లుకేమియాకు దారి తీస్తుంది. దీనివల్ల జీవక్రియలు తారుమారవుతాయి. మొత్తం శరీరమంతటా దీని ప్రభావం పడుతుంది.

లక్షణాలు

✧ రక్తహీనత ప్రధానమైన లక్షణం.



తెల్లరక్తకణాల సంఖ్య పెరిగిపోయి, ఎర్రరక్తకణాలు తగ్గిపోవడం వల్ల ఈ లక్షణం వెంటనే బహిర్గతమవుతుంది.

✧ శరీరభాగాలు తమ విధులను నిర్వహించడానికి అవసరమైన రక్తకణాలు అందకపోవడంతో అలసట, నీరసం వంటివి ఉంటాయి.

✧ ఎముకలలో నొప్పిగా ఉంటుంది.

✧ తెగినా, గాయమైనా రక్తం తొందరగా గడ్డ కట్టదు, తీవ్రమైన రక్తస్రావం ఉంటుంది.

✧ ఆకలి ఉండదు, ఏదీ తినాలని అన్పించకపోవడంతో శరీరానికి శక్తి సన్నగిల్లుతుంది.

✧ శోషరస గ్రంధుల్లో వాపు ఏర్పడుతుంది.

✧ దీర్ఘకాలిక జ్వరం ఉంటుంది.

ముఖ్యమైనవి నాలుగు రకాలు

లుకేమియాల్లో చాలా రకాలున్నా, వాటిలో తరచుగా కనిపించేవి నాలుగు రకాలు అవి :

అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా (ఎఎల్ఎల్)

అక్యూట్ మైలాయడ్ లుకేమియా(ఎఎంఎల్)

క్రానిక్ లింపోసైటిక్ లుకేమియా (సిఎల్ఎల్)

క్రానిక్ మైలాయడ్ లుకేమియా (సిఎంఎల్)

అయితే కొన్నిసార్లు ఇతర క్యాన్సర్లు ఎముక మజ్జలోకి వ్యాపించే అవకాశం ఉన్న ఉన్నా అవి లుకేమియాలు కావని గ్రహించాలి.

అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా

అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా అనే రకం కాన్సర్ ఎముక మజ్జలోని లింఫొసైట్లలో జన్యు మార్పు సంభవించి, అవి నియంత్రణ లేకుండా విభజన జరుగుతుండడం వల్ల ఏర్పడుతుంది. ఇది చాలా తొందరగా వ్యాప్తి చెందుతుంది. అందుకే దీనిని అక్యూట్ అంటారు. ఇది చాలా వరకు పదేళ్ల లోపు చిన్న పిల్లలోనే కనిపిస్తుంది కాబట్టి దీనిని బాల్య కాన్సర్ (చైల్డ్‌హుడ్ క్యాన్సర్) అని కూడా అంటారు. కొంతమంది పెద్దవయసు వారిలోనూ అరుదుగా కన్పిస్తుంది. ఈ క్యాన్సర్ బారిన పడే పెద్దల సరాసరి వయస్సు 60 సంవత్సరాలు. చిన్న పిల్లల్లో ఈ వ్యాధిని చాలావరకు నయం చేస్తున్నారు. కానీ పెద్దల్లో 40 శాతం నుంచి 45 శాతం మంది మాత్రమే దీని నుంచి బయటపడే అవకాశం ఉంది.

అక్యూట్ మైలాయడ్ లుకేమియా

అక్యూట్ మైలాయడ్ లుకేమియా అనే రక్త క్యాన్సర్ ఎముక మజ్జలోని మైలోసైట్స్ అనే కణంలో జన్యు మార్పు సంభవించి, అవి నియంత్రణ లేకుండా విభజనకు గురికావడం వల్ల ఏర్పడుతుంది. ఇది చాలా తొందరగా వ్యాప్తి చెందే లక్షణాన్ని కలిగియుండడం వల్ల దీనిని కూడా అక్యూట్ అని పిలుస్తారు. ఇది పిల్లల కన్నా పెద్దల్లోనే ఎక్కువగా ఏర్పడుతుంది. అక్యూట్ మైలాయడ్ లుకేమియా బారిన పడే పెద్దల సరాసరి వయస్సు 65 సంవత్సరాలు. అక్యూట్ మైలాయడ్ లుకేమియా కచ్చితమైన కారణాలంటూ లేవు కాకపోతే కొన్ని కారణాల వల్ల అది సంభవించే ముప్పు అధికమవుతుంది. ఎక్స్‌రేలు, ఇతర రేడియో ధార్మిక కిరణాలు అధికమొత్తంలో శరీరంపై ప్రసరించడం. అంతకు ముందు ఇతర కాన్సర్లకు తీసుకున్న కీమోథెరపీ, రేడియో ధార్మిక చికిత్సల వల్ల కూడా ఈ క్యాన్సర్ వచ్చే అవకాశముంది.



కొంతమందిలో డౌన్స్ సింట్రోమ్ వంటి జన్యు సంబంధిత రోగాలు కూడా ఈ రకం లుకేమియా రావడానికి కారణమవుతున్నాయి.

క్రానిక్ లింపోసైటిక్ లుకేమియా

క్రానిక్ లింపోసైటిక్ లుకేమియా అనే రకం క్యాన్సర్ ఎముక మజ్జ లోని లింఫొసైట్లలో జన్యు మార్పుల వల్ల నియంత్రణ లేకుండా విభజనకు గురవుతుండడం వల్ల ఏర్పడుతుంది. ఈ వ్యాధి యొక్క లక్షణాలు మొదట్లో బయటపడవు. ఇది చాలా నిదానంగా పెరగటం వల్ల దీనిని క్రానిక్ అని అంటారు. ఈ వ్యాధి పెరిగే క్రమంలో, నొప్పిలేని లింఫోసైట్లు వాచడం, నీరసంగా అనిపించడం, జ్వరం, అకారణంగా బరువుతగ్గిపోవడం వంటివి జరుగుతాయి. రక్తహీనత కూడా ఉంటుంది. దీనికీ అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియాకు చాలా దగ్గరి పోలికలుంటాయి. ఇది చాలావరకు పెద్దలలోనే వస్తుంది. దీని బారిన పడే పెద్దల వయస్సు 50 సంవత్సరాలు దాటే ఉంటుంది. ఇది చాలా నిదానంగా పెరుగుతుండడం వల్ల కొంతమందిలో దీనికి చికిత్స అవసరం ఉండదు. కానీ మిగిలిన వారిలో కొన్నేళ్ళ తర్వాత క్యాన్సర్ కణాలు అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియాలాగా చాలా వేగంగా పెరగడం మొదలవుతుంది. దీనిని 'బ్లాస్ట్ క్రైసిస్' అని అంటారు. ఈ 'బ్లాస్ట్ క్రైసిస్'కు చికిత్స చాలా అవసరం. జన్యువులను పరిశీలించి రోగి ఎంత కాలంపాటు చికిత్స అవసరంలేకుండా జీవించొచ్చో స్పష్టం చేస్తారు. ఈ వ్యాధి వంశపార్యపరంగా లేదా ఏజెంట్ ఆరంజ్, పురుగుల మందు వంటి వాటికి గురికావడం వల్ల వస్తుంది. ఈ వ్యాధి ఉన్నవారిలో ఎముక మజ్జ, రక్తం, శోషరసగ్రంథుల్లో బి కణాల లింఫోసైట్లు సంఖ్య పెరుగుతుంది ఈ కణాలు సరిగ్గా పనిచేయక పోవడమే కాకుండా మంచి రక్తకణాలను భర్తీచేస్తాయి. జన్యువు కలిగి ఉన్నది, లేనిది అని రెండురకాలుగా ఈ వ్యాధి ఉంటుంది. వ్యాధి నివారణ పక్వ లింఫోసైట్ల యొక్క సంఖ్య మీద ఆధారపడింది. ఒకవేళ ఆ సంఖ్య గనక తక్కువ ఐతే వ్యాధినిరోధకశక్తి చికిత్స పద్ధతి కెమోథెరపీ ద్వారా నివారిస్తారు. ఈ వ్యాధి మొదటి దశలో యాంటీబయాటిక్స్ వాడితే నివారణ సాధ్యమవుతుంది.

క్రానిక్ మైలాయడ్ లుకేమియా

ఈ రకం క్యాన్సర్ ఎముక మజ్జలోని మైలాయిడ్ రకానికి చెందిన తెల్లరక్త కణాలలో జన్యు మార్పు సంభవించి, అవి నియంత్రణ లేకుండా విభజన జరుగుతుండడం వల్ల ఏర్పడుతుంది. ఇది చాలా నిదానంగా పెరుగుట వల్ల దీనిని క్రానిక్ లుకేమియా అని అంటారు.

నిర్ధారణ

రక్త పరీక్ష ద్వారా లుకేమియా వ్యాధిని



గుర్తించవచ్చు. కానీ అది ఏ రకానికి చెందినదో తెలుసుకోవడానికి మరికొన్ని పరీక్షలు తప్పనిసరిగా చెయ్యాలి. ఈ పరీక్షలకు నమూనాను ఎముక మజ్జ నుంచి సేకరిస్తారు. దీనినే ఎముక మజ్జ జీవాణుపరీక్ష, స్టెమ్‌సెల్ బయాప్సీ అని వ్యవహరిస్తారు.

సూక్ష్మదర్శిని సహాయంతో ఎముక మజ్జలోని 'బ్లాస్టుల' శాతాన్ని కనుక్కుంటారు. (సాధారణంగా ఆరోగ్యంతో ఉన్న వ్యక్తి యొక్క మజ్జలో 3.5% కన్నా తక్కువ బ్లాస్టులుంటాయి). ఫ్లో సైటోమెట్రితో ఇమ్యునోఫీనోటైపింగ్ పరీక్ష చేస్తారు. ఎఫ్ఐఎస్‌హెచ్ పరీక్ష సహాయంతో కణంలోని జన్యువులలో సంభవించిన మార్పులను తెలుసుకుంటారు. వెన్నెముక నుంచి కేంద్రనాడీమండల ద్రవ్యాన్ని, స్పైనల్ టాప్ లేదా లంబార్ పంక్చర్ అనే పద్ధతి ద్వారా బయటకు తీసి కేంద్రనాడీ మండలానికి జబ్బు వ్యాపించిందా అని పరిశోధన చేస్తారు. కొంతమందిలో ఈ వ్యాధి నిర్ధారణ సమయానికే క్యాన్సర్ కేంద్రనాడీమండలానికి వ్యాపించి ఉంటుంది. వీటితో పాటు అల్ట్రాసౌండ్ స్కాన్, సి.టి స్కాన్, ఎం.ఆర్.ఐ వంటి పరీక్షలు చేసి క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించిందా? లేదా అని నిర్ధారిస్తారు.


చికిత్స

లుకేమియాకు సాధారణ చికిత్సగా కీమోథెరపీను ఇస్తారు. కొన్ని సందర్భాల్లో కీమోథెరపీతో పాటు రేడియోథెరపీ, మోనోక్లోనల్ యాంటీబాడీ థెరపీ, ఇమ్యునోథెరపీని ఇస్తారు. ఇవి పని చేయని పక్షంలో ఎముక మజ్జ మార్పడి చికిత్సను చేయాల్సి వస్తుంది. రక్త వ్యాధి నిపుణుడు లేదా క్యాన్సర్ వ్యాధి నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స జరగాలి. కీమోథెరపీ చికిత్సలు, మందులు ఒక్కో రకానికి మారుతుంటాయి చికిత్స తర్వాత రెమిషన్ ఇండక్షన్ విభాగం నెల రోజుల పాటు కొనసాగుతుంది. రోగి ఆసుపత్రిలోనే గడపాలి. ఈ విభాగం యొక్క లక్ష్యం లుకేమియాను వీలైనంతగా తగ్గించడమే. మజ్జలోని 'బ్లాస్టు' కణాలు 5 శాతం కన్నా తక్కువగా చేయడానికి ఈ దశ కీలకమైనది. రెమిషన్ ఇండక్షన్లో చాలా లుకేమియా కణాలు తగ్గినా, శరీరంలో మిగిలి ఉన్న కణాలు మళ్లీ లుకేమియాగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ దశలో రెమిషన్ ఇండక్షన్లో వాడిన మందులతో పాటు మరికొన్ని కొత్త మందులను వాడాల్సిఉంటుంది. లుకేమియా పూర్తిగా కణాలను నశించేలా చేయడమే దీని లక్ష్యం.

- డాక్టర్ రవికిరణ్ బొబ్బ
ఎంబిబిఎస్, ఎండి, ఎఫ్‌ఏసిపీ
మెడికల్ అంకాలజిస్ట్
రవీస్ అమెరికన్ క్యాన్సర్ కేర్
లబ్బీపేట, విజయవాడ



మూలకణాల చికిత్సే మేలు



సాధారణ చికిత్సకు లొంగని వ్యాధులకు మూలకణాల చికిత్స స్టెమ్‌సెల్ చికిత్స ఎంతో మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. మూల కణాలతో 'లుకేమియా' (బ్లడ్ క్యాన్సర్)ను కూడా నయం చేయొచ్చని రుజువైంది. ఇటీవలి వరకూ లుకేమియా వ్యాధికి ఎముక మజ్జ మార్పిడే ప్రధాన చికిత్స. కానీ ఈ చికిత్స అందరు రోగులకూ వీలు కాదు. తోబుట్టువులు, తల్లిదండ్రుల నుంచి ఎముక మజ్జ మార్పిడి చేయటం ఇప్పటివరకూ అనుసరిస్తున్న వైద్య విధానం. కానీ కొన్ని అరుదైన లుకేమియా కేసుల్లో ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడం లేదు. కొందరు రోగులకు మ్యాచ్ అయ్యే డోనర్ దొరకనప్పుడు చికిత్స మరింత క్లిష్టమవుతోంది. అలాంటి రోగులకు స్టెమ్‌సెల్ చికిత్స ఎంతో ఆసరాగా నిలుస్తోంది. రోగులకు తక్కువ ఖర్చులో పూర్తయ్యే స్టెమ్ సెల్ చికిత్స చక్కటి ఫలితాన్నిస్తోంది. స్టెమ్ సెల్ చికిత్సకున్న మరో సౌకర్యం ఏమిటంటే బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అవని వ్యక్తి నుంచి సేకరించిన కణాలతో చికిత్స అందించడం. రక్తం బదులుగా డిఎన్ఎ మ్యాచ్ అయిన వ్యక్తి నుంచి కణాలను సేకరించి ఈ విధానంలో చికిత్స చేయవచ్చు. ఇది ఎంతో మెరుగైన ఫలితాలను అందిస్తూ లుకేమియా బాధితులకు పునర్జీవితాన్నిస్తోంది.



చిన్నారి

జోక్:

రాము : నేను జోక్‌వేస్తే అందరూ నవ్వుతారు తెల్సా!

సోము : హహ్హాహ్హా..

రాము : ఎందుకు అలా నవ్వుతున్నావు రా!

సోము : భలే జోక్ వేసావురా.. అందుకే నవ్వు ఆపుకోలేక పోతున్నా..


పొడుపు కథ

ఎత్తయిన జంతువును దాహమేసినా ఉండగలను ఇసుకలో వేగంగా పోతాను నేనెడారి ఓడను...?

జవాబు : ఒంటె



చుక్కలు కలపండి!



పిల్లలూ! పైనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, ఆ బొమ్మ ఏమిటో కనిపెట్టండి!

ఉడత

ఉడత ఒకటి వచ్చింది
ఉసిరి చెట్టు ఎక్కింది
ఉసిరి కాయ కోసింది
ఉల్లాసంగా కొరికింది
నాకు కొన్ని ఇచ్చింది
నాతో చెలిమి చేసింది
కొమ్మకొమ్మకు ఎగిరింది
చెట్టు అంతా తిరిగింది
చెంత చేరి పట్టబోతే
పరుగు పరుగున పోయింది




- ఊర్మిళ
5వ,తరగతి
ప్రాథమిక పాఠశాల మెయిన్,
హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా




దారి చూపండి!

పిల్లలూ! ఈ చిత్రంలో ఉన్న సిస్టర్.. ఇంజక్షన్ ఉన్న చోటకి వెళ్ళాలి. దారి కనిపెట్టండి



నేను గీసిన బొమ్మ



డి.సుబ్బారావు,
6వ తరగతి,
జెడ్.పి.హెచ్. స్కూలు,
పెనుమాక,
గుంటూరు జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com



భారత్ షమిష్టి విజయం

- మూడో వన్డేలోనూ కివీస్ చిత్తు • వన్డే సిరీస్ 3-0తో కైవసం

టీమిండియా విజయాల పరంపర కొనసాగుతోంది. సోమవారం జరిగిన వన్డేలోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాలతో దూసుకుపోతోంది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను 3-0తో కైవసం టీమిండియా చేసుకుంది. భారత్ ఆల్‌రౌండర్ ప్రదర్శనతో కివీస్‌ను హడలెత్తిస్తుంది. ఒకప్పుడు ఆసీస్, కివీస్ జట్లతో మ్యాచ్‌లు ఆడాలంటే చెమటోడాల్సిన కోహ్లీసేన దీనికి భిన్నంగా ఇప్పుడు వేదిక ఏదైనా, దేశం ఏదైనా జయభేరి మోగించడమే అలవాటుగా చేసుకుంది. నిలకడకు మారుపేరైన న్యూజిలాండ్ జట్టుపై జైత్ర యాత్ర కొనసాగిస్తోంది.



మౌంట్ మాంగనుయ్ : ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో కైవసం చేసుకుంది. బౌలర్లు, బ్యాట్స్‌మన్‌లు సమిష్టిగా రాణించడంతో సోమవారం జరిగిన మూడో వన్డేలో ఏడు వికెట్ల తేడాతో ఆతిథ్య న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. టాస్‌గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టును టీమిండియా బౌలర్లు ఆదిలోనే దెబ్బతీశారు. మన్రో(7)తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ పై గుప్తిల్ కూడా ఔటయ్యాడు. దీంతో 26 పరుగులకే కివీస్ ఓపెనర్లను కోల్పోయింది. అనంతరం వచ్చిన కివీస్ సారథి కేన్ విలియమ్సన్(28), లాథమ్(51) పరుగులతో రాణించడంతో వీరిద్దరి జోడీ మూడో వికెట్‌కు 119 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఈ క్రమంలో చాహల్ లాథమ్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత రాస్ టేలర్ సెంచరీకి దగ్గరవుతున్న సందర్భంలో షమి వేసిన బంతిని షాట్‌కు ప్రయత్నించి కార్తీక్‌కు దొరికిపోయాడు. తరువాత వచ్చిన బ్యాట్స్‌మెన్‌లు విఫలం అవ్వడంతో 49 ఓవర్లలో 243 పరుగులకు కివీస్ ఆలౌట్ అయ్యింది. షమికి మూడు, భువనేశ్వర్, చాహల్, పాండ్యాలకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు శిఖర్ ధావన్(28), రోహిత్ శర్మ(62) ఆడడంతో మంచి శుభారంభమే లభించింది. తరువాత వచ్చిన టీమిండియా సారథి విరాట్ కోహ్లీ(60)తనదైన ఆటను ఆడాడు. రోహిత్‌తో జత కట్టిన కోహ్లీ అప్పుడప్పుడు భారీ షాట్లు కొడుతూ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. భారత్ స్కోర్ 168 పరుగుల వద్ద కోహ్లీ అవుటయ్యాడు. తర్వాత వచ్చిన అంబటి రాయుడు-దినేష్ కార్తీక్‌ల జంట సమోచితంగా ఆడడంతో భారత్ 43 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షమికి లభించింది.

కోహ్లీ మరో రికార్డు

తాజాగా బిసిసిఐ ప్రకటించిన టెస్టు, వన్డే జట్లకు సారథిగా ఎంపికై, ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిన టీమిండియా సారథి రికార్డుల వేటను కొనసాగిస్తున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో విజయం సాధించి కోహ్లీ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటి వరకు 63 వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించిన కోహ్లీ భారత్‌కు 47 విజయాలను అందించాడు. 46 విజయాలు అదించిన వెస్టిండీస్ దిగ్గజం రిచర్డ్స్, దక్షిణాఫ్రికాకు చెందిన హాన్సీ క్రానేలను వెనక్కి నెట్టాడు. విండీస్ దిగ్గజం క్లైవ్ లాయిడ్, ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌లు 50 విజయాలతో అగ్ర స్థానంలో కొనసాగుతున్నారు. దీంతో కోహ్లీ రెండోస్థానంలో కొనసాగుతున్నాడు.

స్కోర్‌బోర్డు..

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : గుప్తిల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 13, మన్రో (సి) రోహిత్ (బి) షమి 7, విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 28, టేలర్ (సి) కార్తీక్ (బి) షమి 93, లాథమ్ (సి) రాయుడు (బి) చాహల్ 51, నికొలస్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 6, సాట్నర్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 3, బ్రాస్‌వెల్ (రనౌట్) కోహ్లీ 15, సోధీ (సి) కోహ్లీ (బి) షమి 12, బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 2, ఫెర్గుసన్ (నాటౌట్) 2, అదనం 11 (మొత్తం 49 ఓవర్లలో 243 పరుగులు)

బౌలింగ్ : భువనేశ్వర్ 10-1-46-2, షమి 9-0-41-3, చాహల్ 9-0-51-2, హార్దిక్ 10-0-45-2, కుల్దీప్ 8-0-39-0, కేదర్ 3-0-17-0

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ (స్టంప్) లాథమ్ (బి) సాట్నర్ 62, ధావన్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 28, కోహ్లీ (సి) నికొలస్ (బి) బౌల్ట్ 60, రాయుడు (నాటౌట్) 40, కార్తీక్ (నాటౌట్) 38, అదనం 17 (మొత్తం 43 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 245 పరుగులు)

బౌలింగ్ : బౌల్ట్ 10-1-40-2, బ్రాస్‌వెల్ 6-0-49-0, ఫెర్గుసన్ 10-1-57-0, సాట్నర్ 10-0-45-1, సోధీ 7-0-53-0.

సౌరాష్ట్రను ఫైనల్‌కు చేర్చిన పుజారా

- 3న విధర్భతో టైటిల్ పోటీ



బెంగళూరు : టీమిండియా టెస్ట్ బ్యాట్స్‌మన్ ఛటేశ్వర పుజారా మరోసారి నయావాల్ పేరును సార్ధకం చేసుకున్నాడు. కర్ణాటకపై ఐదు వికెట్ల తేడాతో సౌరాష్ట్ర గెలుపులో కీలకపాత్ర పోషించాడు. మూడు వికెట్ల నష్టానికి 224 పరుగులతో ఐదోరోజు ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర మరో రెండు వికెట్లను చేజార్చుకొని విజయానికి అవసరమైన 55 పరుగులను రాబట్టింది. పుజారా అజేయంగా 131, జాక్సన్ 100 పరుగులు చేసి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. నవంబర్ 1 నుంచి ప్రారంభమైన రంజీట్రోఫీ సీజన్ చివరి అంకానికి చేరింది. ప్లేట్ డివిజన్‌లో 9, ఎలైట్ గ్రూప్-సిలో 10, ఎలైట్ గ్రూప్-ఏ, బిలో 18 జట్లతో సహా మొత్తం ఈ ఏడాది టైటిల్‌కై 37 జట్లు పోటీపడ్డాయి. ఫిబ్రవరి 3 నుంచి నాగపూర్‌లో జరిగే ఫైనల్లో విధర్భజట్టుతో టైటిల్‌కై సౌరాష్ట్ర జట్టు తలపడనుంది. జట్టు గెలుపులో కీలపాత్ర పోషించిన పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.


కర్ణాటక జట్టు : 275, 239
సౌరాష్ట్ర జట్టు : 236, 279/5

క్లీన్‌స్వీప్ చేస్తుంది : కోహ్లీ



మౌంట్‌మాంగనుయ్: మూడు వన్డేలు ముగిసేసరికే టీమిండియా సిరీస్ గెలవడంతో సంతోషంగా బ్రేక్ తీసుకుంటానని సారథి విరాట్ కోహ్లీ సోమవారం మీడియా సమావేశంలో తెలిపాడు. తాను జట్టులో లేకున్నా చివరి రెండు వన్డేల్లోనూ భారతజట్టు తప్పక గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశాడు. మూడో వన్డే చివర్లలో రాయుడు, కార్తీక్ బాగా బ్యాటింగ్ చేశారని ప్రశంసించాడు. డ్రెసింగ్ రూములో కూర్చుని ప్రతి పరుగుకు కేరింతలు కొట్టామన్నాడు. ఆటగాళ్లు అందరూ తమ ప్రతిభపై నమ్మకం ఉంచి, దాన్ని మైదానంలో ప్రదర్శించడంతో విజయాలు దక్కాయని విశ్లేషించాడు. కాగా, చివరి రెండు వన్డేలకు కోహ్లీ స్థానంలో భారత జట్టుకు కెప్టెన్‌గా రోహిత్ శర్మ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

138కే ఆంధ్ర ఆలౌట్



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కూచ్ బిహార్ ట్రోఫీలో ఆంధ్ర-విదర్భ జట్ల మధ్య క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ సోమవారం ప్రారంభమైంది. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 43.1 ఓవర్లకు 138 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ జట్టులో సుబ్రహ్మణ్యం 33 (57 బంతుల్లో; 5 ఫోర్లు), టి.వంశీకృష్ణ 30 (64 బంతుల్లో; 5 ఫోర్లు) పరుగులు చేయగా, మిగిలిన బ్యాట్స్‌మెన్ స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు క్యూ కట్టారు. విదర్భ బౌలర్లలో భుటే 40 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. ఇతనికి తోడు హర్ష్ దూబె 1 పరుగుచ్చి 2 వికెట్లు, టెకన్ 48 పరుగులిచ్చి 2 వికెట్లు, గులాం ఆలీ 1 వికెట్‌తో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విదర్భ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 49 పరుగులు చేసింది. బికె నాయుడు (2), మందార్ మహలే (5) పరుగులు చేసి ఔటయ్యారు. ఎ.మోఖడే 21, వైవి రాథోడ్ 19 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఆంధ్ర బౌలర్లలో ప్రణయ్ కుమార్, సంతోష్ కుమార్ తలా ఒక వికెట్ లభించాయి. వర్షంకారణంగా మ్యాచ్‌ను అరగంట ముందే నిలిపివేశారు. మ్యాచ్‌ను బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్, క్రికెట్ ప్రకాశం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సిహెచ్ ప్రతాప్ కుమార్ పర్యవేక్షించారు.

టాప్‌లో తొలి ఆసియన్



అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్(డబ్ల్యుటిఏ) సోమవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో జపాన్(ఆసియా)కు చెందిన నొవోమి ఒసాకా అగ్రస్థానంలో నిలిచింది. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను గెలిచిన ఒసాకా, రన్నరప్ క్విటోవా(చెక్) ఒకటి, రెండుస్థానాల్లో నిలిచారు.


International Cricket Council

రాయుడి బౌలింగ్‌పై ఐసిసి నిషేధం

దుబాయ్ : భారత ఆటగాడు అంబటి రాయుడి బౌలింగ్‌పై అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసిసి) నిషేధం విధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయకుండా అతనిపై వేటు వేసింది. రాయుడి బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించిన పరీక్షకు హాజరుకావాల్సిందిగా ఐసిసి ఇప్పటికే ఆదేశించింది. అయితే నిర్ణీత 14 రోజుల్లో అతను హాజరుకాకపోవడంతో ఐసిసి అతనిపై చర్యలకు ఉపక్రమించింది. సిడ్నీలో 13న ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో రాయుడి బౌలింగ్ శైలిపై ఫిర్యాదు అందింది. అయితే బిసిసిఐ నిబంధనల ప్రకారం దేశవాళీ క్రికెట్‌లో అతను బౌలింగ్ కొనసాగించే అవకాశముంది.

పెన్షన్ పెంచా ..ఓటేయండి

పించన్‌దార్లకు సిఎం చంద్రబాబు విజ్ఞప్తి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోటు బడ్జెట్ ఉన్నా తన వంతుగా పెన్షన్ పెంచామని, మీ వంతుగా వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వానికే ఓటు వేయాలని పించన్‌దారులకు సిఎం విజ్ఞప్తి చేశారు. ఏపి జేఏసి, పెన్షన్ సంఘం నేతలు సోమవారం సచివాలయంలో సిఎంను కలిశారు. పించను దార్లు కష్టపడకూడదనే ఉద్దేశంతోనే పది శాతం పెన్షన్ పెంచినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎన్నెమ్మార్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని సిఎంను కోరారు. విద్యా, వైద్య, పంచాయితీరాజ్, జలవనరుల శాఖలో వీరు గత 19 ఏళ్ళుగా పనిచేస్తున్నారని వివరించారు. అవుట్ సోర్సింగ్‌లో 1.80 లక్షల మంది పనిచేస్తున్నారన్నారు. అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల మెటర్నెటి లీవ్, డెత్ ఎక్స్‌గ్రేషియా, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏళ్ళకు పెంచాలన్నారు. ఈ డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడుకి సిఎం సూచించారు. మధ్యంతర భృతి, సిపిఎస్ రద్దు అంశాలను పరిష్కరించాలని సిఎంను నేతలు కోరారు. ఈ సందర్భంగా సిఎంను నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ఏపి జేఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపి పెన్షన్‌దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడమల ఆల్ఫ్రెడ్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

8న చలో విజయవాడ

చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేతనాలకు సంబంధించి తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని కోరుతూ చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు ఫిబ్రవరి 8న చలో విజయవాడ చేపట్టనున్నారు. ఈమేరకు చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాచలం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇదే డిమాండ్‌తో ఈ నెల 22వ తేది నుండి వారు సమ్మె నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే! సమస్య పరిష్కరించకుండా అధికారులు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ తమను తమను విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. వారం రోజుల నుంచి సమ్మెలో ఉన్నందున గ్రామీణ ప్రజలకు 104 సేవలు నిలిచిపోయినప్పటికీ సేవలన్నీ సవ్యంగా జరుగుతున్నట్లు అధికారులు తప్పుడు నివేదిక ఇస్తున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించేవరకు తమ ఆందోళన విరమించేదిలేదని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో భాగంగా మంగళవారం నుంచి వచ్చే నెల 7 వరకు వివిధ రూపాలలో తమ నిరసన తెలుపుతామని, చివరిరోజు చలో విజయవాడ చేపడతామని తెలిపారు.

వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయండి

యునైటెడ్ మెడికల్ , హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఎఎన్ఎమ్, ఎమ్‌పిహెచ్ఎ (మేల్), ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ తదితర వైద్యసిబ్బంది పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ప్రాథమిక వైద్యఆరోగ్య మంత్రి కిడారి శ్రావణ్ కుమార్‌కు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 1900 ఎఎన్ఎమ్ పోస్టులు భర్తీ చేస్తామని పలుమార్లు ప్రకటించినప్పటికీ వాటికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాలేదని తెలిపారు. గత పదేళ్లుగా ఎంతోమంది ఎఎన్ఎమ్‌లు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వారికి రెగ్యులర్ నియామకాల్లో ప్రాధాన్యతనివ్వాలని కోరారు.

రెండు నెలల్లో ఎయిమ్స్‌లో ఓపి సేవలు

డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో నిర్మాణం జరుగుతున్న ఎయిమ్స్‌లో అవుట్‌పేషంట్ సేవలను మరో రెండు నెలల్లో ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి తెలిపారు. దీనికి సంబంధించి తేదీలను త్వరలో ఖరారు చేస్తామని చెప్పారు. ఎయిమ్స్ పాలకమండలి (ఇన్‌స్టిట్యూషనల్ బాడీ) ఏర్పాటైన సందర్భంగా నూతన డైరెక్టర్‌గా నియమితులైన ఆయన సోమవారం సిద్ధార్థ వైద్య కళాశాల ప్రాంగణంలోని తాత్కాలిక ఎయిమ్స్ పరిపాలన కార్యాలయంలో అధ్యక్షులు టిఎస్. రవికుమార్, డిప్యూటి డైరెక్టర్ శ్రమ్‌దీప్ సిన్హా లతో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చినాటికి 12 రకాల ఒపిడి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్స్, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, డెంటిస్ట్రీ, ఫిజియాట్రీ, డయాగ్నస్టిక్స్, ఇఎన్‌టి, కమ్యూనిటీ అండ్ ఫ్యామిటీ మెడిసిన్ విభాగాలలో ఒపి సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. సిజిహెచ్‌ఎస్ ధరలకు అనుగుణంగా రోగనిర్ధారణ సేవలు, మందులు కూడా సబ్సిడీతో అందిస్తామన్నారు. సాధారణ వైద్య విభాగాలకు అదనంగా పది రకాల క్లినికల్ విభాగాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఈ పది విభాగాలకు సంబంధించి 24 మంది బోధకులను నియమిస్తామని ప్రస్తుతం సీనియర్ వైద్య నిపుణుల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. మంగళగిరి ఒపి విభాగంలో మొత్తం 44 మంది బోధనా సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. త్వరలో మంగళగిరి ఎయిమ్స్‌లో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, కమ్యూనిటీ అండ్ ఫ్యామిటీ మెడిసిన్ విభాగంలో 36 మంది బోధనా సిబ్బందిని నియమిస్తామని వివరించారు. వచ్చే ఫిబ్రవరి నాటికి ఎయిమ్స్ నిర్మాణం పూర్తయి, ఒపి సేవలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని స్పష్టంచేశారు. ఎయిమ్స్‌లో తరగతులు ప్రారంభించి ఏడాది కావస్తున్నందున వచ్చేనెల 27 నుంచి మూడు రోజులపాటు 'సెరిబ్రేషన్ ది కొలోక్వియం' పేరుతో ఎయిమ్స్ మంగళగిరి ట్రోఫీ కోసం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అందులోభాగంగా అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ వంటి పలు అంశాలలో సెమినార్ పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలల మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటారని వివరించారు. కళాశాల డీన్ జాయ్ ఎ ఘోషల్, అసోసియేట్ డీన్ దేశాయ్ వైద్య శ్రీపద్, అముద రాజ్, మెడికల్ సూపరింటెండెంట్ రాకేష్ కక్కర్ సమావేశంలో పాల్గొన్నారు.

15 నెలల్లో 73 లక్షల ఉద్యోగాల కల్పన అవాస్తవం!

న్యూఢిల్లీ:15 నెలల్లో 73 లక్షలమందికి ఉద్యోగాలు కల్పించామంటూ ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన లెక్క ఎంత అబద్ధమో వాస్తవాలు పరిశీలిస్తే అర్థమవుతోంది. ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్‌వో)లో వేతన జీవులను నమోదు చేయడంలో భాగంగా జరిగిన విధాన ప్రక్రియను మోడీ ప్రభుత్వం తెలివిగా తమకు అనుకూలంగా మలచుకున్నతీరు చూస్తే అంతా ఆశ్చర్యపోవాల్సిందే. 2017 సెప్టెంబర్ నుంచి 2018 నవంబర్ వరకు ఈపీఎఫ్‌వో ఖాతా లు తెరిచిన ఉద్యోగుల సంఖ్యను కొత్తగా ఉద్యో గాలు పొందినవారిగా బీజేపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. అసలు జరిగిందేమంటే.. లెక్క వాస్తవమే. కానీ, వారంతా కొత్తగా ఉద్యోగాలు పొందినవారు కాదు. ఆ 15 నెలల్లో ఈపీఎఫ్‌వోలో నమోదైన ఉద్యోగుల సంఖ్య 73 లక్షల 50 వేలు. అయితే, వారిలో కొందరు గతంలో ఆయా సంస్థల్లో ఒప్పంద కార్మికులుగా పని చేస్తూ ఆ 15 నెలల కాలంలో వేతన ఉద్యోగులుగా నమోదైనవారు.



వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

- ఆర్‌పిఐ అధ్యక్షుడు కొమ్మారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను పోటీకి నిలబెడతామని ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. విజయవాడలో మిడ్‌సిటీ హోటల్లో ఆదివారం జరిగిన అర్పిఐ పార్టీ రాష్ట్ర స్థాయి విస్తత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పత్రికలకు విడుదల చేశారు. ఫిబ్రవరి చివరి వారంలో అన్ని జిల్లాల అర్పిఐ పార్టీ అధ్యక్షులు అభ్యర్థుల జాబితా తయారు చేసి రాష్ట్ర కేంద్రానికి నివేదికలు అందచేస్తారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సభ్యత్వం, కమిటీలు, అభ్యర్థుల ఎన్నిక, పార్టీ నిధులు, జిల్లాల విస్తత స్థాయి సమావేశాల ఏర్పాటు తదితర విషయాలపై సమావేశంలో చర్చించినట్లు అధ్యక్షుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షురాలుగ మలేషియాలో జరిగిన అయిదవ అంతర్జాతీయ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన వీరస్వామిని సమావేశంలో ఘనంగా సన్మానించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

ఒక్కరే బోధకులు

- రాష్ట్రంలో 7,843 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత తీవ్ర స్థాయిలో ఉన్నా భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా లేవని చెబుతున్న విద్యాశాఖ మరోపక్క కేంద్రానికి వేల సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని నివేదికలు పంపుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కరే బోధన చేస్తున్న పరిస్థితి రాష్ట్రంలో ఉంది. విద్యాహక్కు చట్టానికి ఏకోపాధ్యాయ పాఠశాలలు వ్యతిరేకమనే నిబంధనను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 7,843 పాఠశాలల్లో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు పాఠాలు బోధిస్తున్న పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా 93వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉంటే రాష్ట్రం ఐదో స్థానంలో ఉండడం గమనార్హం.

మానవ వనరుల అభివృద్ధిపై ఇటీవల ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. ప్రైవేట్ పాఠశాలల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తుంటే, ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పాఠశాలలకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉంటున్నారు. ఈ రెండింటిని తల్లిదండ్రులు బేరీజు వేసుకొని తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. 2013-14 విద్యాసంవత్సరంలో 46లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో, 27లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. 2018-19 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 36లక్షలకు పడిపోగా, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య 34 లక్షలకు చేరుకుంది.

ప్రభుత్వం తీరు వల్లే ఈ పరిస్థితి

రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయ ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయకుండా కాలయాపన చేయడంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోతు న్నాయి. విద్యార్థులు పెరుగుతున్నా అదనపు ఉపాధ్యాయుడిని నియమిం చడం లేదు. రేషనలైజేషన్ ప్రకారం కూడా కనీసం ఉపాధ్యాయులు ఇద్దరు ఉండాలి. రెండో ఉపాధ్యాయుడిని నియమించాలి.

పి బాబురెడ్డి, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం మమ్మల్ని మోసగించింది

- కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనం పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 12 కాంట్రాక్టు లెక్చరర్లకు తీవ్ర అసంతృప్తి కలిగించిందని ఎపి ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాస యాదవ్, బిజె గాంధీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి మినీమం టైం స్కేల్(బేసిక్+డిఎ) అమలు చేస్తామని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పత్రికా ముఖంగా కూడా ప్రకటించారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన బేసిక్‌నే అమలు చేస్తూ ప్రభుత్వం జీవో 12ను విడుదల చేసిందని పేర్కొన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వం ఎమ్మెల్సీల కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. జీవో 187 ద్వారా తాము మూలవేతనం అందుకోవాలని తెలిపారు. రాష్ట్రవిభజన తరువాత పదో పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాల్సి ఉండగా, జీవో 95 ద్వారా కేవలం 50శాతమే వేతనం పెంచారని తెలిపారు. గతంలో రావాల్సిన బేసిక్‌ను ఇప్పుడు అమలు చేస్తూ కాంట్రాక్టు లెక్చరర్లను ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తోందని విమర్శించారు. పదోన్నతులు, భర్తీ ద్వారా కాంట్రాక్టు లెక్చరర్లు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని తొలగించమని విద్యాశాఖ మంత్రి చెబుతూనే ఎపిపిఎస్‌సి ద్వారా భర్తీకి ఆదేశాలు ఇచ్చారని విమర్శించారు.

ఏఎంయూ వీసీకి బెదిరింపులు

- ఏబీవీపీ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినందుకు..

లక్నో: ఏబీవీపీ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారనే కారణంతో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) వైస్ ఛాన్స్‌లర్‌కు ఉత్తరప్రదేశ్ మంత్రి రఘురాజ్ సింగ్ నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. వివరాల్లోకెళ్తే.. మూడు రోజుల క్రితం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు ఏబీవీపీ నాయకులు ఏఎంయూలో 'తిరంగ ర్యాలీ' పేరిట బైక్ ర్యాలీ తీశారు. ఏబీవీపీ నాయకుడు అజయ్ సింగ్ నేతృత్వంలో ఈ ర్యాలీ జరిగింది. అయితే ఎలాంటి అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు గానూ వర్సిటీ క్రమశిక్షణాధికారి మోహిసిన్ ఖాన్ వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంఘ వ్యతిరేక శక్తులు ర్యాలీలో పాల్గొన్నాయని, వర్సిటీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకే తాము ఈ నోటీసులు జారీ చేశామని ఆయన తెలిపారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68